అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 21-10-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 244 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50



(ఫైల్)

వీఎస్ జీవిత కథ ఎ సెంచరీ ఆఫ్ స్ట్రగుల్

ఆవిష్కరించిన కేరళ సీఎం పినరయి విజయన్

వివరాలు 11లో..



గజ్వేల్‌లో అనుకున్నంత అభివృద్ధి జరగలేదు

భవిష్యత్తులో రాష్ట్రానికే తలమానికం కావాలి

- ఇక నుంచి నెలకోరోజు నియోజకవర్గ ప్రజల మధ్యే ఉంటా : గజ్వేల్ కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్

నవ తెలంగాణ- గజ్వేల్


'అందరూ గజ్వేల్ నియోజకవర్గంలో బాగా అభివృద్ధి జరిగిందని చెప్పుకుంటున్నారని, తాను అనుకున్న స్థాయిలో గజ్వేల్‌లో అభివృద్ధి జరగలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తూంకుంటలోని ఎస్ఎస్ఆర్ పుష్ప కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే శాసనసభ ఎన్నికల్లో తిరిగి విజయం సాధించిన తర్వాత గజ్వేల్ అభివృద్ధిపై నెలకోసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రజల మధ్యే గడుపుతానన్నారు. ప్రతిపాదనలు, సమీక్షలు నిరంతరం ఉంటాయన్నారు. జరగబోయే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించబోతుందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 95 నుంచి 100 అసెంబ్లీ స్థానాలు గెలుచుకోబోతున్నామని ...11లో



కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి

బీఆర్ఎస్‌ను గద్దె దించండి

- పసుపుకు మద్దతు ధర కల్పిస్తాం
- మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- బీఆర్ఎస్ అవినీతిపై సీబీఐ, ఈడీ దాడులెందుకు లేవు..?
- బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటే.. : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



నవతెలంగాణ-మోర్తాడ్/ఆర్మూర్/ జగిత్యాల

"రాష్ట్రంలో నియంతృత్వ ప్రభుత్వాన్ని తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైంది.. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ కోసం రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆశీర్వదించి గెలిపించాలి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పసుపు పంటకు మద్దతు ధర కల్పిస్తాం.. వరి ధాన్యానికి బోనస్ ఇస్తాం.. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం.. బీఆర్ఎస్ పాలనలో దోచుకున్న ప్రజల సొమ్మును బయటకు తీస్తాం" అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.

టీపీసీసీ విజయభేరి బస్సు యాత్ర శుక్రవారం జగిత్యాల, నిజామాబాద్ జిల్లా మోర్తాడ్, ఆర్మూర్‌లో సాగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ప్రజా సంక్షేమం కోసమే పని చేస్తుందని చెప్పారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం దోచుకోవడం.. దాచుకోవడమే ...11లో

బీజేపీని ఓడించాలి... దేశాన్ని రక్షించాలి

ఎన్నికల రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా రైతుల ప్రచారం

- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'బీజేపీని.. ఓడించాలి. కార్పొరేట్లను వ్యతిరేకించాలి. దేశాన్ని రక్షించాలి' అనే నినాదంతో ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ప్రచారం చేస్తామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) స్పష్టం చేసింది. శుక్రవారం నాడిక్కడ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ కె ఎం నేతలు హన్నన్ మొల్లా, బల్దేవ్‌సింగ్ నిహాల్కర్, రాజారామ్ సింగ్, పి. కృష్ణప్రసాద్, ప్రేమ్‌సింగ్, సత్యవాన్ మాట్లాడారు. "బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు లాభాలు తెచ్చే విధంగా విధానాలు రూపొందిస్తూ దేశంలోని రైతులను మోసం చేస్తోంది. మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్నప్పటికీ, చారిత్రాత్మక పోరాటంలో రైతులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదు. పోరాటంలో రైతులపై బనాయించిన అక్రమ కేసులు ఉపసంహరించుకోలేదు. లఖింపూర్ ఖేరీ హత్యాకాండ కుట్రలో ప్రమేయం ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా మంత్రిగానే కొనసాగుతున్నారు. రైతుల పోరాటానికి మద్దతు తెలిపిన న్యూస్‌క్లిక్ వెబ్ పోర్టల్‌పై తప్పుడు కేసు పెట్టారు. ఈ కేసు ఎఫ్ఐఆర్‌లోకి రైతుల పోరాటాన్ని కూడా లాగారు. దేశభక్తి ఉన్న రైతులను దేశ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తు న్నారు. ఈ ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1 నుంచి 5 వరకు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తాం. సాయంత్రం 6 గంటలకు దేశవ్యాప్తంగా ఎఫ్ఐఆర్ కాపీని తగులబెడతాం. 26 నుంచి 28 వరకు 72 గంటల పాటు రాత్రి పగలు రాష్ట్ర రాజధానుల్లోని రాజ్‌భవన్‌ల ఎదుట మహాధర్నా నిర్వహిస్తాం. ఈమేరకు ఉమ్మడి కిసాన్ మోర్చా సమావేశంలో నిర్ణయించాం" అని తెలిపారు. రైతుల ఉద్యమానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడం ఆపాలని హితవు పలికారు. రైతులు పండించిన పంటల ప్రభుత్వ సేకరణ, కనీస మద్దతు ధర చట్టాన్ని నిషేధించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నంచేస్తుందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచారని, బ్లాక్ మార్కెటీర్లకు స్వేచ్ఛను ఇస్తున్నారని విమర్శించారు.

సంక్షేమం..సంక్షోభం

ఆర్థిక స్కీంలకు సీఈసీ అనుమతి తప్పనిసరి

- ట్రెజరీలో భారీగా బిల్లులు పెండింగ్
- ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మికీ కష్టకాలం
- నిలిచిన గొర్రెల పంపిణీ
- లబ్దిదారులే...ఓటర్లు...
- ఆ కోణంపై ఎన్నికల సంఘం దృష్టి
- సీఎస్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ ఏర్పాటు

సంక్షేమ పథకాల లబ్దిదారుల్నే ఓటర్లుగా నమ్ముకున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి కొత్త చిక్కొచ్చిపడింది. వచ్చే నెలలో (నవంబర్) ఆసరా పెన్షన్లు సహా, ఆర్థికంతో ముడిపడిన అన్ని పథకాల లబ్దిదారులకూ తాత్కాలికంగా చెల్లింపులు నిలిపేయాలనే ఆలోచనలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఉన్నట్టు సమాచారం. అయితే ఇవన్నీ అమల్లో ఉన్న పథకాలే (ఆన్‌గోయింగ్ స్కీమ్స్) కాబట్టి, వాటిని నిలుపుదల చేయడం సరికాదనీ, ఆ బిల్లులకు తక్షణం అమోదం తెలపాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక ఇచ్చినట్టు తెలిసింది.



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రతి పైసా ఖర్చుకూ సీఈసీ అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే ఈనెల 10వ తేదీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధ్యక్షతన ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేశారు. దీనిలో ఆయా శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాటైన ఈ కమిటీ ఆర్థికానికి ముడిపడి ఉన్న ప్రతి అంశానికి సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)కి పంపాలి. వాటికి అనుమతి కోసం సీఈవో కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతారు. ఆమోదం లేదా తిరస్కారం ఏదైనా మళ్లీ అదే పద్ధతిలో వెనక్కి వస్తాయి. ఈ నేపథ్యంలోనే ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, గొర్రెల పంపిణీ వంటి అనేక పథకాల చెల్లింపులకు సంబంధించిన ప్రతిపాదనల్ని ఈనెల 16వ తేదీనే సీఈఓకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పంపినట్టు సమాచారం. అయితే ఈ చెల్లింపులకు సంబంధించిన అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలుపుదల చేయమని చెప్పినట్టు తెలిసింది. ఈ స్కీంలలోని లబ్దిదారులంతా ఓటర్లే కాబట్టి, ఎన్నికల సమయంలో వారిని నేరుగా ప్రభావితం చేసినట్టు ఉంటుందనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. అయితే దీనిపై ప్రభుత్వ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితిని ముందే ఊహించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా పింఛన్ లబ్దిదారులకు అక్టోబర్ నెలలో ఇవ్వాల్సిన పింఛన్ డబ్బుల్ని గతనెల (సెప్టెంబర్) 30వ తేదీనే వారి ఖాతాల్లో జమచేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్ల కోసం రూ.58,542 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నది. వీరిలో వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నవారు 16,44,280 మంది ఉన్నారు. వితంతు పింఛన్ లబ్దిదారులు 15,85,088 మంది, ఒంటరి మహిళలు 1,43,930 మంది, బీడీ కార్మికులు 4,25,793 మంది, వికలాంగులు 5,16,890 మంది ఉన్నారు. వీరితో పాటు బోదకాలు బాధితులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, కళాకారులు ఉన్నారు. కళ్యాణలక్ష్మి/ షాదీముబారక్ దరఖాస్తుదారులు, విదేశీవిద్య కోసం వివిధ కార్పొరేషన్లకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. అయితే వీరంతా లబ్దిదారులతో పాటు ఓటర్లుగా కూడా ఉండటంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిధుల చెల్లింపులను తాత్కాలికంగా నిలుపుదల చేయమని రాష్ట్ర ట్రెజరీ విభాగానికి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. దీనితో ట్రెజరీ నుంచి ప్రస్తుతం ఎలాంటి చెల్లింపులు జరగట్లేదని అక్కడి ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఎయిడెడ్ టీచర్లకు మూడు నెలలుగా జీతాలు లేవనీ ఆ బిల్లులు కూడా ట్రెజరీ వద్దే పెండింగ్‌లో ఉన్నాయని చెప్తున్నారు. అలాగే ఇటీవల పదోన్నతులు పొందిన టీచర్ల జీతాల ...11లో

పింఛన్లు	లబ్దిదారుల సంఖ్య	చెల్లిస్తున్న సొమ్ము (రూ. కోట్లలో.)
1. వృద్ధాప్య పింఛన్లు	16,44,280	18,555.71 కోట్లు
2. వితంతు పింఛన్లు	15,85,088	20,556
3. ఒంటరి మహిళలు	1,43,930	1,545.80
4. బీడీ కార్మికులు	4,25,793	5,712
5. వికలాంగులు	5,16,890	10,310
6. కల్లుగీత కార్మికులు	67,048	880.45
7. చేనేత కార్మికులు	38,240	518.58
8. కిడ్నీ వ్యాధిగ్రస్తులు	4,507	2.67
9. హెచ్ఐవీ/ఎయిడ్స్	37,005	411.80
10. కళాకారులు	1,967	49.30

(వీరుకాకుండా కళ్యాణలక్ష్మి/ షాదీముబారక్ లబ్దిదారులు, గొర్రెల పంపిణీ లబ్దిదారులతో పాటు ఇతరులు కూడా ఉన్నారు.)



వృత్తిరక్షణ ఉద్యమాలను బలోపేతం చేద్దాం..

గీత కార్మిక సంఘం 66ఏండ్ల ప్రస్థానంలో త్యాగాలెన్నో.. : కేజీకేఎస్ ఉత్సవాల్లో పలువురు వక్తలు

వివరాలు 2లో..

ఇలాంటి పిటిషన్లతో ప్రయోజనం ఏంటీ!



కారు, రోడ్ రోలర్‌కు తేడా తెలియని నిరక్షరాస్యులు కాదు ఓటర్లు : బీఆర్ఎస్ పిటిషన్ల పై సుప్రీంకోర్టు

- దాఖలు చేసిన రెండు పిటిషన్లూ తిరస్కరణ 11లో..

ఈనగాచి నక్కల పాల్జేయొద్దు..

ఎట్టికైనా.. మట్టికైనా మనోడే కావాలి.. : మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు

- బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న రావుల, జిట్టా, మామిళ్ల రాజేందర్
- రేపో మాపో కారెక్కనున్న చెరుకు సుధాకర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇతర పార్టీలకు ఓట్లేయటం ద్వారా తెలంగాణను ఈనగాచి నక్కల పాల్జేయొద్దంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజల పట్ల సీఎం కేసీఆర్‌కు ఉన్న ఆర్తి...ప్రధాని మోడీకో, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకో ఉండబోదని అన్నారు. 'ఎట్టికైనా, మట్టికైనా మనోడే కావాలి...' అంటూ వ్యాఖ్యానించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో టీడీపీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, భువనగిరి జిల్లాలో క్రియాశీలకంగా ఉన్న జిట్టా బాలకృష్ణారెడ్డి, టీఎన్జీవో నేత మామిళ్ల రాజేందర్... మంత్రి కేటీఆర్ సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ... గతంలో సోనియాను బలి దేవతంటూ విమర్శించిన రేవంత్... ఇప్పుడు ఆమెను పొడుగుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది బిడ్డలు అమరులు కావటానికి కాంగ్రెస్సే కారణమని విమర్శించారు. టీఆర్ఎస్సే లేకుంటే టీపీసీసీ, తెలంగాణ ...11లో

ధిక్కార స్వరాలు..


బీఆర్ఎస్ బెంబేలు

- సీటివ్వకపోయినా రెబల్‌గా నిలుస్తామంటున్న ఆశావహులు
- కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే రేఖా నాయక్
- భూపాలపల్లిలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి తనయుడి అలక
- పటాన్‌చెరులో పోటీ చేస్తానంటున్న నీలం మధు
- జహీరాబాద్‌లో 'గులాబీ'కి షాకిచ్చిన ఢిల్లీ వసంత్

బి.వి.యన్.పద్మరాజు



ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల పట్ల ఇన్నాళ్లూ 'ధిక్కారమును సైతునా...' అన్నట్టు వ్యవహరించిన బీఆర్ఎస్‌కు ఇప్పుడు సొంత పార్టీ నుంచే 'ధిక్కార స్వరాలు' వినబడుతున్నాయి. పార్టీ నుంచి సీటిచ్చినా, ఇవ్వకపోయినా కచ్చితంగా పోటీ చేసి తీరతామంటూ పలువురు నేతలు, ఆశావహులు తేల్చి చెబుతున్నారు. అభ్యర్థుల మీద వ్యతిరేకత, కర్నాటక ఫలితాల ప్రభావం, కాంగ్రెస్‌కు సానుకూల వాతావరణంతో ఇప్పటికే కొంతలో కొంత ఇబ్బందికి గురవుతున్న గులాబీ పార్టీకి ఇప్పుడు 'రెబల్స్' బెడద మరిన్ని చిక్కులు తెచ్చే ప్రమాదం పొంచి ఉంది. తొలి జాబితాలోనే 115 మంది అభ్యర్థులను ప్రకటించటం, వారిలో వంద మందికి బీ-ఫామ్‌లు అందజేసిన నేపథ్యంలో తమకు ఇక అధికార పార్టీ నుంచి సీటు వచ్చే అవకాశం లేదని తెలిసిన నేతల్లో కొందరు పార్టీ మారుతుండగా, మరికొందరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని నిర్ణయించు కున్నారు. వీరిలో కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాగా, మరికొందరు యువ నాయకులు ఉన్నారు. భూపాలపల్లి నుంచి గత ఎన్నికల్లో గెలిచిన గండ్ర వెంకట రమణారెడ్డి(కాంగ్రెస్‌లో గెలిచి, ఆ తర్వాత కారెక్కారు)కే ఈసారి కూడా బీఆర్ఎస్ టిక్కెటిచ్చింది. అక్కడి నుంచి 2014లో గెలిచిన మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు ప్రశాంత్ రూపంలో బీఆర్ఎస్‌కు గండం ఎదురవుతున్నది. నియోజకవర్గంలో గండ్ర కుమారుడి వేధింపులు తట్టుకోలేకపోతున్నామంటూ మాజీ స్పీకర్ తనయుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. అందువల్ల తాను కచ్చితంగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానంటూ ప్రశాంత్ చెబుతూ వస్తున్నారు. ఆసిఫాబాద్‌లో సీటు దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్... కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. ఇక ఇప్పటి వరకూ టిక్కెట్ ఎవరికిచ్చినా కచ్చితంగా మద్దతిస్తాననీ, సీఎం కేసీఆర్ మాటే వేదవాక్కంటూ చెప్పిన ...11లో



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 61,530	▲	770
22 క్యారెట్లు	- 56,400	▲	700
కిలో వెండి	- 77,500	---	----



చికెన్ ధరలు

హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 94
రిటైల్ (లైవ్)	రూ. 116
స్కిన్‌తో	రూ. 168
స్కిన్‌లెస్	రూ. 191

వృత్తిరక్షణ ఉద్యమాలను బలోపేతం చేద్దాం..

ఉపాధి, సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా ముందుకు

- గీత కార్మిక సంఘం 66 ఏండ్ల ప్రస్థానంలో త్యాగాలెన్నో..
- కేజీకేఎస్ ఉత్సవాల్లో పలువురు వక్తలు
- ఆటపాటలతో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకట్టుకున్న సర్వాయి పాపన్న చిత్ర ప్రదర్శన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గీత వృత్తిదారుల బతుకు బాధలన్నింటిని ఒడిసిపట్టి, పోరాట నినాదాలకు రూపమిచ్చిన సంఘం కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్). పాలకుల నిర్లక్ష్యం, పెత్తందార్ల దాష్టీకంపై అది అలుపెరగని పోరాటాలు చేసింది. కార్మికుల కష్టాలు, వృత్తి రక్షణ కోసం రాజీలేని రణం నడిపింది. ఎన్నో త్యాగాలు చేసింది. ఈ క్రమంలో అమరులైన వారెందరో..వారందరికీ వందనాలంటూ సభికులు నినాదాలు చేశారు. కల్లుగీత కార్మిక సంఘానికి 66ఏండ్లు నిండిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేజీకేఎస్ ఆధ్వర్యంలో సాంస్కృతికోత్సవాలను నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఒకరికొకరు అలాయ్‌బలాయ్ తీసుకున్నారు. గీత వృత్తి రక్షణకోసం ఉద్యమిస్తామంటూ నినాదాలు చేశారు.

మోకు, ముస్తాదుతో వచ్చిన కొందరు కార్మికులు వృత్తి కష్టాలను వెళ్లబోసుకున్నారు. కళాకారులు ఆటపాటలతో అదరగొట్టారు. గీత వృత్తిలో కార్మికుడి వెతల్ని కైకట్టి పాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. నీరా, తాటి, ఈత ఉత్పత్తులు, స్వచ్ఛమైన కల్లు, సేఫ్టీ మోకు, ఆకర్షణీయంగా నిలిచాయి. గీత వృత్తికోసం పాటుపడిన పెద్దలనూ, వివిధ సంఘాల నేతలను సభలో సత్కరించారు. 'అమరులను యాది చేసుకుందాం.. హక్కులను సాధించుకుందాం'మంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న వీరోచిత పోరాట చరిత్రను వివరించే చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. చిత్రకారుడు భాస్కర్ కుంచెతో రూపుదిద్దిన ఈ ఎగ్జిబిషన్ సభికులను విశేషంగా ఆకట్టుకున్నది.

సంఘం అధ్యక్షులు ఎంవీ రమణ అధ్యక్షతన ఈ సభ జరిగింది. పలువురు వక్తలు మాట్లాడారు. కేజీకేఎస్ పోరాటాలను మననం చేసుకున్నారు. సంఘాన్ని నడిపిస్తున్న నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ 1957 అక్టోబర్ 19,20 తేదీల్లో తమ సంఘం మొదటి రాష్ట్ర మహాసభ మహబూబాబాద్ జిల్లా గార్లలో జరిగిందని తెలిపారు. బొమ్మగాని ధర్మభిక్షం, ఎస్ఆర్ దాట్ల నాయకత్వంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అది ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందన్నారు. అనేక హక్కులు సాధించిందని తెలిపారు. వారి పోరాట స్ఫూర్తితో కల్లుగీత కార్మికుల ఉపాధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజకీయ పార్టీల కతీతంగా గీత కార్మికులను సమీకరించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మెన్ బాలగోని బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ నాడు సంఘం నాయకులు వేలం పాటల విధానానికి వ్యతిరేకంగా పోరాడి సొసైటీలను ఏర్పాటుకు ఒత్తిడి తెచ్చారని గుర్తుచేశారు. మహిఫూజ్ చట్టాన్ని రద్దు చేయించి, చెట్టుపై హక్కు గీత కార్మికులకే కల్పించారన్నారు. వారి త్యాగం మరువలేనిదన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు పాట ఆయుధంగా పనిచేస్తుందన్నారు. కళల ద్వారా ప్రజా చైతన్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిలి వెంకన్న గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతల మల్లేశం గౌడ్, సుప్రజ హాస్పిటల్ ఎండి శిగ విజయ్ కుమార్ గౌడ్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, కేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి వెంకట నరసయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు యం. కృష్ణ స్వామి గౌడ్, బోయపల్లి సుధాకర్ గౌడ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు గౌనీ వెంకన్న, బాల్నే వెంకట మల్లయ్య, ఎస్ రమేష్ గౌడ్, గాలి అంజయ్య, పామను గుల్ల అచ్చాలు రాష్ట్ర కమిటీ సభ్యులు మడ్డి అంజిబాబు, రాగిరి కృష్ణయ్య, అబ్బ గాని బిక్షం ,అంతటి అశోక్ కొండ వెంకన్న, రాచకొండ వెంకట్ గౌడ్, కుర్ర ఉప్పలయ్య, కంకటి రాజన్న,యమగని ఎంకన్న తండా రాముడు డొంకెల రామన్న ,బబ్బూరి ఉప్పలయ్య, గౌని సాంబయ్య ,మెరుగు వీరస్వామి, తాళ్లపల్లి నరసయ్య, నడిమింటి ఆశన్న గౌడ్, గడ్డమీద జంగన్న గౌడ్, అంబాల శ్రీనివాస్ గౌడ్, భీమ గాని చంద్రయ్య, మాటూరి బాలరాజు గౌడ్, గుణగంటి మోహన్ బుర్ర శ్రీనివాస్, బండి కుమార్, కప్పల లింగం, సట్ల ప్రభాకర్ ,కొండ అన్నపూర్ణ, ఎం స్వర్ణ, బొడ పట్ల జయమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

అధిక వడ్డీ రేట్లు కొనసాగుతాయ్..

- ఎంతకాలమో చెప్పలేము
- ఆహార ద్రవ్యోల్బణంలో అనిశ్చితి : ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ/వాషింగ్టన్:రుణ గ్రహీతలు హెచ్చు వడ్డీ రేట్లను మరికొంత కాలం భరించాల్సిందే. అధిక వడ్డీ రేట్లు ఎంత కాలం కొనసాగుతాయో చెప్పలేమని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో దాస్ మాట్లాడుతూ.. కొంతకాలం వడ్డీ రేట్లు ఇదే స్థాయిలో కొనసాగుతాయన్నారు. ప్రస్తుత ఆర్థిక విధాన రూపకల్పన సంక్లిష్టంగా మారిందన్నారు. 2023లో ఇప్పటివరకు పాలసీ రేట్లపై ఆర్బీఐ విరామం కొనసాగించిందన్నారు. భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల వల్ల ద్రవ్యోల్బణం కట్టడికి కేంద్ర బ్యాంకులన్నీ వడ్డీ రేట్లు పెంచాయన్నారు. ఈ క్రమంలో ఆర్బీఐ సైతం 2022 మే నెల నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వరుసగా వడ్డీ రేట్లను పెంచుతూ రెపోరేటును దాదాపు 250 బేసిస్ పాయింట్ల (2.5 శాతం) మేర హెచ్చించింది. ఇప్పటికే రెపో రేటు 6.50 శాతానికి చేరింది. ఈ రుణ రేట్లు ఎంతకాలం స్థిరంగా ఉంటాయో అప్పుడే చెప్పలేమని, కాలమే దానికి సమాధానం చెప్పొచ్చని శక్తికాంత అన్నారు.

ప్రపంచ వద్ధిలో మందగమనం, ద్రవ్యోల్బణం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉందన్నారు. ఆహార ద్రవ్యోల్బణంలో అనిశ్చితి నెలకొందన్నారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్బీఐతో సహా సెంట్రల్ బ్యాంకులు ఆర్థిక స్థిరత్వాని కాపాడుకోవడంలో బాధ్యత వహించాలన్నారు. ముడి చమురు ధర పెరుగుదల, బాండ్ల రాబడి పెరగడం వంటి తాజా సవాళ్లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలవరపెడుతున్నాయని దాస్ అన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితుల్లో అయినా బ్యాంకులు కనీస మూలధన అవసరాలను తీర్చగల సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని అంచనా వేశారు. రూ.10వేల కోట్ల విలువైన రూ.2వేల నోట్లు వెనక్కి రావాల్సి ఉందని అన్నారు. ప్రస్తుతం 19 ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో రూ.2వేల నోట్లను స్వీకరిస్తున్నారు.

రేట్ల పెంపు తప్పదు : యూఎస్ ఫెడ్ చైర్మెన్

ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో వడ్డీ రేట్లను మరింత పెంచాల్సి ఉంటుందని అమెరికా ఫెడ్ రిజర్వ్ చైర్మెన్ జెరోమ్ పావెల్ అన్నారు. బలమైన ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు రేట్ల పెంపు ఉంటుందన్నారు. ముఖ్యంగా ద్రవ్యోల్బణ కట్టడికి ఈ చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కావాల్సి ఉందన్నారు. ఇందుకోసం భవిష్యత్తులో వడ్డీరేట్లు పెంచక తప్పదన్నారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినా ఇంకా ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతుందన్నారు. ద్రవ్యోల్బణం రెండు శాతానికి పడిపోయేంత వరకు వడ్డీరేట్లు పెంచే అవకాశం ఉందన్నారు.

ఐడిబిఐ బ్యాంక్‌కు అసోచామ్ అవార్డులు

న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్తల సంఘం అసోచామ్ తన 18వ వార్షిక బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సెక్టార్ లెండింగ్ సదస్సు అండ్ అవార్డుల కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్‌కు మూడు అవార్డులు దక్కాయి. బ్యాంక్ మిడ్ సైజ్ బ్యాంక్ విభాగంలో "బెస్ట్ డిజిటల్ ఇనిషియేటివ్స్"లో విజేతగా మరియు "బెస్ట్ రిస్క్ అండ్ సైబర్ సెక్యూరిటీ ఇనిషియేటివ్స్", "బెస్ట్ ప్రొడక్ట్/సర్వీస్ ఇన్నోవేషన్"లో అవార్డులు అందుకున్నట్లు ఐడిబిఐ బ్యాంక్ వెల్లడించింది. ఈ అవార్డులను రిజర్వు బ్యాంకు మాజీ డిప్యూటీ గవర్నర్ ఎస్ఎస్ విశ్వనాథన్, అసోచామ్ అధ్యక్షుడు జి రాజ్‌కిరణ్ రాయ్ సమక్షంలో ఆర్‌బిఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ కుమార్ చౌదరి నుంచి ఐడిబిఐ బ్యాంక్ డిఎండి సురేష్ ఖతన్‌హర్‌కు అందజేశారని తెలిపింది.

రూ.30 వేల కోట్ల అదానీ సిమెంట్ రుణాల రీఫైనాన్స్

న్యూఢిల్లీ : అదానీ సిమెంట్ కంపెనీల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి అంతర్జాతీయ బ్యాంక్‌లు అంగీకరించాయని అదానీ గ్రూపు వెల్లడించింది. దాదాపు రూ.30వేల కోట్లు (3.5 బిలియన్ డాలర్లు) దీంతో మరిన్ని అనుకూలమైన షరతులతో పాత రుణ స్థానంలో కొత్త రుణాన్ని ఇవ్వనున్నాయి. ఏసీసీ, అంబుజా సిమెంట్ కంపెనీలను కొనుగోలు చేయడం కోసం అదానీ గ్రూపు వివిధ సంస్థల నుంచి అప్పులను తీసుకుంది. 3.5 బిలియన్ డాలర్ల ఆ రుణాన్ని రీఫైనాన్స్ చేయడానికి 10 అంతర్జాతీయ బ్యాంకులు సానుకూలత వ్యక్తం చేశాయని అదాని గ్రూపు వెల్లడించింది.

ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లేకు 50 లక్షల చందాదారులు

గూర్‌గావ్ : ప్రముఖ టెలికమ్యూనికేషన్స్ సర్వీస్ ప్రొవైడర్ భారతి ఎయిర్‌టెల్ తన వీడియో స్ట్రీమింగ్ సర్వీస్ అయిన ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లే 50 లక్షల చెల్లింపు చందాదారుల మైలురాయికి చేరినట్లు తెలిపింది. తమ సంస్థ ఒటిటి కంటెంట్‌ని ఒకే యాప్‌లో సమగ్రంగా అందిస్తోందని పేర్కొంది. 20 కంటెంట్ భాగస్వాములకు సంబంధించి కనీస రీఛార్జ్ రూ. 148తో 40వేల పైగా టైటిల్స్, షోలను చూడవచ్చని పేర్కొంది.

హాలోనిక్స్ నుంచి అప్‌డౌన్ గ్లో ఎల్ఇడి బల్బ్‌లు

న్యూఢిల్లీ : విద్యుత్ ఉపకరణాల కంపెనీ హాలొనిక్స్ టెక్నాలజీస్ దేశంలోనే తొలిసారి 'అప్ డౌన్ గ్లో' ఎల్ఇడి బల్బ్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపింది. దీని మీద భాగం (డోమ్), క్రింది భాగం (స్టెమ్) విభిన్న రంగుల్లో వెలుగుతూ.. 3 వేర్వేరు స్విచ్‌ల పద్ధతిలో గదుల్లో లైట్లతో మ్యాజిక్ సృష్టించుకునే అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొంది. ఇవి 360 డిగ్రీల్లో కాంతిని వెదజల్లుతాయని తెలిపింది. దీని ధరను రూ.299గా నిర్ణయించింది.

ఫిజిక్స్ వాలా విస్తరణ

హైదరాబాద్ : ఎడ్‌టెక్ వేదిక ఫిజిక్స్ వాలా (పిడబ్ల్యు) కొత్తగా ఫిజిక్స వాలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. దీంతో తాను అందించే కోర్సులను, బోధన విస్తరణతో విద్యకు సరికొత్త నిర్వచనం ఇవ్వాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది. స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో అద్భుతమైన విజయాన్ని దక్కించుకోవడంతో తాజాగా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ఇది మూడేండ్ల అండర్ గ్రాడ్యుయేట్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్ కాగా, ఇది భవిష్యత్తులో నిర్వహణ, సాంకేతికత క్షేత్రాలతో బిజినెస్, ఎంటర్‌ప్యూనర్‌షిప్‌లో భవిష్యత్తు నాయకులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేయబడిందని ఆ సంస్థ సీఓఓ ఆదిత్య అగర్వాల్ పేర్కొన్నారు.

పాలస్తీనా రచయితల గొంతు నొక్కేస్తున్నారు !

ప్రపంచవ్యాప్తంగా 1300 మందికిపైగా రచయితలు, ప్రచురణకర్తల నిరసన

- మద్దతు లేఖపై సంతకాలు



న్యూఢిల్లీ : రచయిత ఆదానియా షిబ్లితో సహా పాలస్తీనా సాహిత్య కళాకారులకు మద్దతుగా ప్రపంచ వ్యాప్తంగా 1300మందికి పైగా రచయితలు, ప్రచురణకర్తలు ఒక లేఖపై సంతకాలు చేశారు. వీరిలో నోబెల్ బహుమతి గ్రహీతలు కూడా వున్నారు. ఇజ్రాయిల్‌పై హమస్ దాడి నేపథ్యంలో పాలస్తీనియన్ల కళలు, కథనాలు, వారి రచనలకు సంబంధించిన కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా రద్దు చేస్తున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో వీరందరూ మద్దతు లేఖను విడుదల చేశారు. అరబిక్ నుండి అనువాదం చేసిన అనేక రచనలతో మూడు మాసాలకోసారి వెలువడే అరబ్‌లిట్ మేగజైన్‌ను ప్రచురించే సంస్థ అరబ్‌లిట్ ప్రయత్నాల మేరకు ఈ మద్దతు లేఖ వెలువడింది. పాలస్తీనా రచయితలకు సంబంధించిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలను పలు యురోపియన్ దేశాల్లో రద్దు చేసినట్లు వార్తలు వెలువడ్డాయని అరబ్‌లిట్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ప్రతిష్టాత్మక అవార్డు పొందిన పాలస్తీనియన్ రచయిత అదానియా షిబ్లి ఆ అవార్డును అందుకునే కార్యక్రమాన్ని రద్దు చేయడాన్ని ఆ లేఖ ప్రస్తావించింది. వచ్చే వారం ఫ్రాంక్‌ఫర్ట్‌లో పుస్తక ప్రదర్శన ప్రారంభం కానుంది. అందులో షిబ్లి రాసిన పుస్తకానికి గానూ 2023 సంవత్సరానికి ప్రతిష్టాత్మకమైన జర్మనీ అవార్డు అందుకోవాల్సి వుంది. అయితే ఈ పుస్తక ప్రదర్శనలో ఆమె ఆ అవార్డును అందుకోలేరంటూ నిర్వాహకులు ఈ నెల 13న తెలియచేశారు. పైగా పుస్తక ప్రదర్శనలో షిబ్లి, ఆమె అనువాదకురాలుతో జరగాల్సిన చర్చను కూడా రద్దు చేశారు. ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందు షిబ్లికి తెలియచేశామని నిర్వాహకులు తప్పుడు ప్రకటన చేశారు. కానీ షిబ్లి ముందుగా తనకు ఏ విషయం తెలియచేయలేదని, నిర్ణయం తీసుకున్న తర్వాతనే తెలియచేశారని చెప్పారు. ఇజ్రాయిల్‌లో యుద్ధం కారణంగా అదానియా షిబ్లి వాణిని నొక్కివేయడానికి చేసే ప్రయత్నంలోనే ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారని ఆ లేఖ విమర్శించింది. ఇది పిరికిపంద చర్య తప్ప మరొకటి కాదని వ్యాఖ్యానించింది.

ఆల్ట్ న్యూస్ జుబైర్‌కు అంతర్జాతీయ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అవార్డ్

- లండన్‌లో బహుకరించనున్న పురస్కారం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జర్నలిజంలో అంతర్జాతీయ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అవార్డ్-2023ను ఫ్యాక్ట్ చెక్ సంస్థ ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబైర్ సొంతం చేసుకున్నారు. ఇండెక్స్ ఆన్ సెన్సార్‌షిప్ ఈ అవార్డును శుక్రవారం ప్రకటించింది.. "అధికార పార్టీకి చెందిన ప్రభావవంతమైన సభ్యులు ప్రచారం చేసిన తప్పుడు సమాచారాన్ని సవాలు చేసిన తరువాత జుబైర్ చాలా బెదిరింపులను ఎదుర్కొన్నారు" అని సంస్థ తెలిపింది. ఇండెక్స్ ఆన్ సెన్సార్‌షిప్ అనేది లండన్ ఆధారిత లాభాపేక్ష లేని సంస్థ. ఇది భావ ప్రకటన స్వేచ్ఛ కోసం ప్రచారం చేస్తోంది. "ప్రపంచంలో ఎక్కడైనా సెన్సార్‌షిప్‌పై గణనీయమైన ప్రభావం చూపే కళలు, ప్రచారం, జర్నలిజం, ట్రస్టీ అనే నాలుగు విభాగాలలో వార్షిక వ్యక్తీకరణ స్వేచ్ఛా పురస్కారాలు అందజేస్తుంది. యునైటెడ్ కింగ్‌డమ్ లోని లండన్‌లో జరిగే వేడుకలో విజేతలను సత్కరిస్తారు. ఆర్థిక సహాయాన్ని అందజేస్తారు. ఈ అవార్డును స్వీకరించడం గురించి జుబైర్ స్పందిస్తూ తమ యువ సహోద్యోగులకు ఇది "ఆశాజ్యోతి " అనిఅని అన్నారు. "భావప్రకటన స్వేచ్ఛ అవార్డును అందుకోవడం ఒక గౌరవం. ప్రత్యేకించి దేశంలో ఫేక్ న్యూస్, తప్పుడు సమాచారం ఫ్రాంకెన్‌స్టెయిన్ రాక్షసుడిగా ఉద్భవించింది" అని జుబైర్ చెప్పారు. "నేను పని చేసేటపుడు.. నాపై దాడి జరిగినప్పుడు, దూషించ బడినప్పుడు, జైలు శిక్షకు గురైనప్పుడు నాకు అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు" తెలిపారు. జుబైర్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసే వరకు గతేడాది 24 రోజుల పాటు జైలు శిక్ష అనుభవించాడు. ఉత్తరప్రదేశ్‌లో జుబేర్ ఆరు కేసులు, ఢిల్లీలో ఒక కేసును ఎదుర్కొంటున్నారు.

ఐపీఎస్‌లకు పోస్టింగులు

- హైదరాబాద్ సిటీ కమిషనర్‌గా రాధాకృష్ణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇటీవల పలువురు ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల్ని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఎన్నికల విధుల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. వారి స్థానంలో ఇప్పటికే కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్ని నియమించింది. తాజాగా మరో ఆరుగురు ఐపీఎస్ అధికారులకు బదిలీ అయిన వారి స్థానాల్లో పోస్టింగులు ఇవ్వాలని సీఈసీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారంనాడామె వారికి పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్ విభాగంలో ఓఎస్డీగా పనిచేస్తున్న పీ రాధాకృష్ణను హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా నియమించారు. తక్షణం ఆయన్ని ప్రస్తుత బాధ్యతల నుంచి రిలీవ్ చేసి కొత్త పోస్టులో నియమించాలని డీజీపీ అంజనీ కుమార్‌ను ఆదేశించారు. గ్రే హౌండ్స్‌లో గ్రూప్ కమాండర్‌గా పనిచేస్తున్న బిరుద రాజు రోహిత్‌రాజును హైదరాబాద్ సిటీ సౌత్, ఈస్ట్‌జోన్ డీసీపీగా నియమించారు. రాచకొండ స్పెషల్ బ్రాంచ్‌లో డీసీపీగా పనిచేస్తున్న బీ బాలస్వామికి హైదరాబాద్ సిటీ సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీగా నియమితులయ్యారు. సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ విభాగంలో డీసీసీగా పనిచేస్తున్న నితికాపంత్‌ను హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించారు. అవినీతి నిరోధకశాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మైలాబత్తుల చేతనను పెద్దపల్లి, రామగుండం కమిషనరేట్‌లో డీసీపీగా నియమించారు. డీజీపీ కార్యాలయంలో ట్రైనీ ఐజీపీగా పని చేస్తున్న డాక్టర్ తరుణ్ జోషి రాచకొండ జాయింట్ కమిషనర్‌గా నియమితు లయ్యారు. వీరంతా తమ తమ పోస్టుల్లో తక్షణం రిపోర్టు చేయాలని ఆదేశించారు.

107 మందిపై అనర్హత వేటు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గత ఎన్నికల్లో పోటీచేసి, ఎన్నికల నిబంధనావళి పాటించని 107 మందిపై కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అనర్హత వేటు వేసింది. వీరంతా ప్రస్తుత శాసన సభ, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు కాదని పేర్కొంది. వీరంతా గత ఎన్నికల్లో పోటీ చేసి, ఎన్నికల ఖర్చు వివరాలను సీఈసీకి సమర్పించలేదని తెలిపింది. వీరిలో నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసిన 68 మంది అభ్యర్థులు ఉండటం గమనార్హం. పసుపు బోర్డు డిమాండ్‌తో వీరంతా గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసిన వారే. ఆ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఓటమిపాలై, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ విజయం సాధించారు. మిగిలిన అభ్యర్థులు కూడా స్వతంత్రులుగా పోటీచేసిన వారే కావడం గమనార్హం.

పోయిన పశ్చిమ దేశాల పరువు!

బట్టబయలైన ఐరోపా మిత్రదేశాల నిజస్వరూపం



ఇజ్రాయిల్ పైన ఈ నెలారంభంలో హమస్ దాడి చేసిన తరువాత ఇజ్రాయిల్ జనావాసాలపైన, హాస్పిటల్స్ పైన విచక్షణారహితంగా బాంబుదాడులు చేస్తూ వేలాది ప్రజల ప్రాణ హననానికి పాల్పడు తోంది. అంతేకాకుండా 23 లక్షల ప్రజలు నివాసముంటున్న గాజా ప్రాంతానికి నీరు, ఆహారం, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరా అందకుండా అడ్డు పడుతోంది.

ప్రపంచ గమనం

రష్యాను ఉక్రెయిన్ దురాక్రమణదారుగా చిత్రించటానికి ప్రయత్నించిన అమెరికా, దాని పశ్చిమ ఐరోపా మిత్ర దేశాలు గాజాలో ఇజ్రాయిల్ కు వెనుకాముందు ఆలోచించకుండా మద్దతు పలకటంతో వాటి నిజ స్వరూపం వర్ధమాన దేశాలకు మరోసారి తేటతెల్లమైంది. ఉక్రెయిన్ పైన ఎటువంటి కారణంలేకుండా రష్యా యుద్ధ ప్రకటన చేసిందని, సదరు యుద్ధంలో అనేకమంది అమా యక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని పశ్చిమ దేశాలు ఆరోపించేవి. అయితే అవే దేశాలు ఇజ్రాయిల్ విషయానికి వచ్చేసరికి తొందరపాటు కూడ దని చెప్పకుండా తమ మద్దతును ప్రకటించాయి.

ఈ దౌర్జన్య మారణకాండపైన నోరు విప్పకుండా ఇజ్రాయిల్‌కు మద్దతు పలకట మంటే వర్ధమాన దేశాలకు రష్యా గురించి చెబుతున్న కట్టుకథలు వట్టి బూటకమని మరోసారి తేటతెల్లం అవుతోంది. "వర్ధమాన దేశాల హృదయాలను గెలవటంలో మేము కచ్చితంగా విఫలమయ్యాం. ఉక్రెయిన్‌పై వర్ధమాన దేశాలకు మేము చెప్పినదంతా వృథా అయింది. నియమాలను మర్చిపోండి. ప్రపం చ క్రమం గురించి మర్చిపోండి. మేము ఏమి చెప్పినా వర్ధమాన దేశాలు ఇక వినవు. తాము ఉక్రెయిన్ గురించి చెప్పినది గాజాకు కూడా వర్తి స్తుంది. అలా జరగకపోతే మా ప్రతిష్ట మంటగలు స్తుంది. మానవ హక్కులను గౌరవించవలసిన అవసరం ఉందని మేం చెబితే బ్రెజిలియన్లు, దక్షిణ ఆఫ్రికా వాసులు, ఇండోనేషియన్లు ఎందుకు నమ్ముతారు?" అని జి-7 దేశాలకు చెందిన ఒక సీనియర్ దౌత్యవేత్త అన్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది.

ఉక్రెయిన్‌లో నీరు, ఆహారం, విద్యుచ్ఛక్తి సరఫరాను నిలిపివేయటం యుద్ధ నేరం అయినప్పుడు గాజాలో కూడా యుద్ధ నేరమే కావాలి కదా? అని ఒక అరబ్ అధికారి పశ్చిమ దేశాల ద్వంద వైఖరిని ప్రశ్నించాడు. అలాగే సిఎన్ఎన్ హోస్ట్ జాక్ టప్పర్ "ఎక్కడ నివసించినా పౌరులు పౌరులే కదా" అని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సల్లివాన్‌ని అడి గాడు. గాజాలోకి పౌర సరఫరాలను పునరుద్ధ రించమని అమెరికా ఇజ్రాయిల్ పైన వత్తిడి తెచ్చే విషయంపైన తాను మాట్లాడదలచ లేదని ఆయన అన్నాడు.

మధ్యప్రాచ్యంలో పనిచేస్తున్న ఉన్నత స్థాయి అమెరికా దౌత్యవేత్త లను మూడు పదబంధాలను వాడరాదని అమెరికా విదేశాంగ శాఖ నిర్దేశించినట్టు హఫ్పిం గ్టన్ పోస్టు రిపోర్ట్ చేసింది. ఆ మూడు ప్రత్యేక పదబంధాలు ఇలా ఉన్నాయి: కాల్పుల విరమణ లేక ఘర్షణ పెరగకుండా చూడటం (డిఎస్కలేషన్), హింసను విడనాడటం లేక రక్తపాతాన్ని ఆపమనటం, శాంతిని పునస్థాపన చేయటం. పౌరులపై హింసను ఖండించి కాల్పుల విరమణ చేయాలని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో రష్యా ప్రతి పాదించిన తీర్మానం వీగిపోయింది. బ్రెజిల్ ప్రతిపాదించిన మరో తీర్మానాన్ని కూడా అమెరికా వీటో చేసింది.

ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరా తగదు

నిరసనగా అమెరికా విదేశాంగ శాఖ అధికారి రాజీనామా



అమెరికా విదేశాంగ శాఖలో ఆయుధ సరఫరాకు బాధ్యుడుగావున్న ఒక అధికారి ఇజ్రాయిల్ కు అమెరికా ఆయుధ సరఫరా చేయటంపట్ల నిరసనగా రాజీనామా చేశా రు. ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధ సర ఫరా చేయటం "దూరదృష్టిలేని, వినాశకర మైన, అన్యాయమైన, అమెరికా నిత్యం బహి రంగంగా ప్రకటించే విలువలకు వ్యతిరేకమై న చర్య"గా ఆయన అభి వర్ణించారు. జోష్ పాల్ బ్యూరో ఆఫ్ పొలిటికల్-మిలిటరీ ఎఫైర్స్(పిఎమ్)కి 11 ఏండ్లపాటు డైరెక్టర్‌గా వ్యవహరించారు. బుధవారంనాడు తన రాజీనామా లేఖను తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో పెట్టారు. అదేరోజు మొట్టమొదటిసారిగా హఫ్పింగ్టన్ పోస్టు ఈ విషయాన్ని రిపోర్ట్ చేసింది. తను చేసేపనిలో "నైతిక సంక్లిష్టత, నైతికంగా రాజీ పడటం"వంటివి ఉంటాయని తెలుసని, తను చేసే చెడుకంటే "తను చేయగల మంచి ఎక్కువగా ఉంటుందని" భావించానని పాల్ అన్నాడు.

అయితే ఇజ్రాయిల్‌కు మానవ హనన ఆయుధా లను అందించాలనే అమెరికా నిర్ణయంతో తన పనిలో మంచి కంటే చెడే ఎక్కువగా ఉందని గ్రహించి రాజీనామా చేశానని ఆయన అన్నారు. అమెరికా దశాబ్దాలుగా అవే తప్పులను మరలామరలా చేస్తోందని, "పక్షపాతమనే పునాదిపై మరుక్షణమే ప్రతిస్పందించటం, రాజకీయ సౌకర్యం, మేధో దివాళాకోరుతనం, అధికార మందబుద్ధి'లతో కూడిన విధానాన్ని అమెరికా అవలంభిస్తోందని ఆయన చెప్పారు. మధ్యప్రాచ్యంలో తనకున్న అనుభవం, ఇజ్రాయిల్, పాలస్తీనా అథారిటీలతో చేసిన అధికారిక పనిని గురించి పాల్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఘర్షణలోవున్న ఇరువైపులా తనకు లోతైన వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని, తన భాగస్వామి చేస్తున్న తప్పుడు పనులను అమెరికా సమర్థించటాన్ని తాను ఖండిస్తున్నా నని పాల్ తన రాజీనామా లేఖలో రాశారు. మెరుగైన ప్రపంచాన్ని నిర్మించటంలో సమిష్టిగా శిక్షిం చటం అడ్డంకిగా ఉంటుందని, అది ఒక ఇంటిని లేక ఒక వేయి ఇండ్లను కూల్చటం, ప్రజలను తెగ ఆధారంగా నిర్మూ లించటం, ఆక్రమించటం, వర్ణ వివక్షవంటి రూపాలలో ఉంటుందని ఆయన అన్నారు.

సహాయ ట్రక్కులకు అనుమతివ్వండి : ఐరాస

ఇజ్రాయిల్ దిగ్బంధనంతో ఇబ్బందులు పడుతున్న గాజా ప్రజలకు సాయం అందేందుకు వీలుగా సహాయ ట్రక్కులను అనుమతించాల్సిందిగా ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన రాఫా సరిహద్దు క్రాసింగ్‌ను సందర్శించారు. పాలస్తీనియన్లు కూడా అందబోయే సాయం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇదిలావుండగా, లెబనాన్‌తో గల సరిహద్దులో హిజ్బులా తీవ్రవాదులతో రోజుల తరబడి ఘర్షణలు కొనసాగించిన అనంతరం ఉత్తర ప్రాంత కిర్యాత్ షామోనా నగరాన్ని ఖాళీ చేయనున్నట్లు శుక్రవారం ఇజ్రాయిల్ అధికారులు ప్రకటించారు.

సింగరేణీయులకు దసరా బోనస్

- ఒక్కో కార్మికుడికి రూ.1.53 లక్షలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కార్మికులకు బోనస్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.711 కోట్లు విడుదల చేసింది. దీనివల్ల ఒక్కో కార్మికుడికి రూ.1.53 లక్షలు ఆర్థిక లబ్ధి చేకూరిందని యాజమాన్యం తెలిపింది. సంస్థలో పనిచేస్తున్న 42వేల మంది కార్మికులు దసరా బోనస్ అందుకున్నారు. శుక్రవారం వారి ఖాతాల్లో ఈసొమ్మును జమచేసినట్టు యాజమాన్యం పేర్కొంది. రెండ్రోజుల్లో పండుగ అడ్వాన్స్ కూడా చెల్లిస్తామని అధికారులు తెలిపారు.

ఎలక్షన్ రికవరీ..

- రూ.286.74 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు జరిపిన తనిఖీల్లో పెద్దమొత్తంలో నగదు, బంగారం, మద్యం, ఉచిత కానుకలు పట్టుబడుతున్నాయి. అక్టోబర్ 9 నుంచి శుక్రవారం వరకు జరిగిన తనిఖీల్లో మొత్తం విలువ రూ.286.74 కోట్లు విలువైన నగదు, సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు రూ.8 కోట్లకుపైగా నగదు, 38 కిలోల బంగారం, 189 కిలోల వెండి, 186 క్యారెట్ల వజ్రాలు, ఐదు గ్రాముల ప్లాటినం, ఇతర ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారనీ, వీటి విలువ రూ.42.93 కోట్లకు పైగా ఉన్నదని తెలిపారు. అలాగే పెద్దఎత్తున గంజాయి, ఇతర మత్తు పదార్థాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీలో గలాటా



(ఫైల్)

క్రాస్‌రోడ్స్‌లో 'సైకిల్'

- అధ్యక్షుడికి స్క్రీనింగ్ కమిటీకీ మధ్య రగడ
- రావుల పలాయనం • ఖరారుకాని టికెట్లు
- పార్టీలో కొరవడిన సమన్వయం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ శాఖలో అంతర్గత సమన్వయ లోపాలు పొడచూపాయి. అసెంబ్లీ ఎన్నికల టికెట్ల కేటాయింపులో నెలకొన గందరగోళమే ఇందుకు సాక్ష్యం. పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్‌బ్యూరో సభ్యులతోకూడిన స్క్రీనింగ్ కమిటీ మధ్య తలెత్తిన విభేధాలు సమస్యలకు కారణమవుతున్నట్టు తెలిసింది. ఎన్నికల ముందు బస్సుయాత్ర చేపట్టాలని భావించారు. చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో ఆ ప్రతిపాదన వాయిదా పడింది. బాబు జైలుకుపోకముందే తెలంగాణలో పోటీచేసే అభ్యర్థుల విషయమై చర్చ జరిగింది. అధ్యక్షుడు కాసాని జానేశ్వర్ పోటీచేసే అభ్యర్థులతో కూడిన జాబితాను బాబుకు సమర్పించారు. అయితే జాబితాను మరోసారి పరిశీలించాలంటూ పొలిట్‌బ్యూరోసభ్యులు, మరో ఇద్దరు, ముగ్గురితో కమిటీ వేశారు. ఆతర్వాత టీడీపీలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో తెలంగాణ అభ్యర్థుల పేర్ల ఖరారు వాయిదా పడుతూ వస్తున్నది. చంద్రబాబు పార్టీకి అందుబాటులో లేకపోవడం, అధ్యక్షుడు కాసాని అనారోగ్యం పాలుకావడంతో పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఇటీవల కాసాని రాజమండ్రి వెళ్లి బాబుతో ములాఖాత్‌లోమాట్లాడి వచ్చారు. బాలకృష్ణ, భువనేశ్వరి, లోకేశ్‌తోనూ భేటీ అయ్యారు. ఒకవైపు ఈ ప్రక్రియ నడుస్తుండగానే, తెలంగాణలో టీడీపీ, బీజేపీతో కలిసి ఎన్నికల్లో పోటీచేస్తామని జనసేనాని పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. అయినా తమ పార్టీ రాజకీయ విధానం గురించి జనసేన నాయకుడు ఎలా ప్రకటిస్తాడనే వారూ టీడీపీలో ఉండటం గమనార్హం. ఈ విషయమూ ఇంకా కొలిక్కిరాలేదు. అయితే బీజేపీతో కలిసి ఎన్నికల గోదాలోకి దిగడానికి టీడీపీలోని సీనియర్లు, ఇతర నేతలకు ఇష్టం లేనట్టు సమాచారం. ఇదిలావుండగా కాసాని జ్ఞానేశ్వర్ తాను కుత్బుల్లాపూర్ నుంచి పోటీచేస్తానని మీడియాతో వ్యాఖ్యానించారు. ఇలా వేగంగా పరిణామాలు చోటుచేసుకున్నా, టీడీపీ స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరగకపోవడంతో సమస్య ముదిరింది. ఈ అంశాలపై వెంటనే చర్చించి నిర్ణయంతో తీసుకోవాల్సిన నాయకత్వం మొండిగా వ్యవహరించిందనే వ్యాఖ్యానాలు ఆ పార్టీ శ్రేణుల నుంచే వస్తున్నాయి. పార్టీలోని పొలిట్‌బ్యూరో స్థాయిలోని వ్యక్తులు పోటీచేయడానికి ఆసక్తి చూపకపోవడం, అధ్యక్షులు కాసాని జాబితాతో విభేదించడం తదితర పరిణామాలు పార్టీలో అంతర్గతంగా స్తబ్దత ఏర్పడింది. అది కూడా పార్టీకి నష్టమంటూ కొందరూ సీనియర్ నేతలు చెబుతూండటం గమనార్హం. ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న స్వల్ప పొరపొచ్చాలను పక్కనబెట్టి బరిలోకి దిగే ఆలోచన చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏకపక్ష నిర్ణయాలు కాకుండా ఉమ్మడి నిర్ణయాలు తీసుకుని అమలుచేసే ప్రయత్నం జరగాలని సీనియర్లు భావిస్తున్నారు. పార్టీలో ఈపరిస్థితిని గమనించిన ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారనే ప్రచారం జరుగుతున్నది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ దర్శకత్వంలో రావుల పార్టీ మారినట్టుగా ఎన్టీఆర్‌భవన్ వర్గాలు చెబుతున్నాయి.మరికొందరు నేతలు సైతం టీడీపీకి రాంరాం చేప్పేఅవకాశాలు కనిపిస్తున్నాయి.

అయితే కాసాని జ్ఞానేశ్వర్ అన్నీ తానై పార్టీని నడిపిస్తుంటే, సీనియర్లు అడ్డు తగులుతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. పోటీచేయడానికి ఇష్టపడని సీనియర్ నేతలు, అభ్యర్థుల ఖరారు విషయంలో జోక్యం చేసుకోవడం ఎంతవరకు సమంజసమనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పుడు తెలంగాణ టీడీపీ క్రాస్‌రోడ్స్‌లో ఉందని అంటున్న వారూ లేకపోలేదు. అసలే క్యాడర్ అంతంత మాత్రంగా ఉన్న టీడీపీలో సమన్వయలేమితో నేతలు తలలు పట్టుకుంటున్నారు.

జలసౌధలో బతుకమ్మ సంబురాలు



నవతెలంగాణ–హైదరాబాద్

సాగునీటి శాఖ ప్రధాన కేంద్రం హైదరాబాద్‌లోని జలసౌదలో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు ప్రారంభమయ్యాయి. చీఫ్ ఇంజినీర్లు, అధికారులతోపాటు నాలుగో తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు. అంతకు ముందు సాగునీటి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (పరిపాలన) అనిల్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ నాగేందర్ రావు , ముఖ్యమంత్రి ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సంబరాలకు చీఫ్ ఇంజినీర్లు అనిత, శ్రీదేవి, ప్రమీల, ఈ ఈ శారద, డి ఈఈ రమాదేవి తదితరులతోపాటు వందలాది మంది మహిళా ఇంజినీర్లు , ఉద్యోగులు హాజరయాయరు.. సాగునీటి శాఖ యూనిట్ పేర్చిన బతుకమ్మలకు బహుమతులు సైతం అందజేశారు. మొదటి బహుమతి కింద సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్‌కు రూ. 5 వేలు నగదు ఇవ్వగా, అలాగే రెండవ బహుమతిని జలసౌద బిల్డింగ్ నిర్వహణ యూనిట్‌కు, మూడవ బహుమతిని ఇంజనీర్ ఇన్ చీఫ్ పరిపాలన యూనిట్‌కు అందజేశారు.

డీఎస్సీ దరఖాస్తు గడువు 28 వరకు పొడిగింపు



- ఇప్పటి వరకు 1.50 లక్షల మంది అప్లై
- ఫిబ్రవరి మొదటి వారంలో రాతపరీక్షలు! : విద్యాశాఖ సమాలోచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) దరఖాస్తు గడువును ఈనెల 28 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఫీజు చెల్లింపునకు ఈనెల 27 వరకు అవకాశముందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఫీజు చెల్లింపునకు శుక్రవారం, దరఖాస్తుల సమర్పణకు గడువు శనివారం వరకు ఉన్న విషయం తెలిసిందే. అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని దరఖాస్తు గడువును ఈనెల 28 వరకు పొడిగిస్తున్నట్టు తెలిపారు. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సెప్టెంబర్ ఆరో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. గతనెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. ఇప్పటి వరకు 1,56,449 మంది ఫీజు చెల్లించారని పేర్కొన్నారు. వారిలో 1,50,202 మంది దరఖాస్తులను సమర్పించారని వివరించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో జరిగే రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేసింది. వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నారు. త్వరలోనే వాటికి సంబంధించిన తేదీలను ఖరారు చేసి ప్రకటించే అవకాశమున్నది. ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో జరగాల్సిన గ్రూప్–2 రాతపరీక్షలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వాయిదా వేసిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరి ఆరు, ఏడు తేదీల్లో గ్రూప్–2 రాతపరీక్షలను తిరిగి నిర్వహిస్తామని ప్రకటించింది.

పట్టాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

- ప్రజా వ్యతిరేక పాలకులకు ఓటుతో బుద్ధిచెప్పాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జె వెంకటేష్
- గుడిసెవాసులతో బతుకమ్మ సంబురాలు


మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నవతెలంగాణ–భూపాలపల్లి

పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువులోని సర్వేనెంబర్–280, 282, 285లో పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేష్, జిల్లా నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల పోరాటం కొనసాగుతుందన్నారు. పేదల ఇండ్లకు స్థలాలు ఇవ్వడానికి భూములు లేవని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు.. వారి పార్టీ కార్యాలయాలు, సొంతభవనాలు కట్టుకోవడానికి స్థలాలు ఎలా దొరుకుతున్నాయని ప్రశ్నించారు. 58, 59 జీవో ప్రకారం ఇండ్ల స్థలాలకు, గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 365 రోజులు రైతులు, కార్మికులు వారి సమస్యలపై ధర్నా, రాస్తారోకోలు చేస్తున్నారని గుర్తు చేశారు. వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకుంటామని, ప్రభుత్వాలు, అధికారులు మారినా పోరాటాలు మాత్రం ఆగవని స్పష్టంచేశారు. అనంతరం జె వెంకటేష్ మాట్లాడుతూ.. పాలకులు ఎక్కడ ఖాళీ జాగాలు కనబడితే వాటిని కబ్జా చేయడమే పనిగా పెట్టుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల కోసం మన దగ్గర కొచ్చే నాయకులకు మన ఓటు ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువులో గుడిసెలు వేసుకున్న పేదలతో కలిసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేష్, జిల్లా నాయకులు బతుకమ్మ ఆటలో పాల్గొని మహిళలను ఉత్సాహపరిచారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన గుడిసెవాసులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం రాజేందర్, సీఐటీయూ నాయకులు కంపేట రాజయ్య, చెన్నూరి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశెట్టి రాజయ్య, రజినీకాంత్, గుర్రం దేవేందర్, ఆత్కూరి శ్రీకాంత్, పోలం చిన్న రాజేందర్, రమేష్, రాజేందర్, శ్రీనివాస్ కవిత, శారద, నరేష్, ఆదిరెడ్డి, మౌనిక, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం...

- మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలుచేయాలి: ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- బతుకమ్మ ఆట.. పాట..



నవతెలంగాణ–వాజేడు

"బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం.. మహిళలను.. దేశాన్ని రక్షించుకుందాం.." నినాదంతో దేశ, రాష్ట్ర వ్యాప్తంగా జీపు జాతాల ద్వారా మహిళల్లో చైతన్యం కల్పిస్తున్నట్టు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ములుగు జిల్లా వాజేడు మండలం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న గుడిసెవాసులకు మద్దతు తెలిపారు. అనంతరం గుడిసెల కేంద్రంలో బతుకమ్మ ఆడి అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా బిల్లు సత్వర అమలు కొరకు బతుకమ్మ ఆడాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలపై మునుపెన్నడూ లేని విధంగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ఏం మాట్లాడాలి, ఏం మాట్లాడకూడదు, ఏం తినాలి, ఏ బట్ట కట్టాలి, ఎంత మంది పిల్లల్ని కనాలి అని బీజేపీ నాయకులు శాసిస్తున్నారన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేస్తామని బీజేపీ ప్రభుత్వం చెబుతూ మహిళలను మోసం చేస్తుందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండా 2024 ఎన్నికల్లోనే మహిళా బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పొదిళ్ళ చిట్టి బాబు, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి, మండల కమిటీ సభ్యులు బచ్చల కృష్ణబాబు, గుగ్గిళ్ల దేవయ్య, దామోదర్, బచ్చల సౌమ్య, పాయం కుమారి, తోలేం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ, సామాజిక న్యాయం కోసం పోరాడాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య



నవతెలంగాణ–మహబూబాబాద్

రాజ్యాంగ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డి.రామ్మూర్తి, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి వంకాయలపాటి చిరంజీవి అధ్యక్షతన దళిత సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు వారి దరి చేరలేదన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాజ్యాంగ హక్కుల పైన దాడులు జరుగుతున్నాయని, గుండెకాయ లాంటి ప్రజాస్వామ్యం, సామ్యవాదం అనే పదాలను రాజ్యాంగం నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం స్థానంలో మను ధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్నారన్నారు. ప్రమోషన్లలో రిజర్వేషన్స్ అమలు చేయడం లేదని, ప్రయివేటు రంగంలో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు అమలు చేయడం లేదని, ఇప్పటికీ కుల వివక్షత కొనసాగుతుందని వీటిపై దేశవ్యాప్తంగా ఆందోళన కొనసాగుతుందని స్పష్టంచేశారు. డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అలవాల వీరయ్య, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న మాట్లాడుతూ.. అక్టోబర్ 29న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా సదస్సు అనంతరం వారం రోజులపాటు సంతకాల సేకరణ ద్వారా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు నీరుటి సామేలు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గునిగంటి రాజన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర మహేష్, మహిళా కూలీల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇందిరా, చంద్రకళ, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బందిపోట్లను తయారు చేసింది మీరే..!

- అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది ఎవరు?
- ఖమ్మంలో ప్రజలు స్వేచ్ఛగా బతకలేక పోతున్నారు..
- ఖమ్మాన్ని కబ్జాలకు అడ్డాగా చేశావు ..
- బందిపోట్లకు వ్యతిరేకంగానే మా పోరాటం.. అందుకే ఖమ్మంలో పోటీ..! : మంత్రి పువ్వాడకు మాజీ మంత్రి తుమ్మల కౌంటర్



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రజల ఆస్తులు దోచుకోవడానికి బందిపోట్లను తయారు చేసింది మీరేనంటూ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కౌంటర్ ఇచ్చారు. బందిపోట్లు, అవినీతికి వ్యతిరేకంగా పనిచేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని తుమ్మల స్పష్టం చేశారు. ఇటీవల మంత్రి పువ్వాడ అజయ్ బీఫారం తీసుకునేందుకు హైదరాబాద్ వెళ్లిన సమయంలో తుమ్మల, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. పలువురు బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. దీనిపై మంత్రి పువ్వాడ తాను లేనప్పుడు బందిపోట్లలా చేర్చుకున్నారని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తుమ్మల అనుయాయులు, కాంగ్రెస్ నేతలు స్పందించినా తుమ్మల మాత్రం ఇప్పటి వరకు ఏమి మాట్లాడలేదు. ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల ప్రసంగిస్తూ మంత్రి పువ్వాడ పై డైరెక్ట్ ఎటాక్ చేశారు. బందిపోట్లను తయారు చేసిన మంత్రి బందిపోట్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. డబ్బు, దర్పం ఉందని విర్రవీగితే ప్రజలే తగిన గుణపాఠం చెపుతారని తెలిపారు. ఖమ్మం ప్రజలకు ఎవరు బందిపోట్లు, కబ్జాకోరులు ఎవరో, ఎవరు అభివృద్ధి కాముకులో.. ఖమ్మం ప్రజలకు అన్నీ తెలుసన్నారు. మంత్రి కబ్జాలకు భయపడి ప్రజలు, ప్రధానంగా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు భయంతో బతుకుతున్నారని ఆరోపించారు. పైసా పైసా కూడబెట్టి కొనుక్కున్న ప్లాట్ ఉంటుందో.. లేదో తెలియని పరిస్థితి వచ్చిందన్నారు. అలాంటి బందిపోట్ల నుంచి ప్రజలకు విముక్తి కల్పించడంతో పాటు ఖమ్మం ప్రజలు భయంలేని జీవితం గడపాడాలనే చేందుకే ఇక్కడ నుంచి పోటీచేస్తున్నానని స్పష్టంచేశారు. ఎక్కడ ఎవరు ఏది మాట్లాడినా తప్పులను సరిచేసుకోకుండా వారిపై కేసులు పెట్టి వేధించడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. తన రాజకీయ జీవితంలో తన అధికారాన్ని ప్రజల మేలు కోసం ఉపయోగించానే తప్ప దుర్వినియోగం చేయలేదన్నారు. ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ అభిమానాలే నిదర్శమని తెలిపారు. ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సాధు రమేష్ రెడ్డి, కార్పొరేటర్ కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- వైద్యారోగ్య డైరెక్టర్‌కు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ వినతి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

సమ్మె విరమణ సందర్భంగా ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, కోశాధికారి పి. గంగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో వైదారోగ్య శాఖ డైరెక్టర్, అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను డైరెక్టర్ దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. జీవో నెంబర్ 1 ప్రకారం 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు. కేంద్రం ఇచ్చిన కరోనా అలవెన్స్(2020 జూన్ నుంచి 2021 అక్టోబర్ వరకు)ను నెలకు రూ.1000 చొప్పున వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 15 రోజుల సమ్మెకాలపు పారితోషికాలను చెల్లించాలని విన్నవించారు. ప్రతి నెలా ఐదో తేదీ లోపే పారితోషికం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పత్తి కొనుగోళ్లకు వేళాయె..

ధరపైనే దడ..!

- తేమ శాతం మినహాయింపు కోరుతున్న అన్నదాతలు
- నేడు రైతులు, వ్యాపారులతో కలెక్టర్ సమావేశం
- త్వరలోనే పత్తి కొనుగోళ్లకు ముహూర్తం

పత్తికి గిట్టుబాటు ధరపై అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. పండించిన పంటకు మార్కెట్‌లో ఏ మేరకు మద్దతు లభిస్తుందోనని కలవరపాటుకు గురవుతున్నారు. గతేడాది పత్తి పంట అలా ఉండగానే.. ఈసారి పత్తి పంట ఇంటికి చేరుతున్నది. మార్కెట్ ప్రారంభం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కొనుగోళ్లకు ఇప్పటికే సమయం మించిపోవడంతో ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని మార్కెట్‌యార్డులో సౌకర్యాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. శనివారం రైతులు, వ్యాపారులు, అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. కొనుగోళ్లలో అనుసరించాల్సిన ప్రక్రియపై చర్చించనున్నారు. అధిక వర్షాలతో సాగు తొలినాళ్లలోనే నష్టపోయిన రైతులు ఇప్పుడు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడంపైనే ఆశలు పెట్టుకున్నారు. మరోపక్క పత్తి వ్యాపారులు, లారీ ఓనర్స్ మధ్య వివాదాన్ని సైతం పరిష్కరించాల్సిన అవసరం ఉంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే పత్తి పంటకు ప్రధాన కేంద్రం. ఇందులో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పత్తి మార్కెట్ ఆసియాలోనే మంచి పేరు ప్రఖ్యాతులుగాంచింది. ఇక్కడ పండించే పత్తికి అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంటుంది. ఈ ఏడాది ఆదిలాబాద్ జిల్లాలో 4.12లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. సుమారు 28లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. పత్తి కొనుగోళ్లకు సమయం వచ్చింది. కిందటేడాది అక్టోబర్ 14వ తేదీనే ప్రారంభించగా.. ఈ ఏడాది కాస్త ఆలస్యమవుతోంది. అయితే, ప్రతి ఏటా గిట్టుబాటు ధర, తేమ శాతం నిబంధనపైనే ఘర్షణ నెలకొంటోంది. కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరను క్వింటాల్‌కు రూ.7020గా నిర్ణయించింది. కిందటేడాది ప్రభుత్వ మద్దతు ధర రూ.6380గా ఉండగా.. ఈ ఏడాది స్వల్పంగా పెరిగింది. కానీ పెరిగిన ధరకు ఎలాంటి శాస్త్రీయత లేకుండా పోయిందని అన్నదాతల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. పంట కోసం పెట్టిన పెట్టుబడి ఖర్చులో 50శాతం కలిపి ధర నిర్ణయించాలని స్వామినాథన్ కమిటీ సిఫార్సు ఉండగా.. ప్రభుత్వం ఆ దిశగా దృష్టిసారించలేదు. రూ.640 మాత్రమే ధర పెంచి చేతులు దులిపేసుకుంది. ప్రస్తుతం విత్తనాలు, ఎరువులు, రసాయనిక మందుల ధరలు అమాంతం పెరిగాయి. ఎకరానికి పెట్టుబడి ఖర్చు భారీగా అవుతోంది. కేంద్ర ప్రభుత్వం వీటిని పరిగణనలోకి తీసుకోకుండా ధర నిర్ణయించడంతో అన్నదాతల్లో ఆవేదన చెందుతున్నారు.

తేమ నిబంధనపైనే పేచీ..!

ప్రతి ఏటా గిట్టుబాటు ధరతో పాటు తేమ నిబంధనపైనే పేచీ నెలకొంటోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే వ్యాపారులు కొంత మాత్రమే అధికంగా చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. మరోపక్క ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ 8శాతం కంటే అధికంగా ఉండకూడదు.

అలా అయితేనే ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ కొనుగోలుకు ముందుకొస్తుంది. అంతకంటే ఎక్కువ తేమ చూపిస్తే.. గత్యంతరం లేక రైతులు ప్రయివేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది. అందువల్ల ప్రభుత్వం తేమపై కొంత మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు. అదేవిధంగా కొనుగోళ్ల ప్రారంభం నుంచి చివరి వరకు సీసీఐ రంగంలో ఉండాలని రైతులు కోరుతున్నారు. మరోపక్క ప్రతిసారీ ఆదిలాబాద్‌లో లారీ ఓనర్లు, వ్యాపారులకు మధ్య వివాదం ఏర్పడుతోంది. స్థానిక లారీల ద్వారా పత్తి ఘటాన్లను సరఫరా చేయాలని లారీ ఓనర్లు పట్టుబడుతుండగా.. వీరు నిర్ణయించిన ధర తమకు గిట్టుబాటు కావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఓపెన్ మార్కెట్ ఉండాలని కోరుతున్నారు. ఈ వివాదాన్ని ఉన్నతాధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



మార్కెట్‌లో వెంటనే పత్తి కొనుగోళ్లను ప్రారంభించాలి. ఇప్పటికే ఆలస్యమైంది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతులకు ఏ మాత్రం ఆమోదయోగ్యంగా లేదు. మంచి ధర లభించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ నిరంతరం రంగంలో ఉండేలా చూడాలి. మార్కెట్‌యార్డులో రైతులకు సౌకర్యాలు సమకూర్చాలి.

- బండి దత్తాత్రి, అఖిలపక్ష రైతు సంఘం నాయకులు

సంపాదకీయం

సత్యం వధ..!

నిజం నిద్రలేచేసరికే అబద్ధం ఊరంతా తిరిగొస్తుందని సామెత. ఈ ఆధునిక సమాచార సాంకేతిక యుగంలో ఇది మరింత ఉధతంగానేగాక వికతంగానూ మారడం మహా విషాదం. ఫలితంగా 'నిజాలు' దారుణ హత్యకు గురవుతున్నాయి. అబద్దాలు సునామీలా విరుచుకుపడి ప్రజల మెదళ్లను కలుషితం చేస్తున్నాయి. ఇప్పుడు ఇజ్రాయెల్ సైన్యాలకూ, హమాస్ ఆందోళనకారులకు మధ్య జరుగుతున్న యుద్ధంలోనూ జరుగుతున్నది ఇదే. గాజాలో జరుగుతున్న నరమేథంపై సామాజిక మాధ్యమాలలో, ప్రధాన స్రవంతి మీడియాలో దర్శనమిస్తున్న ప్రసారాలూ ప్రచారాలు చూస్తే కలవరపెట్టక మానవు. ఇప్పుడక్కడ కోల్పోతున్న ప్రాణాలకంటే వధించబడుతున్న నిజాలే ఎక్కువ అంటే అతిశయోక్తి కాదేమో!.

> దేశంలో మోడీ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి దేశంలో విద్వేష ప్రచారాలు బాగా పెరిగిన సంగతి తెలిసిందే. ప్రత్యేకించి ముస్లిం వ్యతిరేకతను బీజేపీ శ్రేణులు రెచ్చగొడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా... తాజాగా మధ్యప్రాచ్యంలో చెలరేగిన ఈ యుద్ధ సమయంలో స్వయంగా మోడీ ఇజ్రాయిల్‌కు తన స్పష్టమైన మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఇవి మరింత పెచ్చరిల్లుతున్నాయి.

అయితే ఈ విష ప్రచారాలకు భారతదేశమే ప్రధాన వేదిక కావడం ఆందోళన కలిగించే అంశం. సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా వెలువడుతున్న తప్పుడు పోస్టుల్లో అత్యధికం భారత మూలాలున్న ఖాతాల నుంచే నని పలు నిజనిర్ధారణ సంస్థలు తేల్చి చెబుతున్నాయి. ఉదాహరణకు హమాస్ ఆందోళనకారులు ఒక యూదు బాలుడిని కిడ్నాప్ చేశారని, మరో కుర్రాడిని ట్రక్కులో పడేసి తల నరికేశారని సామాజిక మాధ్యమాల్లో కొన్ని వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. 'ఎక్స్'గా మారిన ట్విట్టర్‌లో బ్లూచెక్ ఖాతాల నుంచే ఇటువంటి తప్పుడు వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి. ఓ పాలస్తీనియన్ సాయుధ సమూహం కొంతమంది బాలికలను లైంగిక బానిసలుగా చెరబట్టారని చెబుతూ ఒక వీడియో వైరల్ చేశారు. నిజానికి ఆ వీడియో.. జెరూసలెంలో జరిగిన ఒక పాఠశాల విద్యార్థినుల విహారయాత్రకు సంబంధించినది. ఆ వీడియోను సరిగ్గా పరిశీలిస్తే.. ఆ బాలికలు సంతోషంగా ముచ్చటించుకుంటున్నట్టు కనిపిస్తుంది. ఇంత స్పష్టంగా తెలిసిపోతున్నప్పటికీ.. ఈ వీడియోను పాలస్తీనియన్లను దుర్మార్గంగా పేర్కొంటూ కొన్ని వేల మంది షేర్ చేయగా లక్షల్లో ఇంప్రెషన్స్ వచ్చాయి. ఈ వీడియోను షేర్ చేసిన ఖాతాలను విశ్లేషిస్తే.. వాటిలో సింహభాగం భారత్‌కు చెందినవేనని తేలిందని "బూమ్" పేర్కొంది.

భారతదేశంలోని ప్రముఖ నిజనిర్ధారణ సర్వీసు సంస్థల్లో బూమ్ ఒకటి. పాలస్తీనా-ఇజ్రాయెల్ యుద్ధానికి సంబంధించి తప్పుడు ప్రచారాలపై ఈ సంస్థ పరిశోధన చేసింది. భారతదేశానికి చెందిన 'ఎక్స్' యూజర్లు పెద్ద



సంఖ్యలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్టు ఈ పరిశోధనలో వెల్లడైందని అల్‌జజీరా వెబ్‌సైట్ పేర్కొన్నది. పాలస్తీనియన్లు క్రూరమైనవారనే భావన చొప్పించడమే లక్ష్యంగా సాగుతున్న ఈ దుష్ప్రచారాలు... దశాబ్దాలుగా వారు అనుభవిస్తున్న దారుణమైన హింసను, అణిచి వేతను నిర్దయగా విస్మరిస్తున్నాయి. దశాబ్దాలుగా నెత్తురోడుతున్న పాలస్తీనియన్లు క్రమంగా తమ మాతృభూమినే కోల్పోతున్నారన్న సత్యాన్ని నిర్దాక్షిణ్యంగా హత్య చేస్తున్నాయి.

ఇటువంటి అసత్యాలను ప్రచారంలో పెడుతున్న వారందరూ పాలస్తీనియన్లపై వ్యతిరేకతను వెల్లగక్కడంతో పాటు, తమ పోస్టులకు ముస్లిం విద్వేషాన్ని జోడిస్తుండటం గమనార్హం. ఈ ఇస్లాం వ్యతిరేక ట్వీట్లలో మెజారిటీ మూలాలు భారతదేశంలోనే కనిపిస్తున్నాయని ఆస్ట్రేలియాకు చెందిన ఇస్లామిక్ కౌన్సిల్ ఆఫ్ విక్టోరియా నివేదిక సైతం పేర్కొంటున్నది.. దేశంలో మోడీ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి దేశంలో విద్వేష ప్రచారాలు బాగా పెరిగిన సంగతి తెలిసిందే. ప్రత్యేకించి ముస్లిం వ్యతిరేకతను బీజేపీ శ్రేణులు రెచ్చగొడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా... తాజాగా మధ్య ప్రాచ్యంలో చెలరేగిన ఈ యుద్ధ సమయంలో స్వయంగా మోడీ ఇజ్రాయెల్‌కు తన స్పష్టమైన మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఇవి మరింత పెచ్చరిల్లుతున్నాయి.

ఇక మెయిన్‌స్ట్రీమ్ మీడియా సైతం ఇందుకు మినహాయింపు కాకపోవడం మరో విషాదం.. నెతన్యాహూకు మద్దతు ప్రకటిస్తూ ప్రధాని మోడీ మిత్రులైన జో బైడెన్, రిషీసునాక్‌లు చేసిన ఇజ్రాయెల్ పర్యటనలు లోక కళ్యాణార్థమని కీర్తించిన మీడియా.. పాలస్తీనాకు సంఘీభావం ప్రకటిస్తున్న దేశాధినేతలను మాత్రం అశాంతికి ప్రతీకలుగా చిత్రిస్తున్నది. ఇజ్రాయెల్ దురాక్రమణలకు నిస్సిగ్గుగా మద్దతిస్తూ 'సుభాషితాలు' వల్లిస్తున్న పశ్చిమ దేశాధినేతల అభిప్రాయాలనే ప్రపంచాభిప్రాయంగా ప్రచారం చేస్తూ... అదే దేశాల్లో పాలస్తీనాకు మద్దతుగా పెల్లుబుకుతున్న ప్రజల సంఘీభావాన్ని మాత్రం మరుగున పెడుతున్నది. చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లా చెదరవుతున్న మనుషులు, పిట్టల్లా రాలిపోతున్న ప్రాణాలు, బూడిద కుప్పలవుతున్న నివాసాలతో కూడిన గాజా విలాపాగ్నులకు కారణాలేమిటో, కారకులెవరో చూపకుండా నిజాలను బలికావిస్తోంది. "ఇజ్రాయెల్‌కు మద్దతుగా సోషల్ మీడియాలో, మెయిన్‌స్ట్రీమ్ మీడియాలో కుమ్మరిస్తున్న తప్పుడు ప్రచారాలను గమనిస్తే.. దేశంలోని మితవాద శక్తులు భారతదేశాన్ని ఎంతలా దుష్ప్రచారాల వేదికగా మార్చాయో ప్రపంచం అర్థం చేసుకోగలదు.." అన్న ఆల్ట్‌న్యూస్ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ సిన్హా వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశం. "వార్తయందు జగము వర్థిల్లుతున్నది" అన్న మాట నిజమేకానీ... ఆ వార్తల్లోని సత్యాసత్యాలను గుర్తించకపోతే వ్యవస్థ అవస్థల పాలవుతుందన్నది అంతకంటే నిజం. ఇప్పుడు నిజాలను గ్రహించడం ప్రపంచానికో సవాలు....

ఒక్కరి ప్రమాదమైనా, అందరి ప్రమాదమే

న్యూస్‌క్లిక్ కార్యాలయంపై, దానితో సంబంధం ఉన్న వారి ఇళ్లపై ఢిల్లీ పోలీసుల అనాగరిక విస్తృత దాడులు; జర్నలిస్టులు, ఇతర ఉద్యోగుల ఎలక్ట్రానిక్ పరికరాలను విచక్షణా రహితంగా (స్వాధీనం చేసుకున్న సందర్భంలో కనీస నిబంధనలకు పాటించకుండా) స్వాధీనం చేసుకోవడం; న్యూస్ పోర్టల్ ప్రధాన కార్యాలయంలో సోదాలు నిర్వహించడం; తీవ్రవాద సంబంధిత అభియోగాలపై న్యూస్‌క్లిక్ సంస్థాపక సంపాదకుడు, ప్రబీర్ పుర్కాయస్థ, దాని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అమిత్ చక్రవర్తిల అరెస్ట్; ఇంకా ఇది చాలదన్నట్టు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ తాజాగా ఒక క్రిమినల్ కేసును దాఖలు చేసిన తర్వాత న్యూస్‌క్లిక్ ఆవరణలో, దాని సంస్థాపక సంపాదకుని ఇంట్లో సోదాల నిర్వహణలతో పాటు ఒక మామూలు డిజిటల్ వార్తా సంస్థపై దాడి చేయాలని ఐదో దర్యాప్తు సంస్థను ఆదేశించారు. ఇలాంటి చర్యలు, 1975-77 మధ్య ఎమర్జెన్సీకాలం నుండి భారతదేశ మీడియా స్వేచ్ఛలో అత్యంత తక్కువ స్థాయిని సూచిస్తున్నాయి. వివిధ



> ముఖ్యంగా 'ద న్యూయార్క్‌టైమ్స్' వ్యాసం, న్యూస్‌క్లిక్ ఏ చట్టాన్నైనా ఉల్లంఘించిందని ఆరోపించలేదు. విచారణ చేసే జర్నలిస్టులు లోతైన పరిశోధన చేసి, డిజిటల్ వార్త నెట్వర్క్ సంపాదకులు లేదా యాజమాన్యాన్ని కలిసి ఉండి ఉంటే, 'ఫైనాన్సింగ్' అనేది, డబ్ల్యుఎంహెచ్ పెట్టుబడి రూపంలో ఇచ్చిందని తెలుసుకొని ఉండెడివారు. వాటి వివరాలను చట్ట ప్రకారం అధికారులకు ఇవ్వడం జరిగింది. ఫిబ్రవరి, 2021 లో దాడులు చేయడానికి రాజకీయ లక్ష్యంతో ఏర్పాటుచేసిన భారత ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఆరోపించిన విధంగా, "మనీ లాండరింగ్" అనే ప్రశ్నే లేదు. ఢిల్లీ హైకోర్టు కూడా న్యూస్ క్లిక్‌కు అనుకూలంగా, కంపెనీ అధికారులను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించింది.

స్థాయిల్లో వృత్తి పరంగా, చట్టపరంగా, రాజకీయపరంగా సమిష్టి చర్యలు, సమర్థవంతమైన ప్రతిఘటనలు లేకుంటే, 'రిపోర్టర్స్ సాన్స్ ఫ్రంటియర్స్' ప్రచురించిన వరల్డ్ ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్ 2023లో, మొత్తం 180 దేశాల్లో 161వ స్థానంలో ఉన్న భారతదేశం 2014 తరువాత సాధించిన క్షీణతనే కొనసాగిస్తుంది.

ఈ నేపథ్యానికి వ్యతిరేకంగా, పుర్కాయస్థ, ఇతరులపై ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ చాలా ఉపయోగకరమైన సమాచారాన్నిచ్చే విధంగా ఉంది. ఆ ఎఫ్ఐఆర్ మనను ప్రావీణ్యంలేని, గందరగోళంలో ఉన్న పోలీసుల మనసు ల్లోకి తీసుకెళ్లి, ఒక ఊహాజనితమైన పోలీస్ రాజ్యం ఎలా ఉంటుందో ఊహించడానికి వీలు కల్పిస్తుంది.


ఎన్.రామ్

ఇది అనాగరిక మైన, క్రూరమైన, తెలివితక్కువ పోలీస్ రాజ్యం, దాని లక్ష్యం (ఒకవేళ కోర్టులు అనుమతిస్తే) "ముందుగా శిక్ష, తరువాతనే తీర్పు" అనే విధంగా ఉంటుంది.

ఎఫ్ఐఆర్‌లో నమోదైన క్రిమినల్ కేసును పరిశీలిస్తే (సున్నితమైన కారణాల వల్ల ఎఫ్ఐఆర్ అప్‌లోడ్ చేయకూడదనే పోలీసుల ఆదేశాలున్నప్పటికీ, ఎఫ్ఐఆర్ కొంతమంది జర్నలిస్టుల చేతుల్లోకి వెళ్ళింది) ఇది ఒక ప్రేరేపిత, నకిలీ కేసు అని తెలుస్తోంది. న్యూస్ క్లిక్‌కు వ్యతిరేకంగా చేసిన ఆరోపణలు సమర్థ నీయమైనవి కాదు, అవి బూటకమైనవి. అవి ఎలా సమర్థనీ యమైనవి కావో "ద హిందూ" సంపాదకీయం స్పష్టం చేసింది.

కానీ న్యూస్‌క్లిక్‌పై దాడి, పోలీసులు చేసిన అల్లర్ల కథనం కాదు, ఇదొక రాజకీయ కథనం. స్వతంత్రంగా, విమర్శనాత్మకంగా వ్యవహరించే ఒక సాధారణ ప్రగతిశీల, వామపక్ష భావ జాలం గల డిజిటల్ వార్తా సంస్థతో, బీజేపీ, హిందూత్వ నిరంకుశ పాలన చేస్తున్న యుద్ధానికి సంబంధించిన కథనం ఇది. ఈ వైరుధ్య స్వభావం అర్థం కావాలంటే, మనం కొన్ని ప్రాథమిక వాస్తవాల్ని చూడాలి.

న్యూస్ క్లిక్. ఇన్ అనే సంస్థను పీపీకే న్యూస్ క్లిక్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంలో 2009లో స్థాపించారు. చాలాకొద్ది బడ్జెట్‌తోనే అది పనిచేస్తుంది. రోజువారీ పనులను ఒక సంపాదక వర్గం నిర్వహిస్తుంది. దీని స్థాపకుడు, ప్రధాన సంపాదకుడైన ప్రబీర్ పుర్కాయస్థ ఒక ఇంజినీర్, విద్యుత్, టెలికాం, సాఫ్ట్‌వేర్ రంగాల్లో పనిచేసే ఒక సైన్స్ కార్యకర్త, భారతీయ వామపక్షాలకు ఒక ప్రభావవంతుడైన మేధావి. ఈ న్యూస్ నెట్ వర్క్ ప్రజా ఉద్యమాలు, పోరాటాలపై వ్యాఖ్యానిస్తూ, విశ్లేషిస్తూ, వాటిని నివేదించే పనిపై దృష్టిని కేంద్రీకరిస్తుంది. ఇది క్రమం తప్పకుండా ఒక స్థాయి సమస్యలపై విమర్శనాత్మక, ప్రగతిశీల గొంతుకలను అందిస్తుంది. ఆ క్రమంలోనే, న్యూస్‌క్లిక్ మోడీ ప్రభుత్వ నిరంకుశ "హిందూత్వ" లేదా హిందూ - నిరంకుశ రాజకీయ ఎజెండాను వ్యతిరేకిస్తూ, దాని విధానాల్ని విమర్శిస్తోంది.

న్యూస్ పోర్టల్ నివేదికలు, విశ్లేషణలు, రోజువారీ తాజా సమాచారం అంతా ఉచితం. వ్యాపారం, చందాదారులపైన, విదేశాల్లో కస్టమర్ల ఎంపిక కోసం పత్రికా రచనల అమ్మకాలపైన, రోజువారీ నిర్వహణకు, దాని విస్తరణకు కొన్ని పెట్టుబడుల పైన ఆధార పడుతుంది. ఈ డిజిటల్ మీడియా వ్యాపారం లాభాపేక్షలేనిది కానప్పటికీ, లాభాల చేత ప్రేరేపించబడదనేది స్పష్టం.

మూడు నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020 - 21లో రైతుల సామూహిక నిరసన కార్యక్రమాలు చేపట్టిన సమయంలో న్యూస్‌క్లిక్ పాత్రికేయ పాత్ర పోషించింది. రైతు ఉద్యమ స్థానం నుండి, సమగ్రమైన, సానుభూతితో కూడిన కవరేజీని, ఆ సందర్భంగా ఉత్పన్నమయ్యే సమస్యలపై హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విస్తృతమైన వ్యాసాలు, వీడియోల్ని ప్రజలకందించింది. న్యూస్‌క్లిక్ కవరేజ్, పెద్ద మీడియా సంస్థలు, వార్తా పత్రికలు, టీవీ ఛానళ్ళ కృషిని కూడా అధిగమించింది. అంతేకాక రైతాంగ ఉద్యమం విజయం సాధించడానికి, జనాదరణలేని చట్టాలు రద్దవడానికి, ఆ కవరేజ్ దోహదపడింది.

అమెరికా పౌరుడు, వామపక్ష మేధావి, కార్యకర్త, అత్యంత ప్రతిభావంతుడైన వ్యాపారి నెవెల్లీరాయ్ సింఘమ్ కథలోకి ప్రవేశిస్తాడు. ఆయన, 'థాట్ వర్క్స్,ఇంక్' అనే ఒక ప్రపంచ స్థాయి ఐటీ కన్సల్టెన్సీ వ్యవస్థాపకుడు, ప్రధాన యజమాని. ఈ సంస్థ భారతదేశానికి చెందిన ఉద్యోగులు, కార్యాలయాలు, పని ప్రదేశాలను కలిగి ఉంది. 2017లో థాట్ వర్క్స్‌ను, బ్రిటీష్ ప్రైవేట్ సంస్థ 'అపాక్స్ పార్ట్నర్స్'కు 785 మిలియన్ డాలర్లకు విక్రయించారు. ఈ విక్రయం ద్వారా పొందిన డబ్బుతో సింఘమ్, అతని టీం సభ్యులు, అమెరికాలో పీపుల్స్ సపోర్ట్ ఫౌండేషన్ లిమిటెడ్ (పీఎస్ఎఫ్) అనే ఒక ప్రైవేట్ సంస్థను స్థాపించారు. ఇక్కడ గమనించదగిన విషయం ఏమంటే, ఈ పీఎస్ఎఫ్ సంస్థ లాయర్, మేనేజర్ అయిన జాసన్ ఫెచర్ సంస్థ తరపున విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం, "పీఎస్ఎఫ్ కు వితరణగా ఇచ్చిన నిధులన్నీ కూడా "థాట్ వర్క్స్" అమ్మకం ద్వారా వచ్చిన నిధుల నుండే వచ్చాయి. పీఎస్ఎఫ్, విదేశీ ప్రభుత్వం నుండి ఎలాంటి నిధులను స్వీకరించలేదు. ఈ ఫౌండేషన్ వరల్డ్ వైడ్ మీడియా హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ (డబ్ల్యుఎంహెచ్) స్వంతంగా కలిగి ఉండి, దానిని నిర్వహిస్తుంది. ఈ సంస్థ, ప్రపంచ ప్రజల గురించి వార్తలను అందించే ప్రగతిశీల మీడియా ప్రాజెక్టులలో వివిధ పెట్టుబడులు పెట్టే, లాభాపేక్ష గల పెట్టుబడి సాధనం."

> మూడు నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020-21లో రైతుల సామూహిక నిరసన కార్యక్రమాలు చేపట్టిన సమయంలో న్యూస్‌క్లిక్ పాత్రికేయ పాత్ర పోషించింది. రైతు ఉద్యమ స్థానం నుండి, సమగ్రమైన, సానుభూతితో కూడిన కవరేజీని, ఆ సందర్భంగా ఉత్పన్నమయ్యే సమస్యలపై హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విస్తృతమైన వ్యాసాలు, వీడియోల్ని ప్రజలకందించింది. న్యూస్‌క్లిక్ కవరేజ్, పెద్ద మీడియా సంస్థలు, వార్తాపత్రికలు, టీవీ ఛానళ్ళ కృషిని కూడా అధిగమించింది. అంతేకాక రైతాంగ ఉద్యమం విజయం సాధించడానికి, జనాదరణలేని చట్టాలు రద్దవడానికి, ఆ కవరేజ్ దోహదపడింది.

2017 సంవత్సరాంతానికి, డబ్ల్యుఎంహెచ్, న్యూస్‌క్లిక్‌ను తన లక్ష్యాలకనుగుణమైన సంస్థగా గుర్తించి, న్యూస్‌క్లిక్‌లో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించింది. కొన్ని సంవత్సరాల పాటు థాట్ వర్క్స్‌లో పని చేసిన న్యూస్ క్లిక్ వ్యవస్థాపక సంపాదకుడు పుర్కాయస్థ ఈ పెట్టుబడిదారుల వద్ద గుర్తింపు పొందాడు. 2018 మార్చిలో న్యూస్‌క్లిక్‌లో పెట్టుబడి కార్యరూపం దాల్చింది.

2021నుండి న్యూస్‌క్లిక్‌ను లక్ష్యం చేసుకొని, కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని సంస్థలు, ముఖ్యంగా ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్, ఢిల్లీ పోలీసు ఆర్థిక నేరాల విభాగం, ఆదాయ పన్ను శాఖలు విస్తృతంగా దాడులు, సోదాలు నిర్వహించి, కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నాయి. 'మనీ లాండరింగ్', లేదా పన్నుల ఎగవేత లేదా పరికరాలు, డాక్యుమెంట్లు, ఈమెయిల్‌లలో తప్పుడు పనులు చేసిన రుజువులు లేకపోవడంతో ఈ విచారణలు నిల్చిపోయాయి.

ఇప్పుడు 'ద న్యూయార్క్ టైమ్స్' ఒక సమగ్రమైన పరిశోధక కథనంతో ప్రవేశిస్తుంది. ఈ కథనానికి "ఏ గ్లోబల్ వెబ్ ఆఫ్ చైనీస్ ప్రోపగాండా లీడ్స్ టు ఏ యూఎస్ టెక్ మొగల్" అనేది శీర్షిక. చైనాను సమర్థించి, దాని గురించి ప్రచారాన్ని ముందుకు తీసుకొనిపోయే విలాసవంతమైన నిధుల ప్రభావాన్ని వెలికి తీసినట్టు ఆ కథనం సారాంశం. వీటి మధ్యలో ఒక శక్తివంతుడైన అమెరికాకు చెందిన మిలియనీర్, నెవెల్లీ రాయ్ సింఘమ్ ఉన్నాడనీ, ఈయన వామపక్షీయుల శ్రేయోభిలాషి అనీ, కాబట్టి ఇది నేరారోపణ చేయదగిన నేరమని ఈ కథనం చెపుతుంది. ఈ వ్యాసం న్యూస్‌క్లిక్ గురించి రెండు ఉదాహరణలు ఇచ్చింది. "భారతదేశంలో అధికారులు, పత్రికలను అదుపుచేసిన సమయంలో, చైనా ప్రభుత్వంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ దానిపై దాడి చేశారు కానీ ఎలాంటి రుజువులు చూపించలేదు; ఈ న్యూస్‌క్లిక్ సైట్‌కు, సింఘమ్ నెట్వర్క్ డబ్బును సమకూర్చింది"

ముఖ్యంగా 'ద న్యూయార్క్ టైమ్స్' వ్యాసం, న్యూస్‌క్లిక్ ఏ చట్టాన్నైనా ఉల్లంఘించిందని ఆరోపించలేదు. విచారణ చేసే జర్నలిస్టులు లోతైన పరిశోధన చేసి, డిజిటల్ వార్త నెట్వర్క్ సంపాదకులు లేదా యాజమాన్యాన్ని కలిసి ఉండి ఉంటే, 'ఫైనాన్సింగ్' అనేది, డబ్ల్యుఎంహెచ్ పెట్టుబడి రూపంలో ఇచ్చిందని తెలుసుకొని ఉండెడివారు. వాటి వివరాలను చట్ట ప్రకారం అధికారులకు ఇవ్వడం జరిగింది. ఫిబ్రవరి, 2021 లో దాడులు చేయడానికి రాజకీయ లక్ష్యంతో ఏర్పాటుచేసిన భారత ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించిన విధంగా, "మనీ లాండరింగ్" అనే ప్రశ్నే లేదు. ఢిల్లీ హైకోర్టు కూడా న్యూస్ క్లిక్‌కు అను కూలంగా, కంపెనీ అధికారులను అరెస్ట్ చేయకుండా మధ్యం తర రక్షణ కల్పించింది. దీనికి సంబంధించిన విషయంపైన ఆదాయ పన్నుల అధికారులు, మీడియా సంస్థకు వ్యతిరేకంగా చేసిన ఫిర్యాదును కింది కోర్టు కొట్టేసింది. చైనా ప్రభుత్వం మాట్లాడుతున్న విషయాల న్యూస్ సైట్ కవరేజ్‌కి సంబంధించి, 70 ఏళ్ళ చైనా విప్లవం, ఆ కాలంలో జరిగిన మార్పులకు సంబంధించి అక్టోబర్ 2, 2019 నాడు పోస్ట్ చేసిన వీడియోతో రావడమే ద న్యూయార్క్ టైమ్స్ జర్నలిస్టులు చేయగలిగేది.

ద న్యూయార్క్ టైమ్స్ కథనం, భావజాలపరంగా బలమైన జర్నలిజం. రిపోర్టింగ్ ముసుగులో ప్రచారంతో కూడిన సంపాదకీయం కూడా అంగీకారయోగ్యమైన విమర్శే. డబ్ల్యుఎంహెచ్ మేనేజర్, లాయర్ అయిన జాసన్ ఫెచర్‌కు, జర్నలిజం ప్రవర్తనా నియమావళిపై తీవ్ర ఆక్షేపణలున్నాయి. ఆ వ్యాసం ప్రచురణకు ముందే రిపోర్టర్లు లేవనెత్తిన ప్రశ్నలకు, ఆయన పీఎస్ఎఫ్ తరపున ఇలా స్పందించాడు: "పీఎస్ఎఫ్ ఎలాంటి నిధులను స్వీకరించలేదు, ఏ విదేశీయుని నుండి గానీ, ఏ సంస్థ నుండి గానీ, ఏ రాజకీయ పార్టీ నుండి గానీ, ఏ ప్రభుత్వం నుంచి గానీ ఎలాంటి మార్గదర్శకాలను తీసుకోలేదు. పీఎస్ఎఫ్ నిధుల వనరు థాట్ వర్క్స్ అమ్మకం ద్వారా కంటే కూడా చైనా నుండి వచ్చినట్లు పాఠకులు విశ్వసించే విధంగా ద న్యూయార్క్ టైమ్స్ కథనం ఉంది."

న్యూస్‌క్లిక్‌ను మళ్ళీ లక్ష్యం చేయడానికి ఈసారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెక్ కార్తైట్ ప్రచారం అంటే, తప్పుడు సమాచారం, భయానక కథనాలు, అవమానాల ద్వారా ఏది అవసరమో ఆ రవ్వను ద న్యూయార్క్ టైమ్స్ కథనం సమకూర్చింది. అమెరికా వార్తాపత్రిక బహిర్గతం చేసిన విధంగా భారతదేశ జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని, దానికి సంబంధించిన ఆరోపణలను సామాజిక మాధ్యమాల ద్వారా హిందూత్వ అనుకూల భక్తులు తప్పుడు ప్రచారానికి పూనుకుంటూ, న్యూస్ క్లిక్, దాని వెనుక ఉన్న వ్యక్తులపై హింసాత్మక బెదిరింపులకు దిగుతున్నారు. ప్రధాన మీడియా స్రవంతిలోని ఒక వర్గానికి చెందిన రెండుటీవీ ఛానళ్ళు ప్రభుత్వానికనుకూలంగా ప్రచారం చేస్తున్నట్లు నటిస్తూ, ఈ తప్పుడు ప్రచారం చేసే వారితో కలిశాయి. దర్యాప్తు సంస్థలు లీక్ చేస్తున్న సమాచారంతో తప్పుడు వార్తలను సృష్టిస్తున్నాయి. ఇది, ఉగ్రవాద సంబంధిత ఆరోపణలపై తాజాగా నేరం మోపి కేసు విచారించడానికి వేదిక అయ్యింది.

అక్టోబర్ 3, ఆ తరువాత జరిగిన దానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జర్నలిస్టులు, న్యాయవాదులు, రాజకీయ, సామాజిక కార్యకర్తలు, ప్రజల నుండి విస్తృతంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. న్యూస్‌క్లిక్ పై బీజేపీ ప్రభుత్వం చేసిన దాడిని ఖండిస్తూ, విమర్శిస్తూ వార్తాపత్రికలు సంపాదకీయాలు, వ్యాసాలు ప్రచురిస్తున్నాయి. ప్రెస్‌క్లబ్‌లు, వర్కింగ్ జర్నలిస్ట్ సంఘాలు, వృత్తి



> 2014 మే, నుండి తమ పనికి సంబంధించి 19 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. కానీ హంతకులపై చర్యల్లేవు. జర్నలిస్టుల రక్షణ కమిటీ చేత సంవత్సరం, సంవత్సరం సంకలనం చేయబడిన గ్లోబల్ ఇంప్యూనిటీ ఇండెక్స్ అనే అవమానకరమైన క్లబ్‌లో భారతదేశం శాశ్వత సభ్యురాలిగా మిగిలింది. ఇటీవల 'ద వైర్' పత్రికలో ప్రచురితమైన వ్యాసం ప్రకారం, 16 మంది జర్నలిస్టులపై 'ఉపా చట్టం' కింద కేసులు మోపారు. ఏడుగురు జైళ్ళలో ఉన్నారు, 8 మంది బెయిల్‌పై బయటికి వచ్చారు. ఒక్కరిని మాత్రం అరెస్ట్ చేయలేదు. ప్రాధాన్యతా క్రమంలో, ప్రతీ కేసును తీవ్రంగా తీసుకోవాలి. న్యూస్ క్లిక్ పై చేసిన దాడికి వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనల ద్వారా వచ్చిన ఊపును ప్రజాతంత్ర ఉద్యమాన్ని నిర్మించడానికి ఉపయోగించాలి.

సంఘాలు ముఖ్యంగా ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, డిగీపబ్, నెట్వర్క్ ఆఫ్ విమెన్ ఇన్ మీడియా ఇండియాతో పాటు న్యూయార్క్‌కు చెందిన జర్నలిస్టుల రక్షణ కమిటీ ప్రభుత్వ దాడిని ఖండించాయి. న్యూస్‌క్లిక్‌కు, అందులో పనిచేస్తున్న జర్నలిస్టులకు సంఘీభావంగా చేపట్టిన సమిష్టి చర్యలు చాలా ప్రోత్సాహకరంగా ఉన్నాయి. అంతే ముఖ్యంగా, భారతదేశంలోని అగ్రశ్రేణి న్యాయవాదులు కొందరు హృదయపూర్వక మద్దతుతో ఈ విషయాన్ని కోర్టుకు తీసుకెళ్ళారు.

కానీ ఇది సరిపోదు. దీనినొక సంఘటనగానే చూస్తే, మీడియా స్వతంత్రత, స్వేచ్ఛను రక్షించే ప్రచారం విజయవంతం కాదు. ప్రభుత్వ అణచివేతను అనేక మార్గాల్లో ప్రతిఘటించి, ఎదుర్కొనవచ్చు. సామాజిక మాధ్యమం, వృత్తిపరమైన మాధ్యమంలోని కొన్ని విభాగాల్లో తప్పుడు సమాచారం, ద్వేష పూరిత రాజకీయాలున్న విషపూరిత సమాచార పర్యావరణ వ్యవస్థలో ప్రచారాన్ని కొనసాగిస్తూ, అభివృద్ధిపరచడమే నేటి నిజమైన సవాల్.

2014 మే, నుండి తమ పనికి సంబంధించి 19 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. కానీ హంతకులపై చర్యల్లేవు. జర్నలిస్టుల రక్షణ కమిటీ చేత సంవత్సరం, సంవత్సరం సంకలనం చేయబడిన గ్లోబల్ ఇంప్యూనిటీ ఇండెక్స్ అనే అవమానకరమైన క్లబ్‌లో భారతదేశం శాశ్వతసభ్యురాలిగా మిగిలింది. ఇటీవల 'ద వైర్' పత్రికలో ప్రచురితమైన వ్యాసం ప్రకారం, 16 మంది జర్నలిస్టులపై 'ఉపా చట్టం' కింద కేసులు మోపారు. ఏడుగురు జైళ్ళలో ఉన్నారు, 8 మంది బెయిల్‌పై బయటికి వచ్చారు. ఒక్కరిని మాత్రం అరెస్ట్ చేయలేదు. ప్రాధాన్యతా క్రమంలో, ప్రతీ కేసును తీవ్రంగా తీసుకోవాలి. న్యూస్ క్లిక్ పై చేసిన దాడికి వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనల ద్వారా వచ్చిన ఊపును ప్రజాతంత్ర ఉద్యమాన్ని నిర్మించడానికి ఉపయోగించాలి. ఈ ఉద్యమం కేవలం స్వతంత్ర జర్నలిస్టులు, విమర్శనాత్మక జర్నలిస్టుల గొంతులకు మాత్రమే కాక, మన రాజ్యాంగం హామీ ఇచ్చిన వారి జీవితాలు, భద్రత, ప్రాథమిక స్వేచ్ఛలను కూడా రక్షించడానికి కట్టుబడి ఉంటుంది.ఒక్కరు ప్రమాదంలో ఉన్నా, అందరూ ప్రమాదంలో ఉన్నట్లే.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451

పోలీస్ అమరుల స్ఫూర్తితో ముందుకు..!



> భారత, చైనా సరిహద్దులో 1959లో జరిగిన సం ఘటనలో దేశ భద్రత కోసం ప్రాణాలను అర్పించిన వీర పోలీ సుల త్యాగాలను స్మరిస్తూ ప్రతీ సంవత్సరం అక్టోబర్ 21 వ తేదీని పోలీస్ సంస్మరణ దినంగా దేశ వ్యాప్తంగా నిర్వహి స్తున్నారు. ఈ సంవత్సరం నుండి ఈ సంస్మరణ దినాన్ని 'పోలీస్ ఫ్లాగ్ డే' గా అక్టోబర్ 21 వతేదీ నుండి 31 వ తేదీ వరకు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతీ సంవత్సరం ఈ పోలీసు అమర వీరుల సంస్మరణ దినం - పోలీస్ ఫ్లాగ్ డేనూ పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వ హించడం ద్వారా అమర పోలీసుల త్యాగం నుండి స్ఫూర్తిని, ప్రేరణను, ఉత్సాహాన్ని పొందుతున్నాం. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా తీవ్రవాదులు, సంఘ విద్రోహక శక్తుల చేతుల్లో 264 మంది పోలీసులు అమరులయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కేవలం ఒక పోలీసు అధికారి మాత్రమే తీవ్రవాదుల చేతిలో మరణించారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రావిర్భావ అనంతరం పీపుల్స్ ఫ్రెండ్లీగా, పోలీసులు అంటే ప్రజల సేవకులు, ప్రజలే మాకు బాస్‌లు అనే విశ్వాసం కలిగే విధంగా తెలంగాణా పోలీస్ శాఖ ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగం గానే, 'ఒక కెమెరా వందమంది పోలీసులతో సమానం' అనే విధానంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సహకారంతో పెద్దఎత్తున సీసీ కెమెరాల ఏర్పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించుకోవడం, ఫ్రెండ్లీ పోలీసింగ్, డయల్ 100, మహిళా భద్రతకు ప్రత్యేకంగా మహిళా భద్రతా విభాగం ఏర్పాటు, స్వాతంత్ర్య భారతచరిత్రలో మరెక్కడా లేని విధంగా వేలమంది పోలీసు అధికారుల నియామకం, కొత్త పోలీసు కమిషనరేట్లు, పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు, రాష్ట్రంలో అంతర్గత భద్రతకు కమాండ్ కంట్రోల్ నిర్మాణం ఇలా ఎన్నో వినూత్న కార్యక్రమాలను పోలీస్ శాఖ అమలు చేస్తున్నది.

ఒకవైపు ఆధునీకరణ దిశగా పోలీసింగ్‌లో సరికొత్త విధానాలు ఉపయోగించుకుంటూ మెరుగైన సేవలను పౌరులకు అందిస్తూనే మరో వైపు అంతేస్థాయిలో సరికొత్త ఆలోచనలతో నేరాలకు పాల్పడుతున్న నేరస్తులను మరింత సమర్థవంతంగా అణచి వేసేందుకు పోలీస్‌శాఖ నిర్విరామ కృషి చేస్తోంది. ఈ ప్రయాణంలో పోలీసులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా, తమ కుటుంబ సభ్యుల భవిష్యత్తు ఆలోచించకుండా ప్రజల రక్షణే ధ్యేయంగా నిర్విరామంగా విధులు చేపడుతున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర అంతర్గత భద్రతకు సవాలు విసురుతున్న వామపక్ష తీవ్రవాదులతోనూ అంతే స్థాయిలో సవాళ్ళను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ దిశలోనే రాష్ట్ర ప్రజల భద్రతలో విధులు నిర్వర్తిస్తున్న తెలంగాణకు చెందిన పోలీసులు మావోయిస్టు, వారి గ్రూపులకు చెందిన చేతుల్లో హతులయ్యారు.

తెలంగాణలో మొట్టమొదటి పోలీస్ అమర వీరుడు మహమ్మద్ ఇబ్రహీం. ఇప్పటివరకు నిస్వార్థ సేవలందిస్తూ, విధి నిర్వహణలో మొత్తం 326 మంది కానిస్టేబుల్ స్థాయి నుండి ఐ.పీ.ఎస్ స్థాయి పోలీస్ అధికారులు అసువులు బాసారు. వీరి లో 180 మంది కానిస్టేబుళ్లు, 52 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఏడుగురు ఏ.ఎస్.ఐ లు, 39 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, పది మంది ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు డీ.ఎస్.పీలు, ముగ్గురు ఐ.పీ.ఎస్ అధికారులతో పాటు ప్రత్యేక దళాలకు చెందిన 32 మంది వివిధ హోదాల అధికారులున్నారు. ప్రజల భద్రత, శాంతి పరిరక్షణకు నిస్వార్థ సేవలందించిన ఈ అమర పోలీసులకు మొత్తం దేశ ప్రజలు అక్టోబర్ 21న నివాళులు అర్పిస్తున్నారు. వారందించిన సేవలను గుర్తుకు తెస్తున్నారు.ఈ అమరవీరుల పోరాట స్ఫూర్తితోనే రాష్ట్రంలో అమలవుతున్న పోలీసింగ్ విధానాల వల్ల పోలీసులంటే మనలో ఒక ఒక భాగమనే మార్పును ప్రజల్లో కల్పించడంలో విజయవంతం కావడం జరిగింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖకు ఇచ్చిన ప్రాధా న్యత కూడా ప్రధాన కారణం.

దేశ అంతర్గత రక్షణలో, సమాజ శాంతి నిర్మాణంలో పని చేస్తూ తీవ్రవాదుల చేతుల్లో బలవుతున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ స్ఫూర్తిగా, పోలీసు అమరుల వారసులుగా సమాజం కోసం పని చేయవలసి ఉన్నది. తమకు కష్టం కలిగితే మిత్రుడైన పోలీసు ఉన్నాడనే నమ్మకం ప్రజల్లో కలిగేలా విధులు నిర్వర్తించాలి. ఖాకీ దుస్తులు, పోలీసు వత్తి అంటేనే త్యాగాలకు ప్రతీక. ఈ విషయాలను పోలీసు సిబ్బంది తమ మనస్సులో ఉంచుకోవాలి. ప్రజలకు శాంతిని అందించే క్రమంలో ఎప్పటికప్పుడు స్ఫూర్తివంతంగా పనిచేయడం అమర పోలీసులకు అందించే అసలైన నివాళి అవుతుంది.

(నేడు పోలీసు అమరవీరుల దినం)

- కన్నెకంటి వెంకట రమణ

రేపు పాలస్తీనా విముక్తవుతుంది

ప్రతి రోజూ మనం చెప్పుకొనే
ఈరోజు చివరిదవాలి
మనమంతా స్వేచ్ఛగా ఇంటికెళ్తాం
చివరాఖరికి, రేపిదంతా ముగిసిపోతుంది
రేపు పాలస్తీనా విముక్తవుతుంది
రేపు పాలస్తీనా విముక్తవుతుంది

నా కన్నీళ్లను తుడిచేందుకు
అమ్మా నాన్నేవరూ బ్రతికిలేరు
అందుకు నేను ఏడువబోను
యుద్ధ బీభత్సానికి నే భయపడుతున్నాను
కానీ ఆ భయాలకు ఏమాత్రం తలొగ్గను
మరింత ధైర్యంగా తలెత్తి నిలబడతాను
నా హృదయాంతరాళంను అడిగి చూశాను
సందేహమే లేదు
రేపు పాలస్తీనా విముక్తవుతుంది
రేపు పాలస్తీనా విముక్తవుతుంది

నిప్పులు కక్కుతూ మంటలు మండుతూ
నింగిన ఎగిసే రాకెట్లను
బాంబులను చూశాను
సూర్యకాంతికి మెరిసే
వర్షపు చుక్కల్లా వున్నాయవి
నా ఆప్తులందరిని దూరం చేశాయి
నా కలలన్నిటినీ లిప్తపాటులో
నాశనం చేశాయి

ఇంతకీ మనుషులుగా
మా హక్కులకేమైంది?
మా జీవితాలకేమైనా విలువుందా?
లేకా ఇంకా ఇవన్నీ ఒట్టి అబద్దాలేనా?
నేను చిన్నపిల్లనేనని నాకు తెలుసు
మరి హింసని రాసిన



నీకు మనస్సాక్షి బ్రతికే వుందా?

ప్రతి ఇసుక రేణువునూ
ప్రతి రాయినీ ప్రతి చెట్టునూ
ఆర్ద్రంగా నా ఒట్టి చేతులతో
నిమురుతున్నాను
అంతే ఆర్ద్రతగా
అవి నాతో బదులిస్తున్నాయి
వారేమి చేయలేరని
ఈ మట్టిలో ఎప్పుడో విముక్తయిన
నీ ఊపిరినెప్పటికీ గాయపరచలేరని

రేపు పాలస్తీనా విముక్తవుతుంది
రేపు పాలస్తీనా విముక్తవుతుంది

రేపు పాలస్తీనా ఊపిరి పోసుకుంటుంది
రేపు పాలస్తీనా విముక్తి గీతాన్ని
ఆలపిస్తుంటుంది

మూలం : Hamza Namira / Maher Elzein రాసిన Palestine, tomorrow will be free పాట నుండి

అనువాదం : అమృతరాజ్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
రాజన్న సిరిసిల్ల–జగిత్యాల
శనివారం | అక్టోబర్ 21, 2023 | www.navatelangana.com



నేల తల్లికి పూల హారతి

- వేములవాడలో సద్దుల బతుకమ్మ జాతర
- పూలవనమైన వీధులు

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ వేడుకలు శనివారం వేములవాడలో కన్నుల పండువలా జరిగాయి. వేములవాడలో ఏడు రోజులకే నిర్వహించే సద్దుల బతుకమ్మ సంబురం అంబరాన్నంటింది. వీధులన్నీ పూలవనమయ్యాయి. మూలవాగు, బతుకమ్మ ఘాట్‌ల వద్ద సందడి వాతావరణం నెలకొంది. మహిళలు, చిన్నారులు ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మల నిమజ్జనం చేశారు. నిమజ్జన కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు.
నవతెలంగాణ - వేములవాడ

పూలతో దేవుళ్లను పూజిస్తారు కానీ, పూలనే దేవుళ్లుగా పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ బతుకమ్మ పండుగదనే చెప్పవచ్చు. బతుకమ్మ పండుగ సంబరాలు వేములవాడలో కన్నుల పండువగా ఏడవ రోజుతో పెద్ద బతుకమ్మతో ముగిసాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ ఉత్సవాల తంగేడుపూలు, గునుకపూలు, బంతి, చామంతి బొడ్డెమ్మలతో అందమైన బతుకమ్మను పేర్చిన మహిళలు సాయంత్రం వేళలో ఇంటి ముంగిళ్లలో బతుకమ్మ ఆడారు. రాష్ట్రంలోని ఎక్కడలేని విధంగా ప్రాంతాలకు భిన్నంగా వేములవాడలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ వేడుకలను జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఏడు రోజు పండుగలో పుట్టినిల్లు, మెట్టినిల్లు గల ఆడబిడ్డలు బతుకమ్మ పండుగను ఘనంగా ఇక్కడ ఆటపాటలతో ఆడి పాడుతారు. సద్దుల బతుకమ్మ కోసం వేములవాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారు. సుభాష్ నగర్ నుండి బతుకమ్మ తిప్పవరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రమ పద్ధతిగా వెళ్లే విధంగా బారికేడ్లను ఏర్పాటుచేసి, వాహనాలను రాకుండా పోలీస్‌శాఖ వారు ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకస్తున్నారు. దేవాలయ అధికారులు దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణతో కళ్ళు జిగేలుమనేలా దేవాలయం అంత మనోరంగా ఏర్పాట్లు చేశారు.









పూలవనమైన వీధులు

రామ.. రామ ఉయ్యాలో రాముని సి రామ ఉయ్యాలో.. రామ ఉయ్యాలో అంటూ చప్పట్లు కొడుతూ.. కోలాటాలు వేస్తూ లయబద్ధంగా ఆటపాటలతో మహిళలు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు..ఏ వీధి చూసిన రంగురంగుల పూల బతుకమ్మలతో కొత్త శోభ సంతరించుకుంది. మహిళలు పసుపుతో గౌరమ్మ (బొడ్డెమ్మ)ను చేసి వీధి కూడలిలో, అనంతరం శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో బతుకమ్మ ఆడారు. ఆలయ ధర్మగుండంలో, బతుకమ్మ తిప్పలు, మూలవాగులోని నీటి ప్రవాహంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ వేడుకలు చూడడానికి ఉమ్మడి జిల్లా కరీంనగర్ నుండి పలువురు ప్రముఖులు వచ్చి వేడుకలను తిలకించారు.



వేములవాడలో బహుజన బతుకమ్మ

సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా వేములవాడలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మను వేడుకలను నిర్వహిస్తారు. తెలంగాణలోని సంస్కృతిని నాగరికతను బతుకమ్మను బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విమలక్క అన్నారు. రైతులు క్షేమంగా ఉండి పంటలు సమృద్ధిగా పండి పాడి పంట చల్లగా ఉండాలని కోరారు. బహుజన బతుకమ్మ అంటే అందరూ ఒకటే అని తెలిపేదన్నారు. వేములవాడలోని పలు వీధుల్లో మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ వారితో ఆడారు.

బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు..

రాజనక్షేత్రంలో బతుకమ్మ వేడుకలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అధికారులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో ఎలాంటి ఇబ్బంది కలగకుండా మున్సిపల్, పోలీస్ శాఖ వారు ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవంచనీయ సంఘటన జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. వేడుకలు జరుగుతున్న ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు.

న్యాయస్థానం ఆవరణలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న న్యాయమూర్తులు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని న్యాయస్థానం ఆవరణలో శుక్రవారం న్యాయమూర్తులు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ మహిళా న్యాయమూర్తులు న్యాయవాదులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి ప్రేమలత, సబ్ జడ్జి శ్రీలేఖ, మహిళ న్యాయవాదులు, కోర్టు మహిళ స్టాఫ్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సజ్జనం అనిల్ కుమార్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రెటరీ గుడ్ల కిషన్,సీనియర్ న్యాయవాదులు వసంతం, గోవింద్ భాస్కర్, పెంట శ్రీనివాస్, నాగరాజు గౌడ్, వేణు, హరికృష్ణ పాల్గొన్నారు.

17వ పోలీస్ బెటాలియన్‌లో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న 17వ బెటాలియన్ అధికారులు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : బెటాలియన్ మహిళా అధికారులు పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు. బెటాలియన్ మహిళా ఉద్యోగులు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చగా, పలువురు సంతోషంగా బతుకమ్మ పాటలు పడుతూ చిన్నారులు, మహిళలు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్ వద్ద బతుకమ్మ నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ యస్.శ్రీనివాస రావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంప్రదాయాలను, ఆచారాలను, పద్ధతులను, సంస్కృతులను చాటి చెప్పే ప్రాచీన పండుగ బతుకమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు ఎ.జయ ప్రకాశ్ నారాయణ, యమ్.పార్థసారథిరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.శైలజ, అధికారులు పాల్గొన్నారు.

రమేష్ బాబు పౌరసత్వం కారణంగానే నాకు టికెట్ వచ్చింది

- సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో చల్మెడ లక్ష్మినర్సింహారావు



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మినర్సిహారావు

నవతెలంగాణ - చందుర్తి : రమేష్ బాబు పౌరసత్వం కారణంగానే తనకు టికెట్ వచ్చిందని బీఆర్ఎస్ అభ్యర్థి చలిమెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం లో ఆయన మాట్లాడారు. ఇక్కడ నాలుగుసార్లు ఓడిపోయిన ఆది శ్రీనివాస్ ఆకలితో ఉన్నాడని ఆయన వేములవాడ ప్రాంతాన్ని ఎప్పుడు దోచుకోవాలని చూస్తున్నాడని, ప్రజలపై కేసులు పెట్టించడం తన పని అని ఆరోపించారు. తమది ఆకలి కాదు సమాజ సేవా అన్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ తెచ్చుకుంది తమ పదవుల కోసం కాదని ప్రజల బతుకు కోసమన్నారు. రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంటు ఇస్తామని అనడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ఆగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, తిప్పని శ్రీనివాస్, పొన్నాల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు మేకల ఎల్లయ్య, నాయకులు ఉన్నారు.

రబీలో ఆరుతడి పంటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న శాస్త్ర వేత్త

నవతెలంగాణ - చందుర్తి : రబీలో ఆరుతడి పంటలు వేసుకోవాలని కరీంనగర్ ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ కె మదన్మోహన్ సూచించారు. శుక్రవారం మూడపెల్లి రైతు వేదికలో రైతులకు వ్యవసాయ పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో ఆరుతడి పంటలు వేసుకుంటేనే లాభసాటిగా ఉంటుందని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసినప్పుడే రైతులు లాభాలు లాభాల బాటలో పయనిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్‌రామ్ కళాశాల అసోసియేటెడ్ డాక్టర్ శ్రీదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఉషారాణి మధుకర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రియదర్శిని డాక్టర్ సతీష్ రమ్య దీపిక రాజు సతీష్ సందీప్ యోగేష్ ఆర్ ఏ డబ్ల్యు ఈ పి విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీ చేరికలు..

నవతెలంగాణ - కోనరావుపేట : కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలోని శ్రీ బీరప్ప కురుమ సంఘం సభ్యులు కొలనూరు సింగిల్ విండో చైర్మెన్ సంకినేని రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ ఎమ్మెల్యేగా చల్మెడ లక్ష్మీనరసింహారావును గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, తాళ్లపల్లి సతీష్ గౌడ్, జలగం అరవింద్ రావు, రఘురాములగౌడ్, బుర్ర పవన్ గౌడ్, మమిండ్ల అంజయ్య, విరవేని మహేష్ ఉన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకొన్న నగదు

నవతెలంగాణ-మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలో చేసిన తనిఖీల్లో నగదును పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న 2 లక్షల, 70 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ లక్ష్మినారాయణ తెలిపారు. నగదు ఎఫ్ఎస్‌టి అధికారులకు అందించినట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఈవీఎంల మొదటి రాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : త్వరలో జరిగే శాసన సభ ఎన్నికలకు సంబంధించి మొదటి రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయిందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ వీడియో ఎన్ఐసీ హాల్ నందు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూం నందు ఉనటువంటి కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల రాండమైజేషన్ మొదటి రాండమైజేషన్ నిర్వహించారు. ప్రక్రియ పూర్తి చేసి స్క్రీన్ ద్వారా చూపించారు. వారి సమక్షంలో మొదటి రాండమైజేషన్ ప్రక్రియ ప్రక్రియ పూర్తి చేసిన వేములవాడ, సిరిసిల్ల నియోజక వర్గాలకు కేటాయించిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌ల జాబితా రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేశారు. కేంద్ర ఎన్నికల మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరిస్తూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్, ఆర్డీఓ లు ఆనంద్ కుమార్, మధు సూదన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



పెరుగుతున్న ఎన్నికల హడావుడి

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ :

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎన్నికల హడావిడి మొదలైంది .పార్టీల కార్యక్రమాల్లో వేగం పెరిగింది. ప్రతిపక్ష పార్టీలు జాతీయ నేతల పర్యటనలతో దీటుగా జనాల్లోకి వెళ్లే ప్రయత్నాన్ని ఆరంభించారు. టికెట్ ఖరారు చేసే పనిలో పార్టీలు తలామునకలై ఉన్నాయి. అన్ని పార్టీల నాయకుల ఆరోపణలు ప్రత్యారోపణలతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఈ క్రమంలో తమ మాటలు, విధానాలు జనంలోకి సూటిగా ,సుత్తి లేకుండా వెళ్లేందుకు పార్టీలు నినాదాలను సిద్ధం చేస్తున్నాయి. ఎన్నికల తేదీ లోపే అసెంబ్లీ అభ్యర్థులు నియోజకవర్గాలను చుట్టేయాలి. పార్టీ అధినేతలు రాష్ట్రమంతా హెలికాప్టర్లలో చక్కర్లు కొట్టాల్సిందే. పాదయాత్రలో, మీటింగ్లో, బహిరంగ సభలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు శ్రమించాల్సి ఉంటుంది. ఒక్కో నియోజకవర్గంలో 2 లక్షల నుంచి గరిష్టంగా మూడు లక్షల వరకు ఉన్న ఓటర్లకు చేరువకావడం అంత సులువైన విషయం కాదు. ఇప్పుడంతా సెకండ్లలో విషయాన్ని సూటిగా చెప్పే రీల్స్ యుగం. అందుకే పార్టీలో నినాదాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి ఒకసారి చెబితే ఆ తర్వాత జనం మూలలో ఈ రెండు నెలలు నానేలా ఉండాలని వ్యూహకర్తలకు సూచిస్తున్నారు. ప్రచారంలో సానుకూల అంశాల కంటే ప్రతికూలమైనవే వేగంగా జనాన్ని ఆకర్షిస్తాయి. దీన్ని గుర్తించే వ్యూహకర్తలు ప్రత్యర్థి పార్టీలపై సామాజిక మాధ్యమాలు, సమావేశాల్లో నినాదాలతో హోరెత్తిస్తున్నారు. పదేళ్ల పాలనలో లోపాలను ఎత్తిచూపుతూ "సాలు దొర... సెలవు దొర.." అని బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నది. అధికార బీఆర్ఎస్ అభివృద్ధి నినాదంతో ముందుకెళుతూ "స్కీములు కావాలో.... స్కాంలు కావాలో.." తేల్చుకోవాలని ఓటర్లను అడుగుతోంది. "బీజేపీ డకౌట్... కాంగ్రెస్ రన్ అవుట్.." అంటూ పంచులు వేస్తోంది. ముఖ్య నేతలు పత్యర్థులపై ప్రచారస్త్రాలు సంధిస్తున్నారు. తాజాగా "రేటెంత రెడ్డి" అంటూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏమో ప్రభుత్వంపై విమర్శల కంటే ప్రస్తుతానికి తమ ఆరు పథకాలు గ్యారెంటీ పేరుతో జనంలోకి తీసుకెళ్లేందుకు ప్రాధాన్యమిస్తున్నది. ఇలా ఎవరికివారు ఎత్తులకు పైఎత్తులతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

బెల్ట్‌షాపులపై దాడులు



పోలీసులు పట్టుకొన్న మద్యం

నవతెలంగాణ -మెట్ పల్లి : మెట్‌పల్లి మండలంలోని వెంపేట్ గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.7250 విలువ గల మద్యాన్ని పట్టుకొని బెల్టు షాప్ నిర్వాహకుడు పల్లి శేఖర్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ -మెట్ పల్లి :



మృతిచెందిన విశాల్

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన మెట్‌పల్లి పట్టణం గాజులపేటలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులపేటకు చెందిన ఎక్కాలదేవి విశాల్(27) సాఫ్ట్‌వేరు ఉద్యోగం చేసున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సజావుగా ధాన్యం కొనుగోలు జరిగేలా చూడాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, సజావుగా ధాన్యం సేకరణ పూర్తి చేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్‌తో కలిసి ధాన్యం కొనుగోలుపై సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 258 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 3లక్షల 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. 87లక్షల గన్నీ బ్యాగుల అవసరం ఉంటుందన్నారు. 6వేల 634టార్పాలిన్లు, 632పాడీ క్లీనర్‌లు, 620తేమ కొలిచే మెషీన్‌లు, 816ఎలక్ట్రానిక్ తూకం మెషీన్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, బాగా ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకురావాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులు తమ వెంట వ్యవసాయ విస్తరణ అధికారులచే ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్కు, పట్టా పాసు పుస్తకం జిరాక్స్ ప్రతులను వెంట తేవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వాహనాల్లో లోడ్ చేయించి రైస్ మిల్లులకు తరలించాలని, సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. సమీక్షలో జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు, ఆర్డీఓ కొండల్‌రావు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

మిడ్ మానేర్ నిర్వాసితుల బాధలు వర్ణనాతీతం

- అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తా..
- చల్మెడ లక్ష్మీ నరసింహారావు

నవతెలంగాణ - వేములవాడ : బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తానని సీఎం కేసీఆర్ కృషితో ఇప్పటికే చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శుక్రవారం వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు గులాబీ జెండా కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని మహాత్మా గాంధీ, సర్వాయి పాపన్న, సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్, చాకలి ఐలమ్మ, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. గ్రామస్తులు డప్పుచప్పులతో, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా చల్మెడ స్వయంగా డప్పు వాయించుకుంటూ, అందరితో కలసి నడిచి కార్యకర్తల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ మిడ్ మానేర్ ముంపు గ్రామాల ప్రజలు పైకి చూస్తే బాగా కనిపిస్తున్నారే తప్ప వారి కడుపులోని బాధ, కళ్ళల్లోని నీళ్లు మాత్రం కనిపించడం లేదని, వారి బాధలు వర్ణనాతీతమని, నిర్వాసితుల త్యాగాలు వెలకట్టలేనివని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకే గుండెకాయ వంటి మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికి నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాకపోవడం చాలా బాధాకరమన్నారు. చీర్లవంచ గ్రామంలో ముఖ్యంగా మూడు సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మరోసారి అధికారం ఇచ్చి, సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసి, వేములవాడ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే చీర్లవంచతో పాటు మిగతా గ్రామాల ప్రజల సమస్యలను 6నెలల్లోపు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అట్లాగే రూ. 600 కోట్లతో పాత చీర్లవంచ గ్రామంలో అమెరికా దేశం సహకారంతో చేపల ప్రాసెసింగ్ యూనిట్ స్థాపనకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, దీంతో సుమారు 5వేల మందికి ఉపాధి లభిస్తుందని, నిర్వాసితుల ప్రధాన డిమాండ్ అయిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితో పాటు అపెరల్ పార్కులో ఉద్యోగ నియామకాలలో మిడ్ మానేరు యువతి యువకులకు ప్రత్యేక కోట అమలు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రమ్మ–బాబు, వైస్ ఎంపీపీ రవి చందర్ రావు, ఎంపీటీసీ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు వనపర్తి దేవరాజ్, సర్పంచులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలతో చలిమెడ

కార్యాలయం చెత్త



ఈ ఫోటోలో చూస్తున్నది ఏదో డంప్ యార్డు అనుకుంటే పొరపాటే. మండల పరిషత్ కార్యాలయం ముందు చెత్తను ఇలా డంప్ చేశారు. కార్యాలయం చుట్టూ చెత్త పేరుకుపోవడంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు గ్రామాల్లో శుభ్రత ఉండాలి, కానీ కార్యాలయం చుట్టూ ఇదేంటీ అని ప్రశ్నిస్తున్నారు.

-నవతెలంగాణ - చందుర్తి

కాంగ్రెస్‌లో చేరికలు


నవతెలంగాణ-జూలపల్లి
మండలంలో అధికార బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. మండలంలోని బీఆర్ఎస్ సర్పంచ్‌లు, దూళికట్ట సింగిల్ విండో చైర్మన్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్, సింగిల్ విండో డైరెక్టర్లు శుక్రవారం పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆధ్వర్యంలో ఏఐసీసీ కార్యదర్శులు, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్‌లో చేరిరన వారిలో జూలపల్లి మండలానికి చెందిన దూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణు గోపాల్ రావు, డైరెక్టర్ మాదారపు శ్రీనివాస్ రావు,సింగిల్ విండో డైరెక్టర్ కాల్వల అంజయ్య, వెంకట్రావుపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దుగ్యాల శ్యాంసుందర్ రావు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే..

- చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తాం..
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ
- జగిత్యాల కొత్తబస్టాండ్ వద్ద విజయభేరి సభ



నవతెలంగాణ- జగిత్యాల
బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన ప్రతీ బిల్లుకు కేసీఆర్ మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. బస్సు యాత్రలో భాగంగా జగిత్యాల కొత్తబస్టాండ్ వద్ద నిర్వహించిన విజయభేరి సభలో రాహుల్ పాల్గొని మాట్లాడారు. 'గతంలో లోక్‌సభ సభ్యత్వం రద్దయ్యాక ఢిల్లీలోని నా ఇంటిని ఖాళీ చేయించారు. కానీ నా ఇల్లు.. దేశ ప్రజల హృదయాల్లో ఉందన్నారు. బలహీనవర్గాల జనాభా లెక్కలు ఉండాలని కేంద్రాన్ని కోరినట్టు చెప్పారు. ఓబీసీలు దేశానికి వెన్నెముక లాంటివారని, వారికి రిజర్వేషన్లు ఇచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రావడం లేదని విమర్శించారు. ఓబీసీలకు అండగా నిలిచేందుకు మోదీ, కేసీఆర్ సిద్ధంగా లేరు.. ఓబీసీల సంఖ్య ఎంతో ఎందుకు లెక్కలు తీయరు? బడ్జెట్‌లో వారికి ఎంత ఖర్చు చేస్తున్నారో ఆలోచించాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఓబీసీలు 50శాతం వరకు ఉన్నారని,



ప్రజల జేబు నుంచి డబ్బు సేకరించి అదానీ జేబులోకి పంపి స్తున్నారు. తెలంగాణంలో కేసీఆర్ నియంతలా వ్యవహ రిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆత్మ జగిత్యాల ప్రజలతో ముడిపడి ఉందని, జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు జగిత్యాలలో రాహుల్ గాంధీకి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. 4 కిలోమీటర్లు బైక్ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ... రాహుల్ గాంధీ ప్రచారం కాంగ్రెస్ విజయానికి ప్రతీక అని చెప్పారు. జగిత్యాలకు రాహుల్‌గాంధీ రావడం పల్ల హర్షం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల నుంచి గెలిచినా ఓడినా.. ప్రజల మధ్యే ఉన్నానని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు జగిత్యాల నాంది పలుకుతుందని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగుల యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులను రెగ్యులర్ చేస్తామన్నారు. నాడు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చి, రైతుల్లో ఆత్మస్థైర్యం నింపాం అని అన్నారు. కాంగ్రెస్‌కు మాత్రమే ఉచిత విద్యుత్‌పై పేటెంట్ హక్కు ఉందని తెలిపారు. కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారు. రాహుల్ గాంధీ హిందీలో మాట్లాడగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలుగులోకి ఉపన్యాసాన్ని అనివాధం చేశారు... అంతకు ముందు కాంగ్రెస్ విజయభేరి యాత్రలో భాగంగా జగిత్యాలకు వెళ్తూ మార్గమధ్యంలో బస్టాప్ వద్ద ఆగిన రాహుల్‌గాంధీ.. ప్రయాణికులతో ముచ్చటించారు. చిన్నారులకు చాక్లెట్స్ అందించారు. టిఫిన్ బండి వద్దకు వెళ్లి సరదాగా దోసెలు వేశారు. అలాగే, మార్గ మధ్యలో కల్లు గీత కార్మికుల కనపడటంతో రాహుల్ బస్సు ఆపి వారి వద్దకు వెళ్లారు.. వారితో మాట్లాడి కష్టసుఖాలను ఆడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీలు కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, పాల్గొన్నారు.

కోరుట్ల : కాంగ్రెస్ పార్టీ చేపట్టిన బస్సుయాత్రలో భాగంగా జగిత్యాల నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న రాహుల్‌గాంధీ కోరుట్ల పట్టణంలోని మక్కాస్ ఫంక్షన్ హాల్‌లో భోజనం చేసి మాట్లాడారు. చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని, గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక కార్యచరణ ఏర్పాటు చేసి ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పని చేసి, పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు.



మొదటి దశ ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

నవతెలంగాణ- పెద్దపల్లి
అసెంబ్లీ ఎన్నికలలో వినియోగించే ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, శ్యాం ప్రసాద్‌లాల్‌లతో కలిసి ఈవీఎం యాత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామని తెలిపారు. మొదటి దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో జరుగు తుందన్నారు. ఈవీఎం యంత్రాలు మొదటి దశలో నియోజకవర్గాల వారీగా కేటాయించడం జరుగుతుందని, రెండవ దశ ర్యాండమైజేషన్ రిటర్నింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాల వారిగా ఈవీఎం యంత్రాల కేటాయింపు కోసం చేస్తారని తెలిపారు. పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు, భూపాల్ పల్లి జిల్లాలో ఉన్న మంథని నియోజకవర్గానికి సంబంధించిన ఐదు మండలాలకు సైతం ఈవీఎం యంత్రాల కేటాయింపు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ నుంచి జరుగుతుందని, ధర్మారం మండలానికి సంబంధించి ఈవీఎం యంత్రాలను జగిత్యాల జిల్లా కలెక్టర్ కేటాయిస్తారని చెప్పారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మనకు అవసరం ఉన్న బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు కంటే 25 శాతం అదనంగా, వీవీ ప్యాట్‌లు 40 శాతం అదనంగా కేటాయించడం జరుగుతుందన్నారు. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గానికి 323 బ్యాలెట్ యూనిట్లు, 323 కంట్రోల్ యూనిట్లు, 362 వీవీ ప్యాట్లు, మంథని అసెంబ్లీ నియోజకవర్గానికి 360 బ్యాలెట్ యూనిట్లు, 360 కంట్రోల్ యూనిట్లు, 403 వీవీ ప్యాట్లు, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి 362 బ్యాలెట్ యూనిట్లు, 362 కంట్రోల్ యూనిట్లు, 406 వివి ప్యాట్లు ర్యాండమైజేషన్ ప్రక్రియతో కేటాయించా మని అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఉన్న స్ట్రాంగ్ రూంకు తరలించే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేస్తామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరవుతున్న నేపథ్యంలో రాజకీయ సమావేశాలు, సభలు నిర్వహించేటప్పుడు అనుమతి కోసం 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు మధు మోహన్, వి. హనుమా నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే మోసాల పార్టీ

- బీఆర్ఎస్ మంథని అభ్యర్థి పుట్ట మధూకర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని
కాంగ్రెస్ అంటేనే మోసాల పార్టీ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. శుక్రవారం మంథనిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ కొన్నేండ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలిచిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీల గురించి ఆలోచిం చకుండా, బీసీల కులగణన చేయకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్‌లో బీసీలను నిన్నటి దాక ఎదగనివ్వకుండా, చూసిం దన్నారు. తెలంగాణలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు దాదాపు 80 శాతం ఉన్నారని తెలిపారు. కుటుంబ సమగ్ర సర్వే ద్వారా సీఎం కేసీఆర్ కులగణన ఇప్పటికే చెప్పటారని చెప్పారు. మంథని నియోజకవర్గం నుంచి పీవీ నరసింహారావుతోపాటు ఎందరో మహానుభావులు, మహానీయులు ఉన్నప్పటికీ రాహుల్ గాంధీ వారికి గురించి మాట్లాడక పోవడంతో బాధాకరమన్నారు. మంథనిలో రాహుల్ గాంధీ చేపట్టిన విజయభేరి యాత్ర పూర్తిగా అట్టర్ ప్లాప్ అయిందన్నారు. అగ్రనేతగా ఉన్న రాహుల్‌గాంధీ ఈ ప్రాంతానికి వస్తే ఆ సభకు ప్రజలు పెద్ద ఎత్తున రాకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మూట సంచులను వెదజల్లుతా ఉన్నాడని, రాహుల్ గాంధీ సభలో మందు కూడా సప్లై చేసినట్టుగా తెలుస్తుందని ఆరోపించారు. కర్నాటకలోని డబ్బులను తెలంగాణకు తరలించి ఓటర్లకు పంచాలని చూస్తున్నారని ఆరోపించారు. బీసీలపై కపట ప్రేమను బీసీ లందరూ కూడా గమనించాలన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిక మేజార్టీతో గెలుపొందుతుందని దీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎక్కేటి అనంతరెడ్డి, శంకర్‌గౌడ్, సెగ్గంరాజేష్, ఆకుల కిరణ్, కొత్త శ్రీనివాస్, ఆరేపల్లి కుమార్, జంజర్ల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.15,67,380 నగదు, 254.87 మద్యం సీజ్

- జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



నవతెలంగాణ-జగిత్యాలటౌన్
అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని జగిత్యాల ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ అన్నారు. గడిచిన 24 గంటలో మొత్తం రూ. 15,67,380 నగదు, రూ.1,08,654 మద్యం పట్టుకున్నట్టు చెప్పారు. అలాగే ఇతర వస్తువులు 1078, చీరెలు 200, తెల్ల చొక్కాలు 132, హ్యాండ్ బ్యాగ్‌లు 40, హాట్ బాక్స్‌లు 270 సుమారుగా అంచనా విలువ రూ.7,57,670 ఉంటుందని వాటిని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లా పరిధిలో ఎవరైన ఎక్కువ డబ్బులను తీసుకువెళ్లరాదని, ఒక వేళ తీసుకెళ్తే రసీదు, తగిన పత్రాలు వాటి వివరాలు ఉండాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.90వేల నగదు, చీరల పట్టివేత



పట్టుకున్న నగదు

నవతెలంగాణ-మల్లాపూర్
మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద గురువారం రాత్రి రూ.90వేల నగదు, 139 చీరలు పట్టుకున్నట్టు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో నగదును గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, కోటేశ్వర్రాజు, పోలీస్ కాని స్టేబుల్ సురేష్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి మండపాల వద్ద అన్నదానం

నవతెలంగాణ-మల్లాపూర్
మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలో దుర్గాదేవి మండపాల వద్ద మహిళలు మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో దుర్గాదేవి మండపాల వద్ద ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి మంచిది..

నవతెలంగాణ-జగిత్యాలటౌన్
సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి మంచిది అని తెలంగాణ ఆర్ సీనియర్ సీటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని వివేకానంద మినీ స్టేడిఎంలో సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి రోజు సైకిల్ తొక్కడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువ అని చెప్పారు. రక్తంలో కొవ్వు నిల్వలు తగ్గిస్తుందని, పల్స్ పడి పోకుండా చూస్తుందన్నారు. టైప్-1, టైప్-2 డయాబెటిస్ పేషంట్ల ఆరోగ్యం మెరుగు పర్చడంలో సైకిల్ తొక్కడం భాగా పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి, అసోసియేషన్ గౌరవ సలహాదారు మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్.దేశాయ్, జిల్లా సైక్లింగ్ క్లబ్ కన్వేనర్, సీనియర్ సిటీజేన్స్ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు పి.సతీశ్ రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విష్ణునాథం, సీనియర్ సిటీజేన్స్, పెన్షనర్స్ పాల్గొన్నారు.



ఓటరు చేతిలో వజ్రాయుధం 'సీ విజిల్'

- స్మార్ట్ ఫోన్‌తో ఎన్నికల అక్రమాలకు అడ్డుకట్ట
- తప్పించుకునే వీలు లేకుండా ఆధారాలతో కంప్లైంట్
- ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో చర్యలు



నవతెలంగాణ- జగిత్యాల
ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పౌరులకు ఎన్నికల సంఘం మంచి అవకాశం కలిపిచింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనల్లో ఎటువంటి ఆధారాలు, సాక్ష్యాలు దొరకకపోవడంతో చాలా సార్లు ఫ్లయింగ్ స్క్వాడ్‌ల నుంచి తప్పుచేసిన వారు తప్పించు కుంటున్నారు. ఎన్నికలు పారదర్శంగా నిర్వహించాలని, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం సరికొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టింది. 'సీ విజిల్' అనే యాప్‌ను ఎన్నికల సంఘం రూపొందించింది. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుం డా ఉండేందుకు, రాజకీయ పార్టీలు నిబంధనలను ఉల్లంఘిం చకుండా నిరోధించేందుకు సీ విజిల్ యాప్ ఎంతోగానో ఉపయోగపడుతోంది. ఈ యాప్ ద్వారా ప్రతి పౌరుడు తన దృష్టికి వచ్చిన ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించిన విషయాలను ఫిర్యాదు చేసే అవకాశం కలిపిచింది. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధిత ఫొటోలు, వీడియోలను సీ విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటారు.

పౌరుల వద్ద ఇంటర్నెట్ కనెక్షన్, జీపీఎస్ యాక్సెస్‌తో కూడిన ఆండ్రాయిడ్ లేదా ఐవోఎస్ స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ఎన్నికల్లో ఎక్కడైనా అక్రమాలు జరుగుతున్నట్టు తెలిస్తే సీ విజిల్ యాప్‌లో ఫొటోలు తీయాలి. వాటిని అదే యాప్‌లో అప్‌లోడ్ చేసి వివరాలు నమోదు చేయాలి. రెండు నిమిషాల నిడివితో వీడియో కూడా అప్‌లోడ్ చేసే వీలుకలిపిచింది. ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్‌లో ఉండాలి. అభ్యర్థులు, స్థానిక నాయకులు ఎవరైనా వచ్చి తమ పార్టీకే ఓటు వేయాలని డబ్బులు పంచేందుకు ప్రయత్నించినా మీరు కంప్లైంట్ చేయొచ్చు. అంతేకాదు.. .ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి సభలు, సమావేశాలు విద్వేషపూరితంగా కామెంట్స్ చేసినా ఫిర్యాదు చేయొచ్చు.

సీ విజిల్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత అందులో ఫిర్యాదుదారుని వివరాలతో లేదా వివరాలు తెలపకుండా కూడా లాగ్ ఇన్ కావొచ్చు. యాప్‌లోకి లాగ్ ఇన్ కాగానే నేరుగా ఫొటో, డియో నమోదు చేసే స్క్రీన్ ఓపెన్ అవుతుంది. ఈ యాప్‌లో పౌరులు యాప్‌లో పంపిన ఫొటోలు, వీడియోలు నేరుగా స్మార్ట్ ఫోన్‌లో ఉండే జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్) ద్వారా సంబంధిత జిల్లా ఎన్నికల కంట్రోల్ రూంకు చేరుతాయి. ఆటోమేటెడ్ లొకేషన్ మ్యాపింగ్‌తో జిల్లా కంట్రోల్ రూం నుంచి ఫీల్డ్ యూనిట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్, రిజర్వు టీమ్ తదితర విభాగాలకు సమాచారం అందిస్తారు. జీపీఎస్‌ను ట్రాక్ చేసి లొకేషన్ మ్యాప్ చేస్తారు. జీ ఎస్ సూచనలు, నావిగేషన్ టెక్నాలజీని ద్వారా ఫీల్డ్ యూనిట్ నేరుగా ఫిర్యాదు చేసిన స్థానానికి చేరుకుంటారు. ఇప్పటి వరకు కొన్ని ఫిర్యాదులపై ఇలాగే చర్యలు తీసుకున్నారు. ఇదంతా కొన్ని నిమిషాల్లోనే జరిగిపోతుంది. మీరు కంప్లైంట్ ఇచ్చినప్పుడు మీకు ఒక యూనిక్ ఐడీ నెంబరు వస్తుంది. ఈ ఐడీ నెంబరు ద్వారా మీ కంప్లైంట్ స్టేటస్ తెలుసుకోవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయి. మీరు చేసిన ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా మీకు ఫీడ్ బ్యాక్ వస్తుంది.

'సీ విజిల్' యాప్‌ను దుర్వినియోగం చేయకుండా ఎన్నికల సంఘం కొన్ని పరిమితులు కూడా విధించింది. ఈ యాప్ కేవలం ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల భౌగోళిక సరిహద్దుల్లో మాత్రమే పని చేస్తుంది. పౌరులు ఫొటో, వీడియోను క్లిక్ చేసిన తర్వాత యాప్‌లో 'సెండ్' చేసేందుకు ఎక్కువ సమయం ఇవ్వకుండా ఐదు నిమిషాల వ్యవధి మాత్రమే ఉంటుంది. యాప్‌లో ముందుగా రికార్డు చేసిన ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసేందుకు వీలులేదు. అలాగే యాప్‌లో తీసిన ఫొటోలు, వీడియోలను ఫోన్ గ్యాలరీలో సేవ్ చేసుకునేందుకు వీలు కల్పించలేదు. ఒకే వ్యక్తి ఒకే స్థలం నుంచి వెంటవెంటనే ఫిర్యాదు చేయడానికి వీలు లేకుండా ఐదు నిమిషాల వ్యవధి తర్వాతనే అప్‌లోడ్ చేసే అవకాశాన్ని ఇచ్చారు. ఫిర్యాదుల్లో నకిలీవి, ఎన్నికలకు సంబంధం లేనివి ఉంటే తొలగించే అవకాశం జిల్లా కంట్రోల్ రూం అధికారులకు ఉంటుంది. ఈ యాప్ ద్వారా కేవలం కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులు మాత్రమే చేయాలని, ఇతర వ్యక్తిగత ఫిర్యాదులను నమోదు చేస్తే జిల్లా కంట్రోలర్ ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలివేస్తారు. బాధ్యతగల పౌరులు ఈ యాప్‌ను ఉపయోగించుకుంటే ఎన్నికల్లో నాయకుల అక్రమాలకు అడ్డుకట్ట పడ్డట్టే. 24 గంటలపాటు సీ విజిల్ పర్యవేక్షణ కొనసాగుతుంది.

ఎన్నికల ప్రక్రియపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

- ఎన్నికల శిక్షణా తరగతులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి
- పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్




సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్

నవతెలంగాణ- పెద్దపల్లి
జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. పోలింగ్ కేంద్రాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు చేయాల్సిన విధులపై శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, శ్యాం ప్రసాద్‌లాల్‌లతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి, నిబంధనలపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండడం చాలా కీలకం అన్నారు. తద్వారా పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించవచ్చని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన విధులపై ఎన్నికల కమిషన్ అందించే పుస్తకాలను సంపూర్ణంగా చదవాలన్నారు. ముఖ్యమైన సెక్షన్, నిబంధనలు హైలైట్ చేసుకోవాలని, మనం నిబంధనల ప్రకారం ప్రవర్తిస్తే ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో పాటించాల్సిన నిబంధనలు, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ మధ్యలో కనెక్షన్, ఓటింగ్ కంపార్ట్మెంట్ రూపొందించడం, ఓటరు గోప్యంగా తన ఓటు హక్కు వినియోగించేందుకు అవకాశం కల్పించడం వంటి ఏర్పాట్లపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, వారికి ఉన్న హక్కులు, బాధ్యతలను వివరించారు. ఎన్నికల సమయంలో ఎదురైన సమస్యలు, అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అవి పునరావృతం కాకుండా, నివారణకు తీసు కోవాల్సిన జాగ్రత్త చర్యలపై చర్చించారు. అనంతరం అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించుకొని వాటికి అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ.. నిబంధనల మేరకు, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రం పరిధిలో వంద మీటర్ల పరిధిలో రెండు రోజుల వరకు ప్రిసైడింగ్ అధికారికి జ్యుడీషియల్ హక్కులు ఉంటాయని, సజావుగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి మధుమోహన్, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ రోడ్ షో అట్టర్ ఫ్లాప్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



నవతెలంగాణ-జగిత్యాల
జిల్లా కేంద్రంలో రాహుల్‌గాంధీ నిర్వహించిన రోడ్ షో అట్టర్ ఫ్లాప్‌గా నిలిచిందని, జనాలు రారని గ్రహించి ఇరుకైన ప్రాంతంలో ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ విమర్శించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల నుంచి పట్టుమని పది మంది కూడా రాలేదని, జగిత్యాల పట్టణం నుంచి సైతం ప్రజలు హాజరుకాలేదన్నారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి అభాసుపాలయ్యారన్నారు. మార్గమధ్యంలో నూకపల్లి వద్ద నిర్మించిన పేదోడి ఆత్మగౌరవ ప్రతీక అయిన రెండు పడకల గదులను చూడాల్సి ఉంటే బాగుండేదన్నారు. షుగర్ ఫ్యాక్టరీని 2004 నుండి 2014 వరకు అధికారంలో ఉండి ఎందుకు తెరిపించలేదో చెప్తే బాగుండేదని,పసుపు బోర్డుకు సైతం నాడే మద్దతు ధర ఎందుకు ప్రకటించలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు

బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న కోల శ్రీనివాస్

నవతెలంగాణ-రాయికల్
అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామస్థాయిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మండలంలోని ధర్మాజీపేట్, తాట్లవాయి,ఆల్యా నాయక్ తండా, కైరిగూడెం, కట్కాపూర్, దావన్‌పెల్లి , వస్తాపూర్ గ్రామాల్లో బిఆరెస్ పార్టీ మండల అసెంబ్లీ ఎలక్షన్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్ లు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు క్లస్టర్ వైస్ ఇన్‌చార్జిలు, వార్డుమెంబర్లు,గ్రామ పంచాయతీ కో అప్షన్ మెంబర్ లతో కలిసి బూతులు కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వరరావు, పార్టీ మండల ఉపాధ్యక్షులు మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు దొంతి నాగరాజు, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు అనుపురం శ్రీనివాస్ గౌడ్,మండల పార్టీ యూత్ అధ్యక్షుడు పాలకుర్తి వెంకటేష్ గౌడ్,రైతు బంధు కమిటీ జిల్లా మెంబర్ లాల్చవుల రాజన్న, బిఆరెస్ మండల నాయకులు సురేందర్ నాయక్, మారంపెల్లి సాయికుమార్, కొండాల్ రెడ్డి, గ్రామ శాఖ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,యూత్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
7
శనివారం | అక్టోబర్ 21, 2023 | www.navatelangana.com

సెంట్రల్ ట్రైనీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లకు సన్మానం



నవతెలంగాణ – తిమ్మాపూర్

మండలంలోని రేణికుంట గ్రామంలో సెంట్రల్ ట్రైనీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు ఐదు రోజులుగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం, వ్యవసాయం అనుబంధ పథకాలు, రెవెన్యూ, మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ వ్యవస్థ పనితీరు, మహిళా సంఘాల పనితీరు, అంగన్వాడీ కేంద్రాల పనితీరును వంటి విషయాలను తెలుసుకున్నారు. శుక్రవారం పర్యటన ముగియడంతో గ్రామ సర్పంచ్ బోయిని కొమరయ్య ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ఉపసర్పంచ్ కుంభం శ్రీనివాస్ శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి, ఎంపీఓ కిరణ్ కుమార్, గ్రామ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతి పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ – హుజురాబాద్

సబ్బండ వర్గాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి కూడా విజయం సాధించి హ్యాట్రిక్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. హుజురాబాద్‌లో రూ.300కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. హుజురాబాద్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. సమావేశంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సంఘం ఐలయ్య, పిఏసిఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, ఉమామహేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

పండగ ముంగిట ధరల మంట...



- బతుకమ్మ పువ్వుకూ భారీగా పెరిగిన ధరలు
- మాంసం ధరలతో పోటీపడుతున్న కాయగూరలు
- రోజుకింత పెరుగుతున్న పెట్రోడీజిల్‌ధరలు
- వెయ్యి దాటిన వంటగ్యాస్ ధర.. తగ్గింది మాత్రం రూ.వందమాత్రమే!
- మార్కెట్ ధరలతో పండగపూట జనం బెంబేలు..

బతుకమ్మ, దసరా పండగల ముగింట మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి. కేంద్ర ఆధీనంలోని పెట్రోలియం ఉత్పత్తుల ధరలకు అడ్డూఅదుపులేకుండా పోయింది. వంటగ్యాస్, పెట్రోడీజిల్ ధరలు లీటర్‌పై సెంచరీదాటగా.. వంటగ్యాస్‌బండ రూ.వెయ్యి ఏనాడో దాటింది. ఇటీవల ఉపశమనంగా రూ.100 నుంచి రూ.150 తగ్గించినా.. ఆ భారం మోయలేని స్థితిలో సామాన్యులు ఉన్నారు. ఇక 'దసరా అంటేనే.. చుక్క ముక్క' అన్న పేరు ఉండనే ఉంది. అయితే మాంసం ధరలు ఈసారి మరింత పెరిగాయి. వాటితో పోటీగా కాయగూరల రేట్లూ పెరిగాయి. పప్పులు, నూనె, ఇతర వంట సామాగ్రి ధరలు అరకొర ఆదాయం వచ్చే పేద, మధ్యతరగతి వాసులను బెంబేలు చేస్తున్నాయి.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

బతుకమ్మ పువ్వు వేరీ కాస్ట్లీ....

పూల పండుగ అంటే ఊరూ వాడ బతుకమ్మ సందడితో నిండిపోతుంది. ఎంగిలి పూల బతుకమ్మ నుంచి మొదలైన పూల జాతర సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది.అయితే ఆదివారం బతుకమ్మ నిమజ్జనం రోజున పక్కింటి వాళ్లకన్న మన బతుకమ్మే పెద్దగా ఉండాలని ఎన్నో రకాల పూలు తీసుకచ్చి బతుకమ్మ పేరుస్తారు. ఈ నేపథ్యంలో పూల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లలో బంతి పూల ధర కిలో రూ.120 నుంచి రూ.180లకు పెరిగింది. నిన్న మొన్నటి వరకు రూ.10 నుంచి 20 వరకు ఉన్న మూర పూలదండ ధర అమాతం పెరిగి ఏకంగా రూ.30వరకు పలుకుతోంది. రెండు రోజుల క్రితం ఉన్న వరకు చామంతి పూలు కిలో ధర రూ.50 నుంచి రూ.80 ఉండగా, ఇప్పుడు రూ.200 నుంచి రూ.250కి పెరిగింది. గునుగు కట్ట ఒకటి రూ.25 నుంచి రూ.30వరకు గతేడాది అమ్మారు. ఇప్పుడు ఏకంగా రూ.40 నుంచి రూ.50మధ్య అమ్ముతున్నారు. పట్టుకుచ్చు కూడా ఒక్కో కట్ట (దాని సైజునుబట్టి) రూ.50 నుంచి రూ.80 పలుకుతోంది. పిడికెడు తంగేడు పువ్వు కూడా రూ.80వరకు డిమాండ్ చేస్తున్నారు. చిన్న సైజ్‌లో బతుకమ్మ పేర్చాలన్నా.. పూలకే కనీసం రూ.500 వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది.

మాంసం ధరలతో పోటీగా కాయగూరలు...

ప్రస్తుతం మార్కెట్‌లో చికెన్ హోల్‌సేల్ ధర కిలో రూ.220గా ఉండగా.. రిటైల్‌లో ఏకంగా రూ.260 పలుకుతోంది. అదే మాటన్ విషయానికొస్తే రూ.700 నుంచి రూ.900 పలుకుతోంది. నాటుకోడి కిలో ధర రూ.600 పలుకుతుండగా.. బాయిలర్‌కోడి కిలో రూ.180గా ఉంది. మాంసం తినలేని పరిస్థితుల్లో కాయగూరలు కొందామంటే వాటి ధరలు రెండుమూడు రోజులుగా పెరిగాయి. ఏ కాయగూర అయినా కిలో రూ.40 నుంచి ఆపైనే పలుకుతోంది. మొన్నటివరకు టమాట ధరలు బెంబెలెత్తించినా.. ప్రస్తుతం కిలో రూ.30లోపే పలుకుతుండటం సామాన్యులకు ఉపశమనంగా ఉంది.

ఎప్పుడెంత పెరుగుతుందో తెలియని పెట్రోడీజిల్ రేట్లు..

లీటర్ పెట్రోడీజిల్ ధరలు పెట్రోల్ ఎప్పుడో సెంచరీ దాటగా శుక్రవారం కరీంనగర్‌లో లీటర్ డీజిల్ ధర రూ.100.87కు చేరింది. ట్రాన్స్‌పోర్ట్ రంగంపై ఆధారపడి రవాణా అయ్యే అన్ని రకాల వస్తువుల ధరలూ భగ్గుమంటున్నాయి. అన్ని వర్గాల ప్రజల ఆదాయ వ్యయం అస్తవ్యస్తంగా మారింది. ఈఏడాదిలోనే ఏడు సార్లు రూ.303 పెరిగిన వంట గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో రూ.969.50 అయ్యింది. గతంలో రూ.1200 వరకూ పలకగా ఇటీవల కేంద్రం ఉపశమన చర్యగా రూ.100 నుంచి 130వరకు ఆయా కంపెనీల సిలిండర్ల ధరలు తగ్గించింది. మరోవైపు పెట్రో డీజిల్ ధరలు ఏ రోజు ఎంత ఉంటాయో ప్రజలకు అర్థంకాని పరిస్థితి నెలకొంది. జూన్ మొదట్లోనే పెట్రోల్ ధర సెంచరీ దాటగా తాజాగా డీజిల్ ధర సైతం రూ.100.87కు చేరింది. లీటర్ పెట్రోల్ రూ.108.27గా ఉన్నది. పవర్ పెట్రోల్ మరో ఐదారు రూపాయలు అదనంగా పలుకుతున్నది. ధరల పెరుగుదలను గమనిస్తే ఇప్పట్లో అడ్డుకట్ట పడేనా..? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

రవాణారంగంపై తీవ్ర ప్రభావం

అడ్డూ అదుపూ లేని పెట్రోల్, డీజిల్ ధరలు అన్ని రంగాలనూ ప్రభావితం చేస్తున్నాయి. వస్తు రవాణాలో కీలకమైన ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని పెట్రోల్, డీజిల్ ధరలు నిత్యం ప్రభావితం చేస్తుంటాయి. రవాణా రంగంలో కీలకమైన లారీ, ఆటో, టాక్సీ, మినీ లారీ లాంటి వన్నీ సంక్షోభం అంచున కొట్టుమిట్టాడుతున్నాయి. వ్యవసాయరంగంలోనూ పెట్రో ధరల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. యాంత్రీకరణ పెరిగిన నేపథ్యంలో సాగు ఖర్చుల్లో పెట్రో ధరలదే సింహభాగం కావడం గమనార్హం. మొత్తంగా నిత్యావసరాల ధరలు, ఇతర అన్నిరకాల సామగ్రి ధరలు కూడా పెరుగుతున్నాయి. నిత్యావసరాల వస్తువుల ధరల్లో రూ.20 నుంచి రూ.80 వరకు సగటు పెరుగుదల కనిపిస్తున్నది. ధరల మోత దసరా పండుగ సంబురానికి పేదలను దూరం చేస్తుందనడంలో సందేహం లేదు.

పాపం...రాహుల్‌గాంధీ

- బలవంతంగా కరీంనగర్ మీదుగా పర్యటన
- అభ్యర్థి ఎవరో తేల్చకుండా.. ఎవరికి ఓటేయ్యాలో చెప్పలేక..
- నామ్‌కేవాస్తేగా సాగిన కాంగ్రెస్ ప్రచారయాత్ర
- కర్నాటకలోలాగా.. మాయమాటలు చెబితే ఇక్కడి ప్రజలు నమ్మరు
- అక్కడ ఇచ్చిన 5గ్యారంటీల స్కీములు 5నెలల్లోనే తేలిపోయాయ్..
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్


సమావేశంలో మాట్లాడతున్న మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'మాయమాటలు చెప్పి తెలంగాణలో అధికారంలోకి రావాలని కలలుగంటున్న కాంగ్రెస్ వాళ్లను ఇక్కడి ప్రజలెవరూ నమ్మరు. కర్నాటకలో 5గ్యారంటీలు స్కీములు పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చిన 5నెలల్లోనే వాటిని అమలు చేయలేక చేతులెత్తేశారు. వ్యవసాయానికి 7గంటలు కరెంటు ఇస్తామని చెప్పి 2గంటలు కూడా ఇవ్వలేక..మళ్లీ 5గంటలు ఇస్తామని ప్రకటించిన విషయాన్ని ఈ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. నిరంతరం నాణ్యమైన 24గంటల కరెంటు ఇస్తూ ప్రజ సంక్షేమాన్ని' పక్కాగా అమలు చేస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలు అక్కునచేర్చుకున్నారు. కనీసం కరీంనగర్ అభ్యర్థి ఎవరనేది తేల్చకుండా బలవంతంగా కరీంనగర్ మీదుగా వెళ్లిన రాహుల్‌గాంధీ యాత్ర పేలవంగా ఉండటం చూస్తే జాలేస్తుంది.' అనిరాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మంత్రి మీసేవా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరీంనగర్‌లో సాగిన రాహుల్‌గాంధీ పర్యటనపై మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏడాదిలో ఒకే పంట కొంటున్నారని, ఇక్కడ బీఆర్ఎస్ సర్కారు రెండు పంటలనూ కొంటున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. 24గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తూ సాగు, పరిశ్రమలకు ఊతం ఇస్తుంటే కర్నాటకలో అధికారంలకి వచ్చిన ఐదు నెలల్లోనే రోజుకు 2గంటలు కూడా కాంగ్రెస్ ఇవ్వలేకపోతోందన్నారు. ఎన్నికల్లో సాగుకు 7గంటలు కరెంటు దశలవారీగా ఇస్తామని చెప్పి మళ్లీ 5గంటలకు మించి ఇవ్వలేమని ప్రకటించడం చూస్తుంటే తెలంగాణలో అధికారంలోకి వస్తే ఈ రాష్ట్రాన్ని కూడా అంధకారంలోకి తీసుకెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.80వేల కోట్ల వ్యయంతో కట్టిన కాళేశ్వరంప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని చెబుతూ యాత్ర సాగిస్తున్న రాహుల్‌గాంధీ.. తనకు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను పక్కనబెట్టి వాస్తవం తెలుసుకోవాలని హితవుపలికారు. కరీంనగర్‌లో పర్యటించినప్పుడు అయినా అటు కేబుల్‌బ్రిడ్జి, ఇటు ఐలాండ్స్.. కనీసం ఇందిరాచౌక్‌ను చూసుంటే ఇక్కడ అభివృద్ధి కండ్లకు కనిపించేదని అన్నారు. జాతీయ స్థాయి అగ్రనేతగా మొదటి సారి కరీంనగర్‌కు వచ్చినా ఇక్కడ జనం ఆయన కార్నర్‌మీటింగ్‌కు రాకపోవడం చూస్తుంటే జాలేస్తుందని అన్నారు. ఇక్కడ అభ్యర్థి ఎవరనేది ప్రకటించకుండా.. కనీసం ఎవరికి ఓటేయ్యాలో చెప్పకుండా రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. 50ఏండ్ల కాంగ్రెస్ పాలన, ఈ పదేండ్లలో బీఆర్ఎస్ పాలన చూసిన ప్రజలు ఎవరికి ఓటేయ్యాలో విజ్ఞతతో ఆలోచిస్తారని అన్నారు. మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు రావడం ఖాయమని చెప్పారు. సమావేశంలో నగర మేయర్ సునిల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లాహరిశంకర్ సహా పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం దేశాభివృద్ధికి దోహదం

సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బంగారి స్వామి

నవతెలంగాణ – కరీంనగర్

విద్యావంతుల నుంచి సామాన్య పౌరుల వరకు అందరూ శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు తగిన శాస్త్రీయ అవగాహనను కలిగి ఉంటేనే ప్రజారోగ్యం దేశాభివృద్ధికి దోహదపడుతుందని రెనే ఆస్పత్రి అధినేత, ప్రముఖ సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ లయన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి అన్నారు. ప్రపంచ ఆస్టియోపోరెసిస్ లేదా బోలు ఎముకల వ్యాధి దినం సందర్భంగా రెనే ఆస్పత్రి, శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్తంగా 'ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామితో ముఖాముఖి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటిష్ట ఎముకల ఆరోగ్య పరిరక్షణకు కావలసిన విటమిన్–డి పొందడానికి ప్రతి రోజు ఉషోదయాన సూర్య కిరణాలు పడేటట్లు ఎండలో అరగంట పాటు నడవడం, సూర్య నమస్కారాలు, యోగాసనాలు చేయడం మన జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. దీనికి తోడుగా 50 ఏండ్లు దాటిన వయోజనులు ఎముకల వ్యాధుల పట్ల తగు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. పురుషుల కన్న మహిళలకు ఎముకల ఆరోగ్య సమస్యలు అధికంగా నమోదు అవుతున్నాయని తెలిపారు. ఆస్టియోపోరెసిస్ వ్యాధి పలు కారణాలతో వస్తుందని సవివరంగా వివరించారు. వయోవృద్ధులు తడిగా ఉన్న నేలపై నడవడంతో జారి పడడంతో వెన్నెముక, తొంటి, చేతి మడిమల వద్ద ఫ్రాక్చర్లు జరుగుతాయని హెచ్చరించారు. సరైన పోషకాహారంతో పాటు పొగాకు, మద్యం లాంటి దురలవాట్లకు దూరంగా ఉన్నపుడే ఎముకల పటిష్టత, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తాయని తెలిపారు. రెనే ఆస్పత్రి డైటీషియన్ స్ఫూర్తి పౌష్టికాహారం గురించి వివరించారు. సమావేశంలో పలువురు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ బంగారి స్వామి సరళ భాషలో సమాధానాలు ఇచ్చారు. శాతవాహన లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామిని సన్మానించారు. ఈ సమావేశంలో రెండో ఉప గవర్నర్ లయన్ సింహరాజు కోదండరామ్, పీఆర్సీలు లయన్ నర్సింగ రావు, లయన్ ఇనుగుర్తి రమేష్, పీజెడీసీలు, జెడీసీలు లయన్ పి.శ్రీహరి రెడ్డి, లయన్ సీతారాం రెడ్డి, లయన్ జగదీశ్వరాచారి, లయన్ మేచినేని సత్యనారాయణ రావు, కార్యదర్శి లయన్ మహేందర్, సంయుక్త కార్యదర్శి లయన్ డాక్టర్ ఎల్లాలా లక్ష్మారెడ్డి, జిల్లా మెంటర్ లయన్ సింగమ రాజు, ప్రిన్సిపల్ లయన్ డాక్టర్ వి.శ్రీనివాస్, లయన్ కోటేశ్వర్, లయన్ రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బంగారి స్వామి

రాహుల్‌గాంధీ యాత్రకు విశేష స్పందన

- కాంగ్రెస్ ఆదరణ చూసి బీఆర్ఎస్ నాయకుల్లో గుబులు..
- నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ – భగత్‌నగర్

కరీంనగర్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ యాత్ర, కార్నర్ మీటింగ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. దారిపొడుగునా పజలు స్వాగతం పలకడమే కాకుండా బిల్డింగ్స్ పైనుంచి పూలు చల్లారని, ప్రజలు స్వచ్ఛందంగా యాత్రలో పాల్గొన్నారని అన్నారు. శుక్రవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రాజీవ్ చౌక్ కార్నర్ మీటింగ్‌లో రాహుల్‌గాంధీ ప్రసంగానికి కార్యకర్తలు, ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలంగా నినాదాలు చేశారని తెలిపారు. కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకుల్లో గుబులు మొదలైందన్నారు. మంత్రి గంగుల కమలాకర్ కర్నాటక రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరుపై అన్ని అబద్ధాలు మాట్లాడారని అన్నారు. తెలంగాణలో పదేండ్లు అధికారంలో ఉండి ఇచ్చిన ఏ హామీ నెరవేర్చకుండా మోసం చేసి దయ్యాలు వేదాలు వల్లించినట్టు.. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతున్న కర్నాటక ప్రభుత్వ పని తీరుపై అబద్ధాలు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే కర్నాటక వెళ్లి చూసొద్దాం వస్తారా అని చాలెంజ్ విసిరారు. కాంగ్రెస్ వల్ల లాభపడి అధికారం కోల్పోయిన ఇరవై నాలుగు గంటలు గడవక ముందే పార్టీ మారిన సునీల్‌రావు కాంగ్రెస్‌ని విమర్శించడమేంటని అన్నారు. ఎవరెన్ని మాట్లాడినా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, ఆ సంకేతాలు కనిపించడంతో బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక పోతున్నారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్‌నాయక్, దన్నసింగ్, షబానా మహమ్మద్, ఊరడి లత, జీడి రమేష్, ఎండీ చాంద్, మెతుకు కాంతయ్య, మ్యాకల నర్సయ్య, షేక్ శేహెన్షా దామోదర్, తిరుపతి, అష్రాఫ్, సోహేల్, యోన, బషీర్, అంజనేయులు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎం మొదటి స్థాయి ర్యాండమైజేషన్ ప్రారంభం

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి

నవతెలంగాణ – కరీంనగర్

జిల్లాలో 1338 పోలింగ్ కేంద్రాల కోసం మొదటి దశ ర్యాండమైజేషన్‌ను చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 1338 పోలింగ్ కేంద్రాలలో జరగనున్న ఎన్నికలకు 2674 బ్యాలెట్ యూనిట్లు, 2089 కంట్రోల్ యూనిట్లు, 2054 వీవీ పాట్‌లను సిద్ధం చేసినట్టు తెలిపారు. నియోజకవర్గాల వారీగా కరీంనగర్ 390, చొప్పదండి 327, మానకొండూర్ 316, హుజురాబాద్ 305 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, సీయూ, వీవీపాట్‌లను అందించడానికి జిల్లా ఎన్నికల అధికారి ద్వారా వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్‌ను నిర్వహించామని, దీని ఆధారంగా శనివారం ఉదయం అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ తెరిచి అక్కడి నుంచి ఈవీఎం, సీయూ, వీవీ పాట్‌లను హుజురాబాద్ నియోజక వర్గంలోని జూనియర్ కళాశాల, చొప్పదండి, కరీంనగర్‌లకు చెందినవి ఎస్సారార్ కళాశాల, మానకొండూర్ నియోజకవర్గానికి చెందినవి ఉజ్వల పార్క్ వద్ద గల పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేసుకున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలించి భద్రపరుస్తామని చెప్పారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పటిష్టమైన భద్రతను, సీసీ టీవీ కెమెరాలు తదితర ఏర్పాట్లు చేస్తామని, రెండవ ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని అబ్జర్వర్ల సమక్షంలో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం రాజకీయ పార్టీల ఎన్నికల ఖర్చు, రిజిష్టర్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూసుకోవాలని ఎన్నికల అధికారి తెలిపారు. కార్యక్రమంలో సీపీ సుబ్బారాయుడు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీకిరణ్, ఇన్‌చార్జి డీఆర్ఓ పవన్ కుమార్, బీఎస్పీ ప్రతినిధి గాలి అనిల్ కుమార్, బీజేపీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, సీపీఐ(ఎం) వాసుదేవరెడ్డి, కాంగ్రెస్ ప్రతినిధి మోహన్, ఎంఐఎం బర్కత్ అలీ, బీఆర్ఎస్ ప్రతినిధి శ్రీనివాస్, టీడీపీ ప్రతినిధి అగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి


కేక్‌కట్ చేస్తున్న అధ్యాపక బృందం

కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు 'ఏ గ్రేడ్'

నవతెలంగాణ – కరీంనగర్ రూరల్

కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల న్యాక్ 'ఏ గ్రేడ్' హోదా సాధించింది. ఈ మేరకు బెంగళూరులోని న్యాక్ కార్యాలయం ఈ నెల 19న రాత్రి కళాశాలకు మెయిల్ ద్వారా తెలియజేసింది. ఈ నెల 9, 10 తేదీలలో 'న్యాక్ పీర్ టీమ్' స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించింది. ఈ గ్రేడింగ్ ఈ నెల 18నుంచి ఐదు సంవత్సరాలు కొనసాగుతుంది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది బాణాసంచా పేల్చి సంబురాలు చేసుకొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి కేక్ కట్‌చేసి సిబ్బంది అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాలకు "ఏ" గ్రేడ్ రావడంలో సహకరించిన కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలియజేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, సీసీఈ కమిషనర్, జేడీ, ఆర్‌జేడీ, ఏజీవోకు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ వచ్చినందుకు నగర మేయర్ వై.సునీల్‌రావు ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించారు. సిసిఈ మాజీ కమిషనర్ నవీన్ మిట్టల్, ప్రస్తుత కమిషనర్ వాకాటి కరుణ, జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ యాదగిరి, డిటి చారి, బాల భాస్కర్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మిని, కళాశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల పరిసరాలు శుభ్రపరచడంలో సహాయం చేసిన మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డిఎస్.చక్రవర్తి, ఫిజికల్ డైరెక్టర్ గంద్ర శ్రీధర్‌రావు, సూపరింటెండెంట్ జి.శ్రీరామ్‌రెడ్డి, బోధన సిబ్బంది జి.శ్రీనివాస్, ఎం.సత్యనారాయణరెడ్డి, ఎ.చంద్రశేఖర్, డాక్టర్ ఎంవి.లక్ష్మణరావు, కె.సతీష్ కుమార్, డాక్టర్ డి. శ్రీనివాస్, వి.రాధాకిషన్, డాక్టర్ బి.రజనీదేవి, డి.సుజాత, ఆర్.జ్యోతిర్మయి, ఎ.శాలిని, కే.సునీత, ఎం.సంగీత రాణి, డాక్టర్ ఎం. కల్పన, జె.స్వప్న, నాజియా రెహమాన్, జబీన్ సుల్తానా, అర్షియా సుల్తానా, అత్యా సుల్తానా, పి.శ్రీనివాస్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

శ్రీ చైతన్య కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

నవతెలంగాణ – తిమ్మాపూర్

మండలంలోని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ కళాశాలలో ఎంబీఏ విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.ఉదయ్ కుమార్‌కు గైడ్ డాక్టర్ ఎల్. శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసిందని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'హ్యూమన్ రిసోర్స్ యాక్షన్ ఏరియాస్ ఇన్ పవర్ సెక్టార్ ఆర్గనైజేషన్ – ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ యూనిట్స్' అనే అంశంపై ఉదయ్ కుమార్ పరిశోధనలు చేసినట్లు చెప్పారు. అనంతరం కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రసాద్‌రాజుతో కలిసి చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విభాగాధిపతులు, పాలనాధికారి పాల్గొన్నారు.



ప్రలోభ రహిత ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలు

రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరీ



నవతెలంగాణ-గోదావరిఖని:
స్వేచ్ఛా, శాంతియుత, ప్రశాంతమైన వాతావరణంలో ప్రలోభ రహిత ఎన్నికల నిర్వహణకు రామగుండం కమీషనరేట్ పరిధిలో ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరీ తెలిపారు. భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని పోలీసు అధికారులందరూ రెవెన్యూ, ఎక్సైజ్, అటవీ, వాణిజ్య పన్నులు, రవాణా శాఖలతో కలిసి 'ఉమ్మడి కార్యాచరణ' ద్వారా కమిషనరేట్ పరిధిలోకి ఓటర్లకు ప్రలోభాలకు గురిచేసే ఎలాంటి వస్తువులను సరఫరా చేయకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల దష్ట్యా ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ గురించి రెమా రాజేశ్వరి మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 9వ తేది నుంచి ఇప్పటివరకు రూ.3,17,23,770.75 కోట్ల విలువైన బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మోడల్ ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో సామాన్య ప్రజలు నగదు, బంగారం, వెండి, విలువైన వస్తువులను తీసుకువెళ్తుంటే సరైన ఆధారాలు తీసుకెళ్లాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో వస్తువులను ఉచితంగా పంపిణీ చేయకుండా గట్టి నిఘా ఉంచామని సీపీ తెలిపారు.

పాల రామారావుకు సన్మానం

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
రైతు బంధు సమితి పెద్దపల్లి జిల్లా అధ్యక్షునిగా నూతనంగా నియామకం అయిన మాజీ ఎంపీపీ పాల రామా రావును గొల్లపల్లి సర్పంచ్ బండారి రమేష్ ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండారి రమేష్ మాట్లాడుతూ పాల రామారావు రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. రామారావు పదవి కాలంలో మండలంలోని రైతు సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొంకూరి సంపత్, బండారి రాజు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.


పాల రామారావును సన్మానిస్తున్న సర్పంచ్

కేసీఆర్ అంటేనే నమ్మకం...కొండంత ధైర్యం

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్


మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని
తొమ్మిదేండ్ల పాటు రాష్ట్రంలో సుపరిపాలన అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌అంటే ప్రజలకు ఒక నమ్మకం, కొండంత ధైర్యమని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. మంథని మండలం కన్నాల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికి బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నాల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలోపూజలు చేయడం,ఎన్నికల ప్రచారాన్ని స్వామివారిని దర్శించుకునే ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందని,స్వామివారి కృపతో మంచి జరుగుతుందనే నమ్మకం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. ఎన్నికలు వస్తున్నాయంటేనే ఇతరపార్టీలు ఒక ఆటలాగా భావిస్తాయని, కానీ కేసీఆర్ మాత్రం ఎన్నికలు ప్రజల ఆకలి తీర్చేవని భావిస్తారని అన్నారు. గతంలో తనకుఎమ్మెల్యేగా అవకాశం కల్పించి ఆశీర్వదిస్తూ నాలుగేండ్లు తన తల్లి పేరు ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా అనేక సేవలు చేశామన్నారు. రాబోయే రోజుల్లో ఉన్నత చదువులు చదువునే పేదబిడ్డలకు హైదరాబాద్‌లో ఉచితంగా వసతి కల్పించి రూపాయి ఖర్చు లేకుండా చదివించే బాధ్యత తీసుకుంటానని, అదే విధంగా ప్రతి ఏటా పేదింటి ఆడబిడ్డల పెండ్లికి పుస్తె మట్టెలు అందించి పుట్టింటి వారిలా అంగరంగవైభవంగా వివాహం జరిపిస్తానని అన్నారు. ఈ ప్రాంత ప్రజలను మోసం చేయాలనే ఆలోచనతో మంథనికి రాహుల్‌గాంధీని తీసుకువచ్చారని ఎద్దేవాచేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆశీర్వదించి ఆదరించా లని ఆయన కోరారు.

బీఎస్పీ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ సుల్తానాబాద్ రూరల్
మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు బీఎస్పీ పార్టీలో చేరారు. వీరికి పెద్దపల్లి బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేష్, మండల ఉపాధ్యక్షుడు కొల్లూరి నర్సయ్య మండల కోశాధికారి అల్లపు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు తోట మధు, సింగసాని అనిల్ తదితరులతోపాటు మహిళలు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న దాసరి ఉష

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు గౌడ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ ఎల్లస్వామి గౌడ్ శుక్రవారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా దాసరి మనోహర్ రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్ రావు,మండల బీసీ సెల్ కన్వీనర్ గరిగంటి కుమార్ బాబు, తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే

విజ్జన్న గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
సుల్తానాబాద్ మండలం లోని గొల్లపల్లి మాజీ సర్పంచ్ నామిని రాజిరెడ్డి, తొగర్రాయి మాజీ సర్పంచ్ గుండా మురళి, గర్రె పల్లి మాజీ సర్పంచ్ బొల్లం లక్ష్మణ్, రేగడిమద్దికుంట గ్రామ సర్పంచ్ రవీందర్ రెడ్డిలు మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పెద్దపల్లిలో విజయ రమణారావు గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పార్టీలో చేరిన సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు తెలిపారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-మంథని
మంథని మండలం సూర య్యపల్లి గ్రామంలో ఇంటిం టికి బీఆర్ఎస్ మ్యానిఫెస్టో చూపించి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి పుట్ట మధూ కర్‌ను అధిక మెజార్టీతో గెలి పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షు డు వేగొలపు శంకర్,రైతు బంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, గ్రామ సర్పంచ్ భీముని పుష్ప వెంకటస్వామి, ఎంపీటీసీ చెరుకుతోట ఓదెలు,ఉప సర్పంచ్ మాధడి రాజి రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాబు,మాచిడిరాజు,జంజర్ల లింగయ్య,వంశీలు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

నృత్య ఖని ఆధ్వర్యంలో ఘనంగా గజ్జె పూజ

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
గోదావరిఖని స్థానిక రాంమందిర్ ఏరి యాలోని కోదండ రామాలయం ఆవరణలో శుక్రవారం నృత్యఖని డ్యాన్స్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో గజ్జె పూజ కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్యఖని డాన్స్ ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపకురాలు, అంతర్జాతీయ కూచిపూడి నృత్యకారిణి గుమ్మడి ఉజ్వల మాట్లాడుతూ సమాజంలో ప్రస్తుతం అంతరించిపోతున్న శాస్త్రీయ నృత్యాలను మళ్లీ యువతకు అందించాలని ఉద్దేశ్యంతో నృత్యఖని డాన్స్ ఇన్స్టిట్యూట్‌ను పది సంవత్సరాల క్రితమే నెలకొల్పినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ ఇంజపురి పులేందర్, నాట్య గురువు మేదరి నర్సయ్య, గుమ్మడి నిర్మల పెద్దులు, గుమ్మడి సంతోష్ సౌమ్యలతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రజలను ఇబ్బందిపెడితే సహించేది లేదు

ఆర్టీసీ అధికారుల తీరుపై జడ్పీ చైర్మన్ అసహనం

నవతెలంగాణ-మంథని
ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా పరిషత్‌చైర్మన్ పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. మంథని ఆర్టీసీ డిపో పరిధిలోని భూములకు ఆ సంస్థ అధికారులు హద్దులు పెడుతున్న క్రమం లో సమీప ఇంటి నిర్మాణాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అనేక ఏండ్ల క్రితమే గ్రామపంచా యతీ నుంచి స్థానికులకు హద్దులు కేటాయించారని,ఆనాడు ఇంటినిర్మాణాలు జరుగుతున్న క్రమంలో ఆర్టీసీ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఒక పేదవాడు ఇళ్లు నిర్మించుకుంటే సహకారం అందించాల్సింది పోయి ఈనాడు హద్దుల పేరుతో ఇబ్బందులు పెడుతారా అంటూ ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్

దళితుల పట్ల ఆర్టీసీ అధికారుల దౌర్జన్యం సరికాదు

సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్

నవతెలంగాణ-మంథని
మంథని మున్సిపల్ పరిధిలోని ఆర్టీసీ డిపో వద్ద దళితులు చేస్తున్న శాంతియుత న్యాయ పోరాటానికి సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా దళితులు భూములను కొనుక్కొని ఇండ్లు నిర్మించుకొని నివసిస్తున్నారని ఈ మధ్యకాలంలో ఆర్టీసీ అధికారులు ఈ స్థలం ఆర్టీసీదని దళితులను బెదిరిస్తూ దళితుల ఇండ్ల ముందు ప్రహరీ గోడ కట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని దళితుల పట్ల ఆర్టీసీ అధికారుల తీరు సరికాదు అని అన్నారు.


మాట్లాడుతున్న బూడిద గణేష్

దుర్గామాత ఆలయంలో జడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మంథని
మంథని పట్టణంలోని పోచమ్మ వాడలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ ప్రత్యేక పూజలు చేశారు. దేవీ భాగంగా మంథని పట్టణంలోని పోచమ్మ వాడలో ప్రతిష్టించిన దుర్గామాతను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఆలయంలో పూజలు చేస్తున్న జడ్పీ చైర్మన్

గాజాపై ఇజ్రాయిల్ సైనిక దాడులు నిలిపివేయాలి

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నరేష్

నవతెలంగాణ-గోదావరిఖని:
గాజాపై ఇజ్రాయిల్ సైనిక దాడులు తక్షణమే నిలిపివేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నరేష్ డిమాండ్ చేశారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా, గాజాపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న సైనిక దాడులను నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారంగోదావరిఖనిలోని ఫైలాన్ చౌరస్తా వద్ద నల్ల జెండాలు, ప్లేకార్డ్స్‌తో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్‌పై హమాస్ దాడిని అడ్డు పెట్టుకొని గాజా, పాలస్తీనా ప్రజలపైనా ఇజ్రాయిల్ సైనిక దాడులు చేయడం గర్హనీయమన్నారు. స్వతంత్ర దేశం కోసం పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు ప్రపంచ ప్రజలు అండదండలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ఎం.దుర్గయ్య, ఎంసీ.బాబు, టి.రాంకీ, కె.మల్లేశం, మర్రి శ్రావణ్, శ్రీకాంత్, వెంకటేష్, శ్రీనివాస్, లింగయ్య, తిరుపతి, అఫ్జల్, ఆర్ సురేష్ తదితరులున్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న జడ్పీ చైర్మన్

దుర్గామాతా ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి

- కాంగ్రెస్ రామగుండం అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:
దుర్గ మాతా ఆశీర్వదంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కాంగ్రెస్ రామగుండం అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. గోదావరిఖని స్వతంత్ర చౌక్‌లో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామా తను, అమ్మదళం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను శుక్రవారం ఆయన దర్శించుకున్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న మక్కాన్‌సింగ్

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాలెం మధు

నవతెలంగాణ-గోదావరిఖని:
మాజీ ఎమ్మెల్యే మాలెం మల్లేష్ కుమారుడు, ఆమ్ ఆద్మీ పార్టీ పెద్దపల్లి పార్లమెంటరీ కన్వీనర్ మాలెం మధు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా ఇస్సంపేట గ్రామానికి చెందిన పలువురు మక్కాన్‌సింగ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మక్కాన్‌సింగ్

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం చేయండి

కర్ణాటక ఎమ్మెల్సీ కేశవ్ ప్రసాద్

నవతెలంగాణ-మంథని
మంథనిలో బీజేపీ పార్టీ గెలుపును ఎవరు ఆపలేరని రాబోయే ఎన్నికల ప్రచారంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు మరింతగా ప్రచారం చేయాలని కర్ణాటక ఎమ్మెల్సీ కేశవ్ ప్రసాద్ అన్నారు. మంథని పట్టణంలోని బీజేపీ పార్టీ ఆఫీస్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా కర్ణాటక ఎమ్మెల్సీ కేశవ్ ప్రసాద్ పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సునీల్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బీజేపీ పార్టీకి కార్యకర్తలే వెన్నుముకని,గతంలో కంటే మంథని ప్రాంతంలో బీజేపీ మరింత బలపడు తుందని, ప్రజలు అవినీతి బీఆర్ఎస్ అసమర్థ కాంగ్రెస్ పార్టీలను వ్యతిరేకిస్తున్నార న్నారు. ప్రతి ఒక్క కార్యకర్త కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సామాన్య ప్రజలకు క్షుప్తంగా వివరించి బీజేపీ పార్టీని గెలిపిం చేలా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండాపాక సత్యప్రకాష్,జిల్లాఅధికార ప్రతినిధి పోతారవేణి క్రాంతికుమార్, చింతకాని ఎంపీటీసీ ఉడుముల విజయారెడ్డి,మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్‌లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బీఆర్ఎస్‌లోకి ఆడేపు శంకర్

నవతెలంగాణ-గోదావరిఖని:
ఎల్కలపల్లి గేట్‌కు చెందిన ఆడేపు శంకర్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు శుక్రవారం రామగుడం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమని తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

దేవీ నవరాత్రోత్సవాల్లో పాల్గొన్న డైరెక్టర్

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే ఓసీపీ 5, జీడీకే 11వ ఇంక్లైన్ ఏరియా ఆసుపత్రిలో శ్రీ దుర్గాదేవి అమ్మవారి నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారికి చండీ హెూమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ ఇఅండ్ఎం డి.సత్య నారాయణ రావు, ఆర్జీ -1 జీఎం చింతల శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. అమ్మ వారి దయ వల్ల కంపెనీ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని, ఉద్యోగులందరిని చల్లని చూపులతో కరుణించాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రాంమూర్తి, ఏరియా వర్క్ షాప్ డీజీఎం మదన్ మోహన్,ఉద్యోగులు పాల్గొన్నారు.


డైరెక్టర్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ

నవతెలంగాణ-గోదావరిఖని:
ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణ శ్రీ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి గోదావరి ఖని చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అరుణ శ్రీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని అన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ఖచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు.


ర్యాలీలో పాల్గొన్న అరుణశ్రీ

ప్రజా సేవ కోసమే నా జీవితం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:
కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిని పేరుపేరునా వారిని అక్కున చేర్చుకొని, నా కంఠంలో ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సేవ కోసమే నా జీవితం అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, రామగుండం అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బీఆర్ఎస్ సమన్వయ కమిటీ మెంబర్ బుగ్గ రాములు, బీఆర్ఎస్ స్టేట్ మైనార్టీ సెల్ సెక్రటరీ కమ్మర్ వక్త్‌తోపాటు సుమారుగా 200 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంచెస్టర్ ఆఫ్ సిటీగా పేరుగాంచిన రామగుండం గత పాలకుల ఆధ్వర్యంలో నేడు బొందల గడ్డగా మారిపోయిందని, మీ కుటుంబ సభ్యుడుగా, మీలో ఒక్కడిగా నాకు అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు.


కండువా కప్పి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

అకాడ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
గోదావరిఖని హనుమాన్ నగర్‌లో సుమారు 40 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం దసరా ముందుగా జై భారత్ హనుమాన్ అకాడ ఉచిత శిక్షణా శిబిరాన్ని వస్తాద్ మచ్చ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుంచి విద్యార్థిని, విద్యార్థులకు, యువకులకు, పారిశ్రామిక ప్రాంతంలో మచ్చ శంకర్ ఎంతోమందికి అకాడ ఉచిత శిక్షణా అందించారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, 28 వ డివిజన్ కార్పొరేటర్ పులెందర్, మారుతి సమ్మయ్య, సమ్మయ్య, శ్రీనివాస్, విశ్వాస్, నవీన్,విద్యార్థులు పాల్గొన్నారు.


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రామగుండం నియోజక వర్గ ఇన్‌చార్జీ మంద రవి కుమార్ డిమాండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్ 38వ డివిజన్ ఇంద్రనగర్‌లో గాడి మస్తాన్ మాదిగ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మార్కండేయ కాలనీలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్లో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ముఖ్యులు అందరూ సకాలంలో హాజరై సదస్సును విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంఎస్పీ అధికార ప్రతినిధి కాస్పేట రాజయ్య మాదిగ, జలంపల్లి శ్రీనివాస్, కల్వల శేఖర్, నవీన్, శ్యామ్, అజయ్, కళ్యాణ్, సృజన, వివేక్, సాయి తదితరులున్నారు.


పోస్టర్ అవిష్కరిస్తున్న నాయకులు

అకారణంగా తొలగించారు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న తనను అకారణంగా తొలగించారని ముత్తారం పంచాయతీలో పనిచేస్తున్న సఫాయి హనుమయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పంచాయతీలో సఫాయిగా పనిచేస్తున్న తనను ఒక్క దళితుడని ప్రక్కన పెట్టడంతో పాటు సర్పంచ్‌కి సంబంధించిన వ్యక్తిని పనిలో పెట్టు కోవడం జరిగిందన్నారు. తనను ఎందుకు ప్రక్కన పెట్టారని సర్పంచ్‌ను అడిగితే వయస్సు ఎక్కువగా ఉండడంతో ప్రక్కన పెట్టామని చెబుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబంలో ఎవరికైనా పనిని ఇవ్వాలని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని అన్నారు.


సఫాయి కార్మికుడు హనుమయ్య

పుట్ట మధూకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి

నవతెలంగాణ-ముత్తారం:
మంథనిలో బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ముత్తారం వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్ రావు ప్రజలను కోరారు. జడ్పీ చైర్మన్‌గా పుట్ట మధూకర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల కాలంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని, అన్ని సబ్బండ వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని అన్నారు. అదేవిధంగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు అలువోజు రవీందర్, నాయకులు చల్ల సమ్మయ్య తదితరులున్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మవద్దు

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



నవతెలంగాణ-గోదావరిఖని:
ఈ ప్రాంతానికి ఏమీ చేయనోల్లు...ఎన్నికలు వచ్చినప్పుడు వచ్చేటోల్లు దొంగ మాటాలు మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మవద్దని, ఎన్నికలచ్చినప్పుడు వచ్చే నాయకున్ని కాదు.. మీ సేవకున్నని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం రామగుండం కార్పొరేషన్ పరిధి 13,33వ డివిజన్‌లో ప్రజా అంకిత యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోఉందని, సీఎం కేసీఆర్ అంటేనే నమ్మకానికి మారుపేరన్నారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, తదితరులున్నారు.

2ఎ గనిలో ప్రజా అంకిత యాత్ర

సింగరేణి ఆర్జీ -1 పరిధిలోని జీడీకే 2ఎ గనిలో ఎమ్మెల్యే శుక్రవారం ప్రజా అంకితయాత్ర చేపట్టారు. రానున్న ఎన్నికల్లో కార్మికులు బీఆర్ఎస్ అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, కనకం శ్యాంసన్, శంకర్, పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో బొమ్మల కొలువు



నవతెలంగాణ-గోదావరిఖని:
ఎన్టీపీసీ రామగుండం దీప్తి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో బొమ్మల కొలువును శుక్రవారం నిర్వహించారు. దసరా పండుగ వేడుకల్లో భాగంగా ప్రతీ సంవత్సరం ఈ బొమ్మల కొలువును నిర్వహిస్తారు. ఈ బొమ్మల కొలువు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దీప్తి మహిళా సేవా సమితి అధ్యక్షురాలు డాక్టర్ చిన్మయి దాస్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్ భవన్ విద్యార్థులచే డ్యాన్స్‌లు, మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు.

9
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
శనివారం | అక్టోబర్ 21, 2023 | www.navatelangana.com

ఆకట్టుకున్న స్టార్ మహిళా ప్యారిస్ లేన్ -2023



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్‌లోని విద్యానగర్ ప్యారిస్ లేన్ లో శుక్రవారం బతుకమ్మ,దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్టార్ మహిళ -2023 ఫ్యాషన్ షో నిర్వహించారు. ప్యారిస్ లేన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు కోట సతీష్ కుమార్ అసోసియేషన్ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోట సతీష్ కుమార్ మాట్లాడుతూ మన తెలుగు సాంప్రదాయ పద్ధతిలో జరిగే బతుకమ్మ, దసరా నవరాత్రి ఉత్సవ వేడుకలలో భాగంగా సాంప్రదాయ స్టార్ మహిళ ఫ్యాషన్ షో కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. 13 సంవత్సరాలు నుండి 19 సంవత్సరాల ప్రిన్సెస్‌కు, 20సంవత్సరాల పైబడిన తెలుగింటి అతివలు, ఆడపడుచులు స్టార్ మహిళ ఫ్యాషన్ షో -2023 ప్రోగ్రాంలో పాల్గొన్నారని తెలిపారు. జడ్జిలుగా డాక్టర్ ఆకుల శైలజ పటేల్, డాక్టర్ ఝాన్సీ, అడ్వకేట్ హేమలత పటేల్ వ్యవహరించారు. విన్నర్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమ నిర్వహణకు సౌత్ ఇండియా షాపింగ్ మాల్, హరిహర జ్యువెలర్స్ స్పాన్సర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్యారిస్ లైన్ ప్రజలు పాల్గొన్నారు.

పీవీ జిల్లా ఏర్పాటు చేయాలి

జిల్లా సాధన సమితి నాయకులు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

నవతెలంగాణ - వీణవంక

హుజురాబాద్ తాలుకా ప్రాంతాన్ని పీవీ జిల్లాగా ఏర్పాటు చేయాలని పీవీ జిల్లా సాధన సమితి (జేఏసీ) కన్వీనర్ బీమోజు సదానందం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పీవీ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హుజురాబాద్ ప్రాంతంలో అన్ని రకాలుగా అభివృద్ధి జరిగిందని, ఈ ప్రాంతంలో విద్యా, వైద్యం, రవాణాకు అవకాశం ఉందని చెప్పారు. కావున ఈ ప్రాంతంలో మరిన్ని మండలాలను ఏర్పాటు చేసి 13 మండలాలతో కూడిన పీవీ జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో జిల్లా కోసం ఈ ప్రాంతం అంతా తిరిగి జిల్లా ఆవశ్యకతను ప్రజలకు వివరించి వారిని చైతన్యపరుస్తామని, అలాగే ఉద్యమ కార్యచరణ ప్రకటించి ఉద్యమిస్తామని చెప్పారు. సమావేశంలో పీవీ జిల్లా సాధన సమితి స్టీరింగ్ కమిటీ మెంబర్లు, జేఏసీ నాయకులు పలకల ఈశ్వర్‌రెడ్డి, పొడిసెట్టి వెంకట్రాజం, మోరె సతీష్, రుద్రారపు రవితేజ, మహ్మద్ రఫీ, పరకాల రమేష్, ఈదులకంటి రవీందర్ రెడ్డి, గెల్లు మల్లయ్య యాదవ్, మర్రి స్వామి యాదవ్, పులి ప్రకాష్, దాసారపు శ్యామ్, గాజుల సమ్మయ్య, ఒడ్డెపల్లి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండల అడహక్ కమిటీ ఎన్నిక

హుజురాబాద్ పీవీ జిల్లా సాధన సమితి (జేఏసీ) మండల అడహక్ కమిటీని ప్రకటించారు. మండల కన్వీనర్‌గా మర్రి స్వామి యాదవ్, కో కన్వీనర్లుగా పులి ప్రకాష్, అంబాల మధునయ్య, దాసారపు లక్ష్మయ్య, చిన్నవేణి కుమార్ యాదవ్, చదువు మహేందర్‌రెడ్డి తదితరులను నియమించారు.

రోడ్డు వేయనిదే బీఆర్ఎస్ నాయకులు ఓట్లకు రావద్దు

కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్



మాట్లాడుతున్న బొడ్డు సునీల్

నవతెలంగాణ - గన్నేరువరం

డబుల్ రోడ్డు వేయనిదే ఓట్లు అడగం అని చెప్పిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు మళ్లీ ఎందుకు ఓట్లకు వస్తున్నారనీ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గుండ్లపల్లి నుండి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు వేస్తానని మాట ఇచ్చి జీవో వచ్చిందని 71కోట్లు మంజూరు చేశామని శిలాఫలకాలు వేయించుకొని పెద్ద క్రేన్‌లతో గజమాల, దండలు వేయించుకొని, బైక్ ర్యాలీలు చేసి ఎన్నో అబద్ధపు మాటలు చెప్పిన బీఆర్ఎస్ నాయకులు మళ్లీ ఎందుకు ఓట్లకు వస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. డబుల్ రోడ్డు వేయిస్తానని మోసం చేసిన బీఆర్ఎస్‌కు ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి కూన కొమురయ్య, యువజన సంఘం మండల అధ్యక్షుడు ముడికే అజయ్, బుర్ర శ్రీకాంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల ఏరియస్ ఇవ్వాలి

నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ మున్సిపల్ శానిటేషన్ కాంట్రాక్ట్ కార్మికుల నాలుగు నెలల పెండింగ్ వేతనాల ఏరియాస్ వెంటనే ఇవ్వాలని శుక్రవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బీఆర్టీయూ ఆధ్వర్యంలోని మున్సిపల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు రావలసిన నాలుగు నెలల ఏరియాస్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే జోక్యం చేసుకోవాలని నినాదాలు చేశారు. దీనికి స్పందించిన కమిషనర్ కార్మికుల వద్దకు వచ్చి రెండు మూడు రోజుల్లో ఏరియర్స్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమిషనర్ హామీ మేరకు ధర్నాను కార్మికులు విరమించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.రూప్‌సింగ్, బీఆర్టీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దావు రాజమల్లయ్య, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు గడ్డం సంపత్, మైస తిరుపతి, పొన్నం లింగయ్య, సుంకరి లక్ష్మణ్, పార్నంది ఎల్లయ్య, 200 మంది మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



నవతెలంగాణ - తిమ్మాపూర్

గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామంలోని బీజేపీ కార్యకర్తలు, యువకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గన్నేరువరం జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్గాదేవి నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అధికారులతో సమీక్షలో కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

నవతెలంగాణ - కరీంనగర్

దేవి నవరాత్రుల అనంతరం దుర్గాదేవి అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. అమ్మవారి విగ్రహాల నిమజ్జనం, బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశనం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం కోసం మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట, రేకుర్తి, ఇతర ప్రాంతాలలో ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. చెరువులలో నిమజ్జనం కోసం అవసరమయ్యే నీటిని నింపాలని, చెరువుల వద్ద క్రెయిన్స్, లైటింగ్, సానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా జిల్లాలో మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లు చేయాలని సూచించారు. లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని, అలాగే బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. దసరా పండుగ సందర్భంగా రావణ దహణ కార్యక్రమాలకు ఎన్నికల నియామవళి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరగకుండా కార్యక్రమ నిర్వాహకులు ముందస్తు అనుమతిని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీ ఎల్.సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఇన్‌చార్జి డీఆర్ఓ పవన్ కుమార్, అడిషనల్ డీసీపీ శాంతిభద్రతలు లక్ష్మీనారాయణ, డీపీఓ వీరబుచ్చయ్య, జిల్లా వైద్య అధికారి లలితదేవి, ఆర్డీఓ కె.మహేశ్వర్, ఏసీపీలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసమర్థ పాలనకు కర్నాటకనే నిదర్శనం

- రాహుల్‌గాంధీ కండ్లముందు కరీంనగర్ అభివృద్ధి
- కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువు
- బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

నవతెలంగాణ - కరీంనగర్

కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనకు కర్నాటక రాష్ట్రంలో తలెత్తుతున్న తాజా పరిస్థితులే నిదర్శనమని బీఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని 37వ డివిజన్ మీసేవా కార్యలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆరు గ్యారెంటీ పథకాలతో ప్రజలను మరో మారు మోసం చేయడానికి వస్తున్నారన్నారు. పలు సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా బీఆర్ఎస్ పార్టీ నిలుస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 55 ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా కేసీఆర్ పాలన కొనసాగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి సామాన్య ప్రజానీకానికి అండగా నిలిచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తెలంగాణ ఉట్టిగా ఇయలేదని, కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఉద్యమం చేశారని, కేంద్రం మెడలు వంచి తెలంగాణ తెచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు కరువైనారని ఎద్దేవ చేశారు. కరీంనగర్‌కు వచ్చిన రాహుల్ గాంధీ తమ అభ్యర్థిని గెలిపించాలని చెప్పలేకపోయారని విమర్శించారు. అభ్యర్థులు దొరక్కపోవడంతో పలు కేసులు ఉన్న వారికే టికెట్లు కేటాయించే పరిస్థితి ఉందని ఆరోపించారు. గూగుల్‌లో టూరిజం అని టైప్ చేస్తే బెస్ట్ టూరిజం స్పాట్‌గా కరీంనగర్ నిలువనుందన్నారు. దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్‌గా అభివృద్ధి చేసిన కేసీఆర్‌కు ప్రతి ఒక్కరు మద్దతుగా నిలిచి, కరీంనగర్‌లో గంగుల కమలాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కరీంనగర్‌లో పదేండ్లుగా కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమం కుంటుపడకుండా ఉండాలంటే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గంగుల కమలాకర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌లో చేరి పనిచేస్తే కరీంనగర్‌ను కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నేతికుంట హరీష్, యూత్ అధ్యక్షుడు దీకొండ కుల్‌దీప్‌వర్మ, సత్తినేని శ్రీనివాస్, చందు, చంద్రశేఖర్, నవాబ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీచక్ర యంత్ర స్థాపన

నవతెలంగాణ - గన్నేరువరం



మండలంలోని కాసింపేట గ్రామంలో స్వయంభూగా వెలసిన మానసాదేవి అపురూప లక్ష్మి ఆలయంలో 18 శక్తి పీఠాలను స్పర్శ, ఆవాహనం చేసుకొని శుక్రవారం ఆలయంలో కమిటీ చైర్మన్ ఎలేటి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో శ్రీచక్ర యంత్ర స్థాపనను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విజయ మసాలా, డ్రై ఫ్రూట్స్ షాపు యజమానులు అక్కెనపల్లి శ్రీనివాస్, రాజేష్ కుటుంబ సభ్యులు మూడు రోజులు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ సహకార కమిటీ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, గంప వెంకన్న, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరై శ్రీ చక్రాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు బద్దం చిన్న నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీఎస్‌జీహెచ్‌ఎంఏ ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ - భగత్‌నగర్ : ప్రధానోపాధ్యాయుల బదిలీలు జరిగిన సందర్భంగా రాష్ట్ర గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఫిలిం భవన్‌లో ప్రధానోపాధ్యాయుల ఆత్మీయ సన్మాన సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాష్ మాట్లాడుతూ రాబోయే కాలంలో ప్రధాన ఉపాధ్యాయులు అందరికీ సర్వీస్ రూల్స్ రూపొందించేటట్లు ప్రమోషన్ చానెల్‌ని కల్పించే దిశగా సంఘం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బదిలీపై ఈ జిల్లాకు వచ్చిన 46 మంది ప్రధానోపాధ్యాయులను సన్మానంతో స్వాగతం పలికారు. జిల్లా నుండి బదిలీపై ఇతర జిల్లాలకు 21 మందిని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి చెరుకు ప్రద్యుమ్న కుమార్, జిల్లా అధ్యక్షుడు వేటకు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ దీక్షితులు, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, జిల్లా కోశాధికారి అశోక్‌రెడ్డి, స్వదేశీ కుమార్, జయశంకర్ ప్రభాకర్‌రావు, కృష్ణకుమార్, కరీంనగర్ ఎంఈఓ మధుసూదన్ పాల్గొన్నారు.

వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడిగా సురేష్



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్‌లోని వైశ్యసేవా కేంద్రానికి అధ్యక్షునిగా చిదురు సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నగరంలోని 33వ డివిజన్ క్యాంపు కార్యాలయంలో మేయర్ యాదగిరి సునీల్‌రావును ఏకగ్రీవంగా ఎన్నికైన చిదుర సురేష్ మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా చిదుర సురేష్‌ను మేయర్ శాలువాతో సత్కరించి, స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు. పెద్ది విద్యాసాగర్, తదితరులున్నారు.

అందుబాటులో ఉండేటోన్ని.. మరొకసారి దీవించండి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్




నవతెలంగాణ - రామడుగు

అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటెయ్యాలని.. అందరికీ అందుబాటులో ఉండే తనను మరోసారి దీవించాలని చొప్పదండి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ కోరారు. మండలంలోని వెదిర, దేశరాజుపల్లె, కొక్కెరకుంట, వన్నారం గ్రామాల్లో శుక్రవారం ప్రచారం చేశారు. దేశరాజుపల్లి గ్రామంలోని బీజేపి నాయకులు 50మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవితాలక్ష్మణ్, జెడ్పీటీసీ మార్కొండ లక్ష్మీకిష్టారెడ్డి, పార్టీ అధ్యక్షుడు గంట్ల జితెందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


7న మాదిగల విశ్వరూప మహాసభ

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ



నవతెలంగాణ - చొప్పదండి : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 7న హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ కోరారు. ఈ నెల 23న హుజురాబాద్‌కు మంద కృష్ణ మాదిగ వస్తున్నారని తెలిపారు. పట్టణంలోని ఇందిరా నగర్‌లో శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, నాయకులు కొత్తూరి సదానందం మాదిగ, కనకం గంగానరేష్ మాదిగ, కొంకటి సందీప్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త జయపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్‌లో పలు దుర్గ మాత మండపాలను కాంగ్రెస్ నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఆయా మండపాల నిర్వాహకులు, మహిళలు, యువకులు, కాలనీ వాసులు కొత్త జయపాల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం రేకుర్తి ధర్మపురి కాలనీలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో కొత్త జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కి కరీంనగర్ జిల్లాలో అభ్యర్థులే కరువయ్యారు

కరీంనగర్ మేయర్ సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

నవతెలంగాణ - కరీంనగర్

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్‌కి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అభ్యర్థులే కరువయ్యారని మేయర్ సునీల్‌రావు అన్నారు. కరీంనగర్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, జీవన్‌రెడ్డి చేసిన వాఖ్యాలను ఖండిస్తూ మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇది చేస్తాం, అది చేస్తాం అంటూ మాట్లాడుతున్న నాయకులు 50 సంవత్సరాల పరిపాలనలో ఏం అభివృద్ధి చేశారన్నారు. ఇప్పుడు వాగ్దానాలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు గతంలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 నుంచి 2014 వరకు 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులకు సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, రైతులకు సాగు నీరు, ఉచిత విద్యుత్ అందించాలని, రైతులకు బీమా, రైతు బంధు, వృద్ధులకు, వికలాంగులకు 2 వేల నుంచి 3వేల పింఛన్ ఇవ్వాలనే సంక్షేమ కార్యక్రమాలు గుర్తుకు రాలేవా అని ప్రశ్నించారు. కుటుంబ పార్టీ అంటూ చౌక బారు మాటలు మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులారా ఎవరిది కుటుంబ పార్టీయో ఆత్మ పరిశీలన చేసుకోవాలని మండిపడ్డారు. రాహుల్ గాంధీ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదాన్నారు. తమ నాయకులు కేటీఆర్, కవిత 2004 నుంచి 2014 వరకు ప్రత్యక్షంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన వ్యక్తులని, తెలంగాణ వచ్చే వరకు ఉద్యమంలోనే ఉన్నారని తెలిపారు. ఎలాంటి అనుభవం లేకుండా విమానాలు నడిపే వ్యక్తిని తెచ్చి ప్రధానమంత్రిని చేసిన పార్టీ కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. ఎవరిది కుటుంబ పార్టీనో కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలన్నారు. కరీంనగర్ జిల్లాకు చెందిన పీవీ నరసింహారావు కాంగ్రెస్‌లో దశాబ్దాల పాటు సేవ చేసిన గొప్ప నాయకులు, ఆనాడు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూలిపోతున్న ప్రభుత్వాన్ని ఎన్నో సంస్కరణలు తెచ్చి నిలబెట్టిన గొప్ప నాయకుడికి మీ పార్టీ ఇచ్చిన గౌరవం ఏంటిదని మండిపడ్డారు. అలాంటి గొప్ప నాయకులు చనిపోతే దహన సంస్కారాల కోసం స్థలం కూడ ఇవ్వలేని నీచమైన పార్టీ మీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. పీవీ నరసింహారావుకు కాంగ్రెస్ చేసిన అవమానాన్ని ప్రజలు ఎవరు మరిచిపోలేదన్నారు. దేశంలోని 28రాష్ట్రాల్లో జరిగిన అభివృద్ధికి తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిని పోల్చుకొని కాంగ్రెస్ నాయకులు మాట్లాడాలని సూచించారు. ఉద్యమ కారులపై తుపాకి ఎక్కుపెట్టిన చరిత్ర రేవంత్ రెడ్డిదని, కాంగ్రెస్ నాయకులు సిగ్గుతో తల వంచుకోవాలని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుడు జీవన్ రెడ్డి అంటేనే వెన్నుపోటుకు మారు పేరని, అలాంటి వ్యక్తి ఎమ్మెల్సీ కవితపై చౌకబారు మాటలు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కార్పొరేటర్లు వాల రమణారావు, నేతికుంట యాదయ్య, గందె మాధవి మహేష్, దిండిగాల మహేశ్, కాశెట్టి లావణ్య శ్రీనివాస్, కోల మాలతి సంపత్ రెడ్డి, పిట్టల వినోద శ్రీనివాస్, లెక్కల స్వప్న వేణు, శ్రీదేవి చంద్రమౌళి, బీఆర్ఎస్ నాయకులు కరీం, ఉయ్యాల శ్రీనివాస్, అనిల్, హామీద్, దన్ రాజు, బాలు పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్ వద్ద పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



బతుకమ్మ ఘాట్ వద్ద పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట రోడ్‌లో బతుకమ్మ ఘాట్ వద్ద పనులను మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయనవెంట కౌన్సిలర్లు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టిన బీఆర్ఎస్..

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కసుబోసుల వెంకన్న



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కసుబోసుల వెంకన్న

నవతెలంగాణ - జమ్మికుంట

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాధీ ప్రకటించిన మేనిఫెస్టోను బీఆర్ఎస్ పార్టీ కాపీకొట్టిందని కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న అన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపెల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా బల్మూర్ వెంకట్ రెండేళ్లుగా ప్రజలకు అండగా ఉంటూ, ఆపద సమయంలో ఆదుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎండి.సలీం పాష, శ్రీనివాస్, శంకర్, రాజమౌళి, కొత్తూరి సాగర్, ప్రభుదాస్, అశోక్, మురళి, ప్రకాష్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా ఐలయ్య

నవతెలంగాణ - చొప్పదండి



చొప్పదండి మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా ఆర్నకొండ గ్రామానికి చెందిన రాపెల్లి ఐలయ్య ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ చొప్పదండి మండలంలో యాదవ సంఘాన్ని మరింత బలోపేతం చేసి, అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని తెలిపారు. మండల కమిటీని ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండల సర్వసభ్య సమావేశాన్ని మండల ప్రజాపరిషత్ కార్యాలయలో ఈ నెల 27న ఉదయం 11గంటలకు ఎంపీపీ రవీందర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టుగా ఎంపీడీవో స్వరూప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో మూడు నెలల సమీక్ష ఉంటుందని, ఈ సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

స్వాతంత్య్రం వచ్చాక కాంగ్రెస్ అవసరం లేదన్న గాంధీ

మంత్రి కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

స్వాతంత్య్రం వచ్చాక కాంగ్రెస్ అవసరం లేదని గాంధీజీ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ట్వీట్ చేశారు. ఇలాంటివారు కాంగ్రెస్‌లో ఉంటారని ఆయన ఆనాడే ఊహించారేమో? అవినీతి గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. 'టికెట్లు అమ్ముకున్నారని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ నేతలే ఈడీకి ఫిర్యాదు చేశారు. ఓటుకు నోటు కేసులో ఆయన ఇప్పటికే పట్టుబడ్డాడు. పీసీసీ పోస్టును రూ.50 కోట్లకు అమ్మారని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఒకరు పీసీసీ పోస్టును విక్రయిస్తే మరొకరు కొనుగోలు చేశారు. ఇంత అవినీతి పార్టీలో ఉన్న రాహుల్...అక్రమాలపై మాట్లాడటం హాస్యాస్పదం' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

అస్తిత్వ సాహిత్య ఉద్యమ పిడికిలి 'జూలూరు పథం' చుక్కారామయ్య

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బహుజనసాహిత్య గొంతుకగా, అస్తిత్వ సాహిత్య ఉద్యమాల పిడికిలిగా తెలుగు సాహిత్యంలో 'జూలూరు పథం' పుస్తకం మైలురాయిలా నిలిచిపోతుందని ప్రముఖ విద్యావేత్త చుక్కారామయ్య అన్నారు. ఈనెల 22న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరుగనున్న తన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి వయోభారంతో హాజరుకాలేకపోతున్న చుక్కారామయ్యను శుక్రవారం ఆయన నివాసంలో జూలూరు గౌరీశంకర్ కలిసి "జూలూరు పథం" పుస్తకాన్ని అందచేశారు. 14 ఏండ్లుగా విద్యారంగ సమస్యలపై చుక్కారామయ్యతో కలిసి చేసిన రచనలను, రాష్ట్రసాధన ఉద్యమంలో కలిసి పనిచేసిన ఉద్యమ సందర్భాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆనాటి తెలంగాణ సాయుధ పోరాట యోధునికి, ఈ కాలపు రామానుజన్ చుక్కారామయ్యకు విడుదల కానున్న "జూలూరు పథం" పుస్తకాన్ని అందించి ఆశీర్వాదం తీసుకోవటం గర్వంగా ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. చుక్కారామయ్య రచనలన్నింటినీ త్వరలో సంపుటాలుగా వెలువరిస్తానని ఈ సందర్భంగా జూలూరు చెప్పారు.

డీఈఐఈడీ ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్‌లో రాసిన రాతపరీక్షల ఫలితాలను విడుదల చేసినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసేందుకు తుది గడువు వచ్చేనెల ఆరో తేదీ వరకు ఉందని పేర్కొ న్నారు. ఇతర వివరాలకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచి ంచారు.

విజయీభవ పాటల సీడీ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నంది అవార్డు గ్రహీత, న్యాయవాది లక్ష్మణ్ గంగ రాసిన 'విజయీభవ కేసీఆర్' పాటల సీడీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఆవిష్కరించారు. పాట చాలా బాగుందని కితాబిచ్చిన ఆయన ఇలాంటి మరెన్నో గీతాలను రాయాలంటూ ఆకాంక్షించారు. పాట రచయితను, ఇతర టీమ్‌ను కేటీఆర్ ఈ సందర్భంగా అభినందించారు.

రాహుల్ గాంధీవి ఫ్లాప్ షోలు...

- మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పర్యటించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ షోలన్నీ.. ఫ్లాప్ షోలుగా మారాయని మంత్రి సత్యవతి రాథోడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు అధికారం రాదని తెలిసి, ఆ పార్టీ నేతలు అసహనంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బతుకమ్మ పండగను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. జగిత్యాలలో ఓటమి ఖాయమని తెలిసే ఆయన పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని అన్నారు. జీవన్‌రెడ్డి తక్షణమే మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ పండగకు అసలైన వైభవం తెచ్చింది ఎమ్మెల్సీ కవితేనని స్పష్టం చేశారు.

'ఒక దేశం ఒకే ఎన్నికల'పై 25న కమిటీ భేటీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'ఒక దేశం ఒకే ఎన్నికలు'పై విధివిధానాలను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ తదుపరి సమావేశం ఈనెల 25న జరుగనుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన తొలి అధికారిక సమావేశం ఇటీవలి ఢిల్లీలోని ఆయన నివాసంలో జరిగింది. ఈ సమావేశంలో హౌం మంత్రి అమిత్‌షా, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ పాల్ కూడా పాల్గొన్నారు. రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు, భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆ సమావేశం నిర్ణయించింది.

ప్రధాని మోడీ 2014 నుంచి ఏకకాలంలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను సమర్థిస్తూ వస్తున్నారు. ఏకకాలంలో అటు పార్లమెంటు, ఇటు రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరగడం వల్ల ఆర్థిక భారం తగ్గుతుందని, పథకాల అమలు సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలవుతుందని చెబుతున్నారు. ఒకదేశం ఒకే ఎన్నికల విధానంపై అధ్యయనానికి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి గత సెప్టెంబర్ 1న ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా రామ్‌నాథ్ కోవింద్ నియమితులయ్యారు. హౌం మంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి రాజ్యసభ మాజీ ఎంపీ గులాం నబీ ఆజాద్, మాజీ ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ సి.కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషర్ సంజయ్ కొఠారీ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్నారు. గతంలో ఏకకాలంలో ఎన్నికలకు సాధ్యాసాధ్యాలను లా కమిషన్, నిటి ఆయోగ్, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చర్చించాయి. కాగా, కమిటీ నివేదిక వచ్చాక పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని, చర్చ జరుగుతుందని, నివేదిక పార్లమెంటుకు రాగానే దానిపై చర్చిస్తామని, అందువల్ల భయపడాల్సిన పనిలేదని ప్రహ్లాద్ జోషి వివరణ ఇచ్చారు.

ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, కంప్యూటర్ల

- దిగుమతి ఆంక్షలపై కేంద్రం యూటర్న్



న్యూఢిల్లీ : ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, కొన్ని రకాల కంప్యూటర్ల దిగుమతులపై ఆంక్షలు విధిస్తూ గతంలో తీసుకున్న నిర్ణయంపై కేంద్రం యూటర్న్ తీసుకున్నది. అలాంటిదేమీ ఉండబోదని అధికారికంగా ప్రకటించింది. అలాగే, నూతన 'దిగుమతి నిర్వహణ వ్యవస్థ'ను తీసుకొస్తున్నట్టు వివరించింది. ఈ మేరకు ఒక ప్రకటనను చేసింది. కొత్త నిబంధనలన ప్రకారం.. ఐటీ హార్డ్‌వేర్ కంపెనీలు వాటి దిగుమతులకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేసి బహిర్గతం చేయాలి. కాగా, గతంలో కేంద్రం జారీ చేసిన లైసెన్సింగ్ నోటిఫికేషన్‌తో ఈ రంగం ఆందోళన చెందింది. కాగా, భారత్ ప్రణాళికలపై ఇటీవల జరిగిన డబ్ల్యూటీఓ సమావేశంలో అమెరికా, చైనా, దక్షిణ కోరియా, తైవాన్‌లు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం తీసుకోవటం గమనార్హం.

ఎంపీలో సంపన్న ఎమ్మెల్యేలు


- 81 శాతం మంది కోటీశ్వరులే
- సగటు ఆస్తుల విలువ రూ.10.5 కోట్లకు పైగానే..!
- బీజేపీ నుంచే అధికం : ఏడీఆర్ నివేదిక

భోపాల్ : బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఒక సగటు మనిషి నెలవారీ ఆదాయం రూ.11 వేలు మాత్రమే. కానీ, అక్కడి ఎమ్మెల్యేల ఆస్తులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. అసెంబ్లీలో అధిక సంఖ్యలో సంపన్నులు ఉన్నారు. దాదాపు 81 శాతం మంది కోటీశ్వరులే. అంటే 230 మంది సభ్యులను కలిగి ఉన్న మధ్యప్రదేశ్ అసెంబ్లీలో 186 మంది ధనికులే కావటం గమనార్హం. ఇందులో అధికారిక బీజేపీ నుంచే ఎక్కువ మంది ఉండటం గమనార్హం. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సమర్పించిన సభ్యుల అఫిడవిట్ల ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) రూపొందించిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది.

భారీగా పెరిగిన ఆస్తులు

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ రూ. 10.76 కోట్లుగా ఉన్నది. 2013లో ఒక ఎమ్మెల్యే సగటు ఆస్తి విలువ ఇది రూ.5.24 కోట్లుగా ఉండగా.. అది ప్రస్తుతం ఏకంగా 105 శాతం పెరగటం గమనార్హం. 2008లో మాత్రం సగటు మధ్యప్రదేశ్ ఎమ్మెల్యే ఆస్తి విలువ రూ.1.44 కోట్లుగా ఉన్నది.

బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ పాఠక్ అత్యంత సంపన్నుడు



మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే మధ్యప్రదేశ్ శాసన సభలో అత్యంత సంపన్నుడిగా ఉన్నాడు. ప్రస్తుతం ఈయన ఆస్తుల విలువ రూ.226 కోట్లుగా ఉన్నది. 2013లో ఆయన ఆస్తుల విలువ రూ.141 కోట్లుగా ఉండగా.. 2018 ఎన్నికల నాటికి 60 శాతం కంటే ఎక్కువ పెరుగుదలను నమోదు చేయటం గమనార్హం.

కమల్‌నాథ్ ఆరోస్థానం..

ఇక మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్.. ధనిక ఎమ్మెల్యేల జాబితాలో ఆరో స్థానంలో ఉన్నారు. ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ. 124 కోట్లుగా ఉన్నది. ఇక ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆస్తుల విలువ రూ .7 కోట్లుగా ఉన్నది.




పేద ఎమ్మెల్యేలు వీరే..

మధ్యప్రదేశ్‌లో పేద ఎమ్మెల్యేల జాబితాలో ఆరుగురు బీజేపీ నుంచి, నలుగురు కాంగ్రెస్ నుంచి ఉన్నారు. పంధానా స్థానం నుంచి తొలిసారి విజయం సాధించిన గిరిజన ఎమ్మెల్యే రామ్ డంగోర్ రూ.50వేల ఆస్తులను కలిగి ఉండి రాష్ట్రంలో అత్యంత పేద ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో బీజేపీ ఎమ్మెల్యే మంత్రి ఉషా ఠాకూర్(రూ.7 లక్షలు), షరద్ కోల్ (రూ.8.4 లక్షలు) ఉన్నారు.

విద్యార్హతలు ఇలా..

230 మంది ఎమ్మెల్యేల్లో 59 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు (బీజేపీ నుంచి 35 మంది, కాంగ్రెస్ నుంచి 24 మంది) ఉన్నారు. ఇక 55 మంది ఎమ్మెల్యేలు గ్రాడ్యుయేట్లు (బీజేపీ-28, కాంగ్రెస్ -26), 39 మంది ప్రొఫెషనల్ గ్రాడ్యుయేట్లు (బీజేపీ-25, కాంగ్రెస్ 13 మంది) ఉన్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు డాక్టరేట్లు (బీజేపీ-4, కాంగ్రెస్-1) కాగా, నలుగురు ప్రొఫెషనల్ డిప్లొమా హెూల్డర్లు(బీజేపీ -2, కాంగ్రెస్ -1, స్వతంత్రులు -1) ఉన్నారు. 35 మంది ఎమ్మెల్యేలు 12వ తరగతి, 12 మంది ఎమ్మెల్యేలు 10వ తరగతి, ఏడుగురు 8వ తరగతి, 8 మంది 5వ తరగతి వరకు తమ విద్యార్హతను కలిగి ఉన్నారు. ఐదుగురికి చదవటం, రాయటం రాగా.. ఒక బీజేపీ ఎమ్మెల్యే మాత్రం నిరక్షరాస్యులుగా ఉన్నారు.



బీజేపీ నుంచి 107 మంది.. కాంగ్రెస్ నుంచి 76 మంది

ఇక ప్రస్తుత 81 శాతం మంది ధనిక ఎమ్మెల్యేల్లో అధికం అధికార బీజేపీ సభ్యులే కావటం గమనార్హం. రాష్ట్రంలో బీజేపీ మొత్తం 230 స్థానాలకు గానూ 129 ఎమ్మెల్యేలను కలిగి ఉన్నది. ఇందులో 107 మంది (83 శాతం మంది) కోటీశ్వరులే. ఆ తర్వాత స్థానంలో కాంగ్రెస్ ఉన్నది. ఇక్కడ కాంగ్రెస్ 97 మంది ఎమ్మెల్యేలతో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నది. అయితే, వీరిలో 76 మంది (అంటే 78 శాతం మంది) సంపన్నులే కావటం గమనార్హం. ఇక నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ముగ్గురు సైతం కోటీశ్వరులే.2008 మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సంపన్న ఎమ్మెల్యేల సంఖ్య 84గానే ఉన్నది. 2013 అసెంబ్లీ ఎన్నికల నాటికి అది 92 శాతం పెరిగి 161కి చేరుకున్నది. 2018 నాటికి వచ్చేసరికి ధనిక ఎమ్మెల్యేల సంఖ్య 15.5 శాతం పెరిగి ఆ సంఖ్య 186గా నమోదైంది.

40 శాతం మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు

ఆస్తుల సంపాదనే కాదు.. క్రిమినల్ కేసుల విషయంలోనూ మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు.

ఇక్కడ మొత్తం 40 శాతం మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో 20 శాతం మందిపై తీవ్రమైన నేరపూరిత కేసులు ఉండటం గమనార్హం. అధికార బీజేపీ నుంచే 30 శాతం మంది క్రిమినల్ కేసులను కలిగి ఉండగా.. 16 శాతం మందిపై తీవ్రమైన నేరపూరిత కేసులు ఉన్నాయి.

ఇక ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ నుంచి 54 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉండగా.. 26 శాతం మంది తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి.

హైదరాబాద్‌లో మూడు చోట్ల అగ్ని ప్రమాదాలు



- ఎగసిపడిన మంటలు.

నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైదరాబాద్‌లో శుక్రవారం ఒక్క రోజే మూడు అగ్ని ప్రమాదాలు జరిగాయి. బొగ్గులకుంటలోని ఓ హాస్టల్‌లో, సికింద్రాబాద్ పాలికాబజార్‌లోని బ్యాగుల షాపులో, ఎస్సార్ నగర్ పీఎస్ పరిధిలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో మంటలు ఎగసిపడ్డాయి. నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధి అడ్మిన్ ఎస్ఐ జి.నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

బొగ్గులకుంటలో శ్రీనివాస బాయ్స్ హాస్టల్ మొదటి, రెండో అంతస్తుల్లో షార్ట్ సర్క్యూట్ వల్ల పెద్దఎత్తున మంటలు లేచాయి. ఆ ప్రాంతంలో పొగ కమ్ముకుంది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. హాస్టల్ గదుల్లో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే, విద్యార్థుల సర్టిఫికెట్స్, ఫర్నిచర్, కుర్చీలు, బెడ్స్, పుస్తకాలు, దుస్తులు కాలిపోయాయి.

మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలికాబజార్‌లో ఉన్న ఓ సెల్లార్ ఎంట్రన్స్ వద్ద సిటీ కలెక్షన్స్ బ్యాగుల దుకాణంలో దట్టమైన పొగలు వచ్చాయి. స్థానికులు వెంటనే పోలీసులతోపాటు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది, జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. అలాగే, ఎస్సార్ నగర్ పీఎస్ పరిధిలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో మంటలు ఎగిసిపడగా అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదాల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

'సీఎం అల్పాహారం' ఒక్కో విద్యార్థికి రూ.10.50

- వంట కార్మికులకు గ్రామాల్లో రూ.2 వేలు, పట్టణాల్లో రూ.వెయ్యి పారితోషికం
- పాఠశాల విద్యాశాఖ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి అల్పాహార పథకంలో ఒక్కో విద్యార్థికి రూ.10.50 పైసలు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. అయితే ఇడ్లీ, పూరి, పొంగల్, పోహా, మిల్లెట్ ఇడ్లీ, వెజిటబుల్ పొలావ్‌కు రూ.10.50 పైసలు ఇస్తారు. గోధుమ రవ్వ ఉప్మా టమాటా బాత్, కిచిడీ వంటి అల్పాహార మెనూకు ఒక్కో విద్యార్థికి రూ.ఎనిమిది ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక ముఖ్యమంత్రి అల్పాహారం వండే వంట కార్మికులకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.రెండు వేలు, పట్టణాల్లో రూ.వెయ్యి పారితోషికం చెల్లించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులను విడుదల చేయలేదు. డీఈవోలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మౌఖిక ఆదేశాలను విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన జారీ చేసినట్టు తెలిసింది. మధ్యాహ్న భోజన కార్మికులే అల్పాహారం వండుతారా లేదా ఇతరులు ఆ పని చేస్తారా? అన్నది వారి ఇష్టం.

ఎవరు చేసినా అల్పాహారం వండినందుకు పారితోషికం విడిగా చెల్లిస్తారు. హైదరాబాద్ సహా పలు పట్టణ ప్రాంతాల్లో మన్నా, అక్షయపాత్ర ట్రస్టులు మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులకు అందిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని కూడా వాటికే అప్పగించారు. అల్పాహార పథకాన్ని ఈనెల ఆరో తేదీన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల జెడ్పీహెచ్ఎస్‌లో ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పుడు నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున ప్రారంభించారు. దసరా తర్వాత రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బడుల్లోనూ ఈ పథకాన్ని అమలు చేస్తారు. ప్రతి రోజూ ఉదయం పాఠశాలల ప్రారంభానికి 45 నిమిషాల ముందే విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. దీంతో రాష్ట్రంలోని 27,147 పాఠశాలల్లోని దాదాపు 23 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యంతో కూడిన భోజనం, వారానికి మూడు గుడ్లను అందిస్తున్నారు. ఐరన్, సూక్ష్మ పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రూ.32 కోట్లతో రాగి జావను ఇస్తున్నారు.

ఈ రకంగా ఉదయం ముఖ్యమంత్రి అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం రాగిజావను విద్యార్థులకు అందించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది.

షెడ్యూల్డ్ ఏరియాల్లో 'గృహలక్ష్మి'పై హైకోర్ట్ స్టే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

షెడ్యూల్డ్ ఏరియాల్లో గ్రామసభ నిర్వహించకుండా లబ్దిదారుల ఎంపిక చేయరాదన్న నిబంధనకు వ్యతిరేకంగా గృహలక్ష్మి పథకం కింద ఇండ్ల నిర్మాణాల లబ్దిదారులను ఎంపిక చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. సొంత జాగా ఉన్న పేదలకు సొంతింటి కల నెరవేర్చే క్రమంలో ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రూపొందించింది.

ఇందుకు జీవోనెం.25ను గత నెల్లో జారీ చేసింది. ఇది గిరిజనుల హక్కులను కాలరాసేలా ఉందనీ, అందువల్ల చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరుతూ ఆదివాసీ సేన ప్రధాన కార్యదర్శి సాయిబాబు వేసిన రిట్‌ను జస్టిస్ భాస్కర్‌రెడ్డి విచారించారు. షెడ్యూల్ ఏరియాలో గహలక్ష్మి అమలును నిలిపివేస్తూ స్టే ఇచ్చారు. విచారణను వచ్చే నెలకు వాయిదా వేశారు.

ఈలోగా కౌంటర్లు దాఖలు చేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గిరిజన, ఆర్అండ్‌బీ శాఖలతోపాటు గృహ నిర్మాణ శాఖ ఎమ్‌డీ, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, గిరిజన ప్రాంతాలున్న జిల్లా కలెక్టర్లు, ప్రాజెక్టు ఆఫీసర్లకు నోటీసులు జారీ చేశారు.

మావోయిస్టు నేతకు బెయిల్

ఆమనగల్లుకు చెందిన మావోయిస్టు దరగోని శ్రీనువిక్రమ్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.25వేల వ్యక్తిగత పూచీకత్తుతోపాటు ఇద్దరు ష్యూరిటీని సంబంధిత కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది.నెలలో ఒకసారి ఆమనగల్లు పీఎస్‌కు హాజరు కావాలంటూ ఆదేశించింది. పిటిషనర్‌పై కేసులు విచారణలో ఉన్నాయని పీపీ చెప్పడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. అతడు గత పదకొండు ఏండ్లుగా జైల్లో ఉన్నారని గుర్తు చేసింది. ఎంపీపీ హత్య కేసులో కింది కోర్టు విధించిన శిక్షను సవాల్ చేసిన క్రిమినల్ అప్పీల్‌పై విచారణ పూర్తయ్యే వరకు బెయిల్ ఇవ్వాలంటూ దరగోని దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు మధ్యంతర ఆదేశాలనిచ్చింది.

సుప్రీంలో చంద్రబాబు కేసు విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ఎస్ఎల్పీపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం. త్రివేది ధర్మాసనం ఎదుట చంద్రబాబు తరపున సిద్ధార్థ లూథ్రా, ఏపీ ప్రభుత్వం తరపున రంజిత కుమార్ వాదనలు వినిపించారు. తొలుత సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ పిటిషనర్ పై మూడు ఎఫ్ఎస్ఐఆర్ లు ఉన్నాయని, ఒక దానికి సంబంధించిన తీర్పు రిజర్వు అయిందని తెలిపారు. ఫైబర్ నెట్ కేసులో అరెస్ట్ చేయవద్దని ఇప్పటికే చెప్పారన్నారు. ఏపీ ప్రభుత్వం తరపున న్యాయవాది రంజిత్ కుమార్ వాదిస్తూ ఒక వ్యక్తి కస్టడీలో ఉన్నప్పుడు మళ్లీ అరెస్ట్ అనే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. చంద్రబాబు జ్యుడీషియల్ కస్టడీ కొనసాగుతోందని, ఈ అంశాన్ని కౌంటర్ అఫిడవిట్లో తెలిపామని చెప్పారు. వాదనలు విన్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను నవంబర్ 8కి వాయిదా



వేసింది. తనకు ఉన్న వ్యక్తిగత ఇబ్బంది రీత్యా నవంబర్ 9న విచారణ చేపట్టాలని సిద్ధార్థ లూథ్రా కోరగా.. రెండు రోజుల్లో ఏదో ఒకరోజు విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది.స్కిల్ డెవలప్‌మెంట్ కేసుపై ముందుగా తీర్పు వెలువరిస్తామని, ఆ తరువాత ఫైబర్ నెట్ కేసు అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అప్పటి వరకు ఫైబర్ నెట్ కేసులో యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది. అంతవరకు చంద్రబాబును అరెస్ట్ చేయొద్దని స్పష్టం చేసింది. ఫైబర్ నెట్ కేసులో తన ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టేస్తూ ఏపీ హైకోర్టు ఈనెల 9న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ చంద్రబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

బీజేపీలో అయోమయం

- మొక్కుబడిగా ఎన్నికల నిర్వహణ కమిటీల పని
- పెద్దగా చేరని ఇతర పార్టీల ముఖ్య నేతలు
- గడువు ముంచుకొస్తున్నా ఖరారుకాని అభ్యర్థిత్వాలు
- తొలిజాబితా నేడా? రేపా?



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇటు బీఆర్ఎస్..అటు కాంగ్రెస్ ఎన్నికల గోదాలో ఢీ అంటే ఢీ అనే స్థాయిలో ప్రచార పర్వంలో దూసుకుపోతుంటే తెలంగాణ బీజేపీలో మాత్రం అయోమయ పరిస్థితి నెలకొంది. ఢిల్లీ నాయకత్వం రాష్ట్రానికి దిగొచ్చినా గల్లీ నాయకత్వంలో మాత్రం ఆధిపత్య పోరు అంతర్గతంగా కొనసాగుతూనే ఉన్నది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వేసిన కమిటీల మొక్కుబడి తీరు ఆ పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది. ఎన్నికల నాటికి ఆయా కమిటీల చైర్మెన్లు ఎంత మంది పార్టీలో ఉంటారో కూడా రాష్ట్ర నాయకత్వం చెప్పలేని విచిత్రమైన పరిస్థితిలోకి కూరుకుపోయింది. మరోవైపు కొన్ని నియోజకవర్గాల్లో మినహా బలమైన అభ్యర్థులు లేకపోవడం...ఆ పార్టీ గ్రాఫ్ పడిపోవటం, ఇతర పార్టీల నుంచి చేరికలు లేకపోవడంతో అభ్యర్థుల ప్రకటన ఇంకా కొలిక్కి రాలేదు. 119 నియోజకవర్గాలకు అభ్యర్థులను వెతుక్కోవడం ఆ పార్టీకి పెద్ద సమస్యగా మారింది. మొన్నటిదాకా బీఆర్ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమనీ, ఒంటరిపోరుతో రాష్ట్రంలో సునామీ సృష్టించబోతున్నామని డాంబికాలకు పోయిన బీజేపీ నాయకత్వం ఇప్పుడు ఢిల్లీలో మంతనాల మీద మంతనాలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. ముఖ్యమైన నేతలతో కూడిన తొలిజాబితా ఒకటెండ్రు రోజుల్లో విడుదలయ్యే అవకాశాలున్నాయి. మరోవైపు జిల్లాల్లోని ఐదారు నియోజకవర్గాల్లో మినహా మిగతావాటిలో పట్టులేకున్నా పాకులాడే కంటే టీడీపీ, జనసేన పొత్తుతో సెటిలర్ల ఓటర్లు రాబట్టుకునే ప్రయత్నాల్లో మునిగింది. అందులో భాగంగానే టీడీపీ, జనసేన నేతలతో బీజేపీ రాష్ట్ర నాయకత్వం చర్చలు జరుపుతున్నది.

బుజ్జగింపు కమిటీలు..పనిచేస్తే ఒట్టు

ఎన్నికల నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం 14 కమిటీలను వేసింది. వాటిని అసంతృప్త నేతలను బుజ్జగించేందుకు మొక్కుబడిగా వేశారనే చర్చా నడుస్తున్నది. ఈ నేపథ్యంలో ఆయా కమిటీలకు చైర్మెన్లుగా నియమించిన అసంతృప్త నేతలు తమ విధులను నిర్వర్తించడం లేదు. అసంతృప్తి బాటను వీడటం లేదు. కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న విజయశాంతికి ఆందోళనా కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించింది. తాను పార్టీని వీడట్లేదని ఆమె చెబుతున్నప్పటికీ పార్టీ ముఖ్యమైన కార్యక్రమాలకు మాత్రం హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్‌గా నియమించిన రాజగోపాల్‌రెడ్డి అమిత్‌షా, మోడీ బహిరంగ సభలకు, నడ్డా ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి డుమ్మా కొట్టారు. ఆయా నియోజకవర్గాలకు పోటీచేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారిలో నుంచి షార్ట్ లిస్టు తయారు చేసే బాధ్యత రాజగోపాల్‌రెడ్డికి అప్పగించినా ఆయన తన విధులను నిర్వర్తించలేదనే విమర్శ బలంగా ఉంది. చివరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, ఇతర సీనియర్ నేతలతో కలిసి షార్ట్ లిస్టు తయారు చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. 20 నియోజకవర్గాలకు మించి బలమైన అభ్యర్థులు లేకపోవడంతో జాతీయ నాయకత్వం మల్లగుల్లాలు పడుతూ అభ్యర్థుల ప్రకటనను తాత్సారం చేస్తూ పోతున్నది. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అసంతృప్తి నేతల్ని నయానో, భయానో తమవైపు తిప్పుకోవాలనే ఆలోచనలో ఆ పార్టీ అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది. చేరికల కమిటీ చైర్మెన్‌గా ఈటల రాజేందర్, ఇనిష్లూయెన్స్ కమిటీ చైర్మెన్‌గా డీకే అరుణలాంటి కీలకమైన నేతలున్నప్పటికీ ఆ పార్టీలో పెద్దగా ప్రభావశీల నాయకులు చేరడం లేదు. తృతీయశ్రేణి నాయకులను చేర్చుకుని అదే గొప్పగా ప్రచారం చేసుకుంటున్నది. అదే సమయంలో బీజేపీ నుంచి ముఖ్యనేతలు ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోతున్నారు. ఎస్సీ నియోజకవర్గాల కేంద్రీకృత కమిటీ చైర్మెన్‌గా విజయరామారావును పార్టీ నియమించింది. ఆ కమిటీ పెద్దగా పనిలో లేదు. ఎంపీ అర్వింద్‌కుమార్ చైర్మెన్‌గా ఉన్న సోషల్ మీడియా కమిటీ హడావిడి కొంత ఉన్నప్పటికీ అందులోనూ వర్గపోరు నడుస్తున్నది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోనే సోషల్‌మీడియా టీమ్ రెండుగా విడిపోయి గొడవపడే స్థాయికి పరిస్థితి వచ్చింది. మిగతా కమిటీల పనితీరు అంతంత మాత్రంగానే ఉంది. ఇంతకూ ఆయా కమిటీల చైర్మెన్లు ఎన్నికల నాటికి పార్టీలో ఎంత మంది ఉంటారో కూడా రాష్ట్ర నాయకత్వం చెప్పలేని పరిస్థితిలో ఉంది. పోటీకి సరైన నాయకులు దొరక్క, క్షేత్రస్థాయిలో గెలుపొందే స్థాయిలో ఓటింగ్ లేక ఇప్పుడు టీడీపీ, జనసేన జపం చేస్తున్నది. ఆ రెండు పార్టీలను గ్రిప్‌లో పెట్టుకుంటే గ్రేటర్ పరిధిలోని తమ సొంతబలానికి, సెటిలర్ల ఓటింగ్ కలిసొస్తే నాలుగైదు సీట్లలో గెలువొచ్చనే ఆశతో ముందుకు సాగుతున్నది. అదే సమయంలో తెలంగాణలో ఆర్థికంగా, సామాజికంగా ప్రభావితం చూపే సామాజిక తరగతులను రెచ్చగొట్టి ఓట్లను కొల్లగొట్టాలనే ఎత్తుగడను మొదలుపెట్టింది. ముదిరాజ్‌ల సభ నిర్వహించడం, ఇంద్రసేనారెడ్డికి త్రిపుర గవర్నర్ పదవి కట్టబెట్టడం అందులో భాగంగానే అనే చర్చ పెద్ద ఎత్తున నడుస్తున్నది.



వ్యాయామం మంచిదే..

నేచర్ మెటబాలిజం జర్నల్‌లో ప్రచురించిన ఓ అధ్యయనం ప్రకారం గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో వ్యాయామం చేస్తే పుట్టబోయే బిడ్డకు ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని తేలింది. అందువల్ల, గర్భిణీ స్త్రీలు ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని అమెరికన్ ప్రెగ్నెన్సీ అసోసియేషన్ సిఫార్సు చేసింది. గర్భధారణ సమయంలో చేసే వ్యాయామం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం.

వెన్నునొప్పి నుంచి ఉపశమనం : గర్భంతో వున్నవారు ప్రతిరోజూ 20 నుంచి 30 నిమిషాల వరకు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే వెన్నునొప్పి, వాటర్ రిటెన్షన్, ఉబ్బరం వంటి లక్షణాల నుంచి బయటపడొచ్చు.

మెరుగైన బలం : గర్భంతో ఉన్నప్పుడు తొమ్మిది నెలల పాటు శిశువు అదనపు బరువును మోయాల్సి ఉంటుంది. ఈ సమయంలో కండరాల బలం, ఓర్పు చాలా అవసరం. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా కండరాల బలాన్ని మెరుగుపర్చుకోవచ్చు.

నిద్రకు దోహదం : గర్భంలో శిశువు పెరుగుతూ ఉన్న సమయంలో నిద్ర సరిగ్గా పట్టకపోవచ్చు. కాబట్టి గర్భాధారణ సమయంలోనూ మంచి నిద్ర రావాలంటే వ్యాయామం చేయడం ఉత్తమం.

మెరుగైన మానసిక స్థితి : గర్భధారణ సమయంలో ఫీమేల్ హార్మోన్లు, రక్త పరిమాణం పెరగడం వల్ల మానసిక స్థితి తరచుగా మారుతుంటుంది. ఈ క్రమంలో వ్యాయామం చేయడం ద్వారా శరీరంలోని ఎండార్ఫిన్లు, సెరోటోనిన్, డోపామైన్లను బయటకి విడుదలవుతాయి. తద్వారా వ్యాయామం గర్భిణీ స్త్రీల మానసిక స్థితిని అదుపులో ఉంచడానికి, మంచి అనుభూతిని కలిగించడానికి సహాయపడుతుంది.


డయాబెటిస్ దూరం : గర్భధారణ సమయంలో స్త్రీలు తరచుగా మధుమేహం, రక్తపోటు బారిన పడుతుంటారు. ఈ రెండింటినీ సాధారణ వ్యాయామం ద్వారా అదుపులోకి తేవొచ్చు.

సులభంగా పనులు : క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారు. వ్యాయామం శ్రమ ప్రక్రియను సులభతరం చేసి మీ శరీరానికి శక్తిని అందజేస్తుంది. దీంతో పాటు శిశువును ప్రసవించే సమయంలో ఇబ్బందులు రాకుండా చేస్తుంది.

బరువు తగ్గడానికి : సాధారణంగా ప్రెగ్నెన్సీ సమయంలో బరువు పెరుగుతారు. అయితే ప్రసవించిన తర్వాత వీలైనంత త్వరగా బరువు తగ్గాలని ఆలోచిస్తుంటారు. వీరికి చక్కటి పరిష్కారం గర్భధారణ సమయంలో వ్యాయామం చేయడం.

ప్రేమ.. పెండ్లి

ప్రేమంటే మాటల్లో చెప్పలేని అనుభూతి. యవ్వనంలో ఉన్నవారికే కాదు ఏ వయసు వారిలోనైనా ప్రేమ పుట్టొచ్చు. సృష్టిలో ప్రతి జీవికి ప్రేమ అనేది ఓ అందమైన జ్ఞాపకం. కానీ నేటి యువతరం ప్రేమ అంటే కేవలం ఓ ఆకర్షణ, శారీరక సంబంధంగా భావిస్తున్నారు. చాలామంది వ్యామోహాన్నే ప్రేమ అనుకుంటున్నారు. తమ అవసరాలు తీరిన తర్వాత బంధాన్ని తెంచేసుకుంటున్నారు. దీని వల్ల ప్రేమకు విలువ లేకుండా పోతుంది. అలాంటి కథనమే ఈ వారం మీకోసం...



శ్రీనిధికి సుమారు 27 ఏండ్లు ఉంటాయి. డిగ్రీ చేసే రోజుల్లో వేణుతో ప్రేమలో పడింది. వాళ్ళిద్దరిదీ ఆరేండ్ల ప్రేమ. వాళ్ళ ప్రేమ గురించి కాలేజీలో అందరికీ తెలుసు. ప్రేమికులంటే వీరిద్దరిలా ఉండాలి అనుకునేవారు అందరూ. శ్రీనిధి, వేణు ప్రేమను అంగీకరించడానికి రెండేండ్లు పట్టింది. తర్వాత అందరి ప్రేమికుల మాదిరిగానే కలిసి సరదాగా బయటకు వెళ్లేవారు. ఇద్దరూ కలిసి భవిష్యత్ గురించి ఎన్నో కలలు కన్నారు. వారి మధ్య ఎలాంటి దాపరికాలు ఉండేవి కావు. ఒకరి కోసం ఒకరు అన్నట్లు ఉండేవారు. ఆ నమ్మకంతోనే ఇద్దరి మధ్య శారీరక సంబంధం కూడా ఏర్పడింది. దాంతో పెండ్లికి ముందే శ్రీనిధి గర్భవతి అయ్యింది.

అప్పటికి వీరి చదువు ఇంకా పూర్తి కాలేదు. అప్పుడే పిల్లలు పుడితే చదువుకు ఇబ్బంది అని ఇద్దరూ మాట్లాడుకొని అబార్షన్ చేయించుకున్నారు. ఆ తర్వాత కూడా ఇద్దరూ బాగానే ఉన్నారు. కాలేజీ చదువు పూర్తి అయ్యింది. ఇద్దరూ ఉద్యోగంలో చేరారు. చదువు పూర్తయి ఉద్యోగం చేస్తున్నారు కాబట్టి పెండ్లి చేసుకొమ్మంటూ ఇంట్లో ఒత్తిడి చేశారు. ఇద్దరూ పెండ్లి చేసుకుని హాయిగా ఉండొచ్చని శ్రీనిధి ఎంతో సంతోషించింది. కానీ ఆమె ఆశ తీరలేదు. వేణు ఆమె పెండ్లి చేసుకోవడానికి సిద్ధంగా లేడు. ఎందుకు అని ఆరా తీస్తే అతను వాళ్ళ మామయ్య కూతురిని పెండ్లి చేసుకోబోతున్నాడని తెలిసింది.

దాంతో శ్రీనిధి 'ఇన్నేండ్లు నన్ను ప్రేమించానని వెంటపడ్డావు. నేను గర్భవతిని కూడా అయ్యాను. ఇప్పుడు నన్ను ఇలా మోసం చేస్తావా' అని వేణుని నిలదీసింది. దానికి అతను 'నా మరదలిని పెండ్లి చేసుకోకపోతే తను చనిపోతాను అంటుంది. మా అమ్మానాన్న, వాళ్ళ అమ్మానాన్న మా చిన్నతనంలోనే మా ఇద్దరికీ పెండ్లి చేస్తామని మాట ఇచ్చి పుచ్చుకున్నారంట. మా అమ్మ కూడా మామయ్య కూతురినే పెండ్లి చేసుకోవాలని ఒట్టు వేయించుకుంది. ఇప్పుడు నేనేం చేసే పరిస్థితుల్లో లేను, నన్ను అర్థం చేసుకో. నిన్ను మాత్రం నేను వదులుకోలేనూ' అంటూ బతిమలాడాడు.

మరి ఇప్పుడు ఏం చేస్తాం అంటే 'నిన్ను వదిలి పెట్టి నేను ఉండలేను. అందుకే పెండ్లి చేసుకోకపోయినా ఇద్దరం కలిసే ఉందాం. మా అమ్మకు ఒట్టు వేసాను కాబట్టి నా మరదలిని పెండ్లి చేసుకుంటాను' అన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అర్థంకాక తెలిసిన వారు చెబితే శ్రీనిధి ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.


మేము ఇరు కుటుంబాల వారిని పిలిపించి మాట్లాడాము. వేణు, శ్రీనిధిని మోసం చేశాడు. అయినా ఆమె అతన్నే నమ్ముతుంది. అతను చేసే తప్పులను కూడా ఒప్పు అనుకునేంతగా ఆమె అతన్ని నమ్మింది. వేణుని కూర్చోబెట్టి మాట్లాడితే ఇక్కడ శ్రీనిధిని ప్రేమిస్తూనే అక్కడ తన మరదలితో కూడా ప్రేమాయణం నడిపించాడు. ఇద్దరితో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఇంట్లో పెండ్లికి బలవంతం చేసే సరికి మరదలు కాబట్టి ఆమెనే పెండ్లి చేసుకుంటాననంటున్నాడు. లేదంటే అతనికే ఇబ్బందులు ఎదురవుతాయి. తన సమస్యల నుండి పెండ్లి చేసుకుని బయట పడేందుకు ప్లాన్ చేసుకున్నాడు.

'ప్రేమ పేరుతో ఇన్నాళ్ళు ఇద్దరమ్మాయిల జీవితాలతో ఆటలాడుతున్నావు. ఇప్పటికీ ఇద్దరితో ఉంటానంటున్నావు. నీ తప్పేమి లేనట్టు నటిస్తున్నావు. నీలాంటి వాళ్ళ వల్ల ప్రేమకున్న విలువ పూర్తిగా దిగజారిపోతుంది. ఇప్పుడు నీపై వాళ్ళు కేసు పెడితే నీ జీవితం నాశనం అవుతుంది' అన్నాము వేణుతో.

దానికి అతను 'నేను ఇద్దరితో ఉంటాను అంటు న్నాను కదా' అన్నాడు. దానికి శ్రీనిధి 'ఇలాంటి వాడిని ప్రేమించినందుకు చాలా బాధ పడుతున్నాను. వీడిని పెండ్లి చేసు కుంటే భవిష్యత్తులో ఇంకెంత మందితో నైనా సంబంధాలు పెట్టుకుంటాడు. నాకు జీవితమే లేకుండా చేస్తాడు. ఇక ఇలాంటి వాడితో నా జీవితాన్ని పంచుకోలేను. నేను మంచి ఉద్యోగం చేస్తున్నాను. నా కాళ్ళపై నేను నిలబడగలను. వీడిని పెండ్లి చేసు కొని నా జీవితాన్ని నా చేతులారా నాశనం చేసుకోలేను. మనం ప్రేమిస్తున్న వారి కన్నా మనల్ని ప్రేమించే వారితో జీవితం హాయిగా ఉంటుంది. నేను ప్రేమించిన వ్యక్తి సరైనవాడు కాదు. కొంచెం టైం తీసుకుని మా అమ్మానాన్న చూసిన వ్యక్తిని పెండ్లి చేసుకుంటాను. మా అమ్మ వాళ్లు నా గురించి ఎంతో ఆలోచిస్తారు. ఎప్పుడూ నేను సంతోషంగా ఉండాలనే కోరుకుంటారు. నా కంటే కూడా నా సంతోషం గురించి వాళ్ళే ఎక్కువగా ఆలోచిస్తారు. ఇన్నేళ్లు వేణును నమ్మి పెద్ద తప్పు చేశాను. ఇకపై మా అమ్మానాన్న చెప్పిన మాట వింటాను' అంటూ శ్రీనిధి వెళ్ళిపోయింది.

వేణు మరదలు కూడా అతన్ని అసహ్యించుకుని పెండ్లి చేసుకోనని వెళ్ళిపోయింది. ప్రేమించడం తప్పు కాదు. కానీ మనం ప్రేమించే వ్యక్తి ఎలాంటి వారు అనేది తెలుసుకొని ప్రేమించాలి. ఎంత గొప్ప ప్రేమికులైనా సమాజంలో ఉంటున్నాము కాబట్టి కొన్ని నిబంధనలు పాటించాలి. పెండ్లికి ముందే భార్యాభర్తల్లా నడుచుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయి. ఇలాంటి సమస్యలతోనే నేటి అమ్మాయిలు ఎన్నో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి ప్రేమ విషయంలో జాగ్రత్తలు తప్పవు.


- వై. వరలక్ష్మి, 9948794051



'ఇలాంటి వాడిని ప్రేమించినందుకు చాలా బాధ పడుతున్నాను. వీడిని పెండ్లి చేసు కుంటే భవిష్యత్తులో ఇంకెంత మందితో నైనా సంబంధాలు పెట్టుకుంటాడు. నాకు జీవితమే లేకుండా చేస్తాడు. ఇక ఇలాంటి వాడితో నా జీవితాన్ని పంచుకోలేను. నేను మంచి ఉద్యోగం చేస్తున్నాను. నా కాళ్ళపై నేను నిలబడగలను. వీడిని పెండ్లి చేసు కొని నా జీవితాన్ని నా చేతులారా నాశనం చేసుకోలేను.

రోజుకో యాపిల్

- యాపిల్ మెదడును చురుగ్గా మార్చేస్తుంది. మతిమరపుకి కారణమయ్యే అల్జీమర్స్ వ్యాధిని నివారిస్తూ, మెదడుకి రక్షణనిస్తుంది. అంతేకాదు నరాలపై ప్రభావం చూపే, పార్కిన్‌సన్స్ వ్యాధిని కూడా తగ్గిస్తుంది.
- కంటి చూపును కాపాడుతుంది. కాటరాక్ట్, గ్లకోమా వంటి సమస్యల్ని దూరం చేస్తుంది. కంటి చూపును మెరుగుపరచి, రేచీకటి రాకుండా చేస్తుంది. ఈ పండులోని ఫ్లేవనాయిడ్స్, యాంటీ ఆక్సిడెంట్ ఫైటో న్యూట్రియంట్స్ సూక్ష్మజీవుల నుంచీ కండ్ల హాని జరగకుండా కాపాడతాయి.
- యాపిల్‌లో విటమిన్ సి ఉంటుంది. ఇది శరీరంలో రోగనిరోధకశక్తిని మరింత పెంచుతుంది. తద్వారా ఎన్నో వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
- యాపిల్‌లోని శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్స్ ఎన్నో రకాల కేన్సర్ల నుంచి మనల్ని కాపాడతాయి.



మిగతా పండ్లతో పోల్చితే పాంక్రియాస్ కేన్సర్ ముప్పు నుంచి రక్షణ కల్పించే గుణం యాపిల్‌లో 23 శాతం ఎక్కువ అని అమెరికన్ అసోసియేషన్ ఫర్ కేన్సర్ రీసెర్చ్ పరిశోధనల్లో తేలింది.

- దీనిలో ట్రైటెర్పినాయిడ్స్ అనే పోషకాలు... కాలేయ కేన్సర్, పెద్ద పేగు కేన్సర్, రొమ్ము కేన్సర్‌లను నివారిస్తాయని కార్నెల్ యూనివర్శిటీ చేసిన పరిశోధనలో తేలింది.
- యాపిల్‌లో కొలెస్ట్రాల్‌ను తగ్గించే గుణం ఉంది. అందువల్ల రక్తనాళాల ఆరోగ్యం మెరుగయ్యి, గుండె ఆరోగ్యంగా ఉంటుంది.
- త్వరగా ముసలితనం రాకుండా కాపాడుతుంది. ఇందులోని శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్స్ చర్మ కణాల్ని కాపాడతాయి. యాపిల్ గుజ్జులో తేనెను కలిపి చర్మానికి పట్టిస్తే, యవ్వన ఛాయలతో మెరిసే స్కిన్ పొందొచ్చు
- ఇందులోని పీచు అధిక బరువును తగ్గించేందుకు తోడ్పడుతుంది
- మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో ఒకటైన కాలేయంలోని విషాల్ని విజయవంతంగా తొలగిస్తుంది.

ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే రోజుకో యాపిల్ తింటే డాక్టర్ దగ్గరకు వెళ్లాల్సిన పని ఉండదంటున్నారు పరిశోధకులు. ఇవి మనకు ఏడాదంతా దొరుకుతాయి కాబట్టి, ప్రణాళికా బద్ధంగా తింటూ ఉంటే మనకు తెలియకుండానే చాలా రకాల రోగాల బారిన పడకుండా తప్పించుకోవచ్చు.

అనుకున్నంతగా గజ్వేల్ అభివృద్ధి కాలేదు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. రాష్ట్ర అభివద్ధి ఆగదని, ప్రగతిపథంలో ఇంకా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత విద్యుత్, తాగు నీటి సమస్యలు పరిష్కరించుకున్నామని తెలిపారు. సాగు నీటి ప్రాజెక్టుల సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని వివరించారు. గజ్వేల్ నియోజకవర్గం పరిధిలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు ఉండాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల కింద భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారం, పది రోజుల్లో ఉన్నతస్థాయి సమీక్ష జరిపి తగిన ఆదేశాలు జారీ చేస్తానన్నారు. ఈ క్రమంలోనే తాను గెలిచిన తర్వాత మళ్లీ సీఎం హోదాలో తొలి సమావేశం ఈ హాలులోనే ఏర్పాటు చేసుకుందామన్నారు. గజ్వేల్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే తలమానికంగా తీర్చిదిద్దుతానని వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు, ముఖ్య నేతలు వంటేరు ప్రతాప్ రెడ్డి, రఘోత్తమ్‌రెడ్డి, గజ్వేల్, కొండపాక, కుకునూర్‌పల్లి, జయదేవ్‌పూర్, మర్కూక్, ములుగు, వర్గల్, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి

(మొదటిపేజీ తరువాయి)



పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఆ డబ్బులను బయటకు తీసి ప్రజలకు అందించడానికి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు సర్వీస్‌లాగానే తెలంగాణలో సైతం ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నెలా రూ.2500 ప్రతి మహిళకూ అందిస్తామన్నారు. 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికీ 200 యూనిట్‌ల కరెంట్ ఉచితంగా ఇస్తామని చెప్పారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరతోపాటు పసుపుకూ మద్దతు ధర కల్పిస్తామని, ఎంఎస్‌పి కంటే అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇండ్లు లేని అందరికీ ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లు నిర్మిస్తామన్నారు. చేయూత పథకం ద్వారా నాలుగు వేల రూపాయల వృద్ధాప్య పింఛన్ అందిస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గద్దె దించి కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. బాల్కొండలో సునీల్‌రెడ్డిని, ఆర్మూర్‌లో వినయ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరుస్తాం..

నిజాం చక్కెర ఫ్యాక్టరీని కేసీఆర్ ప్రభుత్వం మూసేసిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యాక్టరీని తెరిపిస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. పసుపు మద్దతు ధర రూ.5 వేలకు పెంచుతామని, వరి ధాన్యానికి బోనస్ రూ.500 పెంచుతామని అన్నారు. గాంధీ కుటుంబానికి తెలంగాణతో ప్రత్యేక అనుబంధ ఉందని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటే అని విమర్శించారు. బీజేపీ ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకూ బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తే తనపై కేసులు పెట్టారని, పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయించారని, ఇల్లు లేకుండా చేశారని అన్నారు. కానీ దేశమే తన ఇల్లు అని చెప్పారు. కులగణన చేయాలని పార్లమెంట్‌లో ప్రధాని మోడీని ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వలేకపోయారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం తనపై 24 కేసులు నమోదు చేసిందని, అయినా భయపడేది లేదని, ప్రజా సంక్షేమం కోసమే పాటుపడతానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రతిపక్షాలపై బీజేపీ.. సీబీఐ, ఈడీతో దాడులు చేయిస్తోందని విమర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వంపై మాత్రం ఎందుకు విచారణ చేయించడం లేదని ప్రశ్నించారు.

కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నాయకులు సుదర్శన్ రెడ్డి, మధుయాష్కి గౌడ్, మహేష్ కుమార్‌గౌడ్, షబ్బీర్ అలీ, సునీల్‌రెడ్డి, వినయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇలాంటి పిటిషన్లతో ప్రయోజనం ఏంటీ !

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



బీఆర్ఎస్ కి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కారును పోలిన గుర్తులను ఇతర స్వతంత్ర, చిన్న పార్టీల అభ్యర్థులకు కేటాయించొద్దని, బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. యువ తులసీ పార్టీకి రోడ్ రోలర్, అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీకి చపాతి రోలర్ గుర్తులను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) కేటాయించడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. అలాగే కారును పోలిన ఫ్రీ సింబల్స్ ను ఇతర పార్టీలకు కేటాయించకుండా ఈసీఐకి ఆదేశాలు ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్ ను రాష్ట్ర హైకోర్టు తిరస్కరించడంపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ రెండు పిటిషన్‌ల ను శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మసనం విచారించింది. బీఆర్ఎస్ తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గీ, మీనాక్షి అరోరాలు వాదనలు వినిపించారు. కారును పోలిన గుర్తులను ఇతర అభ్యర్థులకు కేటాయించడం వల్ల ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారని ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపించారు. దీనికి జస్టిస్ ఓకా స్పందిస్తూ 'అందులో ఒక పార్టీ మీ పార్టీని ఓడిస్తుందని ఆందోళన చెందుతున్నారా? అవన్నీ పూర్తిగా పోలికలేని(డిఫరెంట్) గుర్తులు. దేశంలోని ఓటర్లు కారు, రోడ్డు రోలర్, చపాతీ రోలర్‌లకు తేడా తెలియనంత రాజకీయ నిరక్షరాస్యులు కాదు' అని వ్యాఖ్యానించారు.

అనంతరం మీనాక్షి అరోరా వాదనలు వినిపిస్తూ... ఈవీఎం మెషిన్లలో రోడ్ రోలర్, చపాతీ రోలర్, పలు ఫ్రీ సింబల్స్ కారు గుర్తుగానే కన్పిస్తున్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇవీ ఓటర్లను కొంత వరకు గందరగోళానికి గురి చేసి, క్రాస్ ఓటింగ్ కు దారితీయవచ్చన్నారు. ఈ సందర్భంగా పార్టీ గుర్తులకు సంబంధించి సదిక్ అలీ కేసులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. అయితే... మీనాక్షి అరోరా తో ద్విసభ్య ధర్మాసనం ఏకీభవించలేదు. ఎన్నికల షెడ్యూల్ విడుదల తర్వాతే ఇలాంటి అంశాలు గుర్తుకు వస్తాయా? అని ప్రశ్నించింది. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసి... ఎన్నికలు వాయిదా వేయాలని కోరుకుంటున్నారా? అని అసంతృప్తి వ్యక్తం చేసింది. మునుగోడు ఎన్నికల సందర్భంగా కూడా హైకోర్టు కొట్టివేసిన పిటిషన్ పై ఆలస్యంగా వచ్చారని ధర్మాసనం అభిప్రాయపడింది. అధికార పార్టీ అయి ఉండి సుమారు 274 రోజులు ఆలస్యంగా ఎలా వస్తారని ప్రశ్నించింది. ఆలస్యం కారణంగా ఈ పిటిషన్ పై విచారణ చేపట్టడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. అయితే రిట్ పిటిషన్ పై హైకోర్టుకు వెళ్లేందుకు , పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అవకాశం ఇవ్వాలని ముకుల్ రోహిత్గీ అభ్యర్థనను ధర్మాసనం అంగీకరించింది. హైకోర్టుకు వెళ్లవచ్చని, అయితే మెరిట్స్ ఆధారంగానే హైకోర్టు విచారణ ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ, పిటిషన్ ను కొట్టి వేసింది.

ధిక్కార స్వరాలు..

(మొదటిపేజీ తరువాయి)

బోథ్ ఎమ్మెల్యే బాపూరావు... ఇప్పుడు నిరసన గళం విప్పుతున్నారు. తాను కూడా పోటీలో ఉండి తీరతానంటూ బీఆర్ఎస్ అధిష్టానానికి హెచ్చరికలు పంపారు.

కారుకు 'ముదిరాజ్'ల ముప్పు...

మరోవైపు రాష్ట్రంలో బలమైన సామాజిక వర్గమైన ముదిరాజ్‌లు ఈసారి బీఆర్ఎస్‌పై గుర్రుగా ఉన్నారు. ఇప్పటి వరకూ ప్రకటించిన 115 స్థానాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా తమ సామాజిక తరగతికి ఇవ్వలేదంటూ వారు వాపోతున్నారు. అందువల్ల బీఆర్ఎస్‌కు కచ్చితంగా తమ సత్తా చూపుతామంటూ వారు హెచ్చరిస్తున్నారు. ఆ సామాజిక తరగతి నుంచి పటాన్‌చెరు నియోజకవర్గంలో మొదటి నుంచి టిక్కెట్ ఆశిస్తూ వచ్చిన నీలం మధుకు గులాబీ పార్టీ మొండి చేయి చూపించింది. దీంతో ఆయన నియోజకవర్గం మొత్తం పర్యటిస్తూ తమ సామాజిక తరగతికి అన్యాయం జరిగిందంటూ ప్రచారం నిర్వహించారు. సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాల రూపంలో బీఆర్ఎస్‌కు వార్నింగ్ పంపారు. అయినా ప్రగతి భవన్ నుంచి పిలుపు రాకపోవటంతో ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఆ పార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నారు. హస్తం పార్టీ టిక్కెట్ ఇస్తే ఓకే..లేదంటే ఆయన స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశముందని మధు సన్నిహితులు చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో 'ముదిరాజ్'ల ప్రభావం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కచ్చితంగా పడే అవకాశముంది. ముఖ్యంగా మెదక్, సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌తోపాటు మరికొన్ని నియోజకవర్గాల్లో గెలుపోటములను అది ప్రభావం చేయనుంది. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌పై పోటీ చేయనున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు ఇది సానుకూలాంశంగా మారనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతుండటం గమనార్హం. సీఎం కేసీఆర్ ఈ పరిణామాలన్నింటినీ గమనించే అదే సామాజిక తరగతికి చెందిన మామిళ్ల రాజేందర్ (టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షులు) చేత వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేయించి, ఆ వెంటనే పార్టీలో చేర్చుకున్నారు. ఆయన చేరిక బీఆర్ఎస్‌కు ఏ మేరకు ఉపయోగపడుతుందో చూడాలి.

ఊహించని షాక్...

తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ వెంట నడిచిన ఢిల్లీ వసంత్ కుమార్... బీఆర్ఎస్‌కు ఊహించని షాక్‌నిచ్చారు. జహీరాబాద్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మాణిక్‌రావుకు మరోసారి టిక్కెట్ ఇవ్వటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. తనకు టిక్కెట్ ఇస్తారనే ఆశతో చివరి దాకా ఎదురు చూసిన వసంత్... ఇటీవల బీజేపీలో చేరారు. 'ఇన్నాళ్లూ పార్టీనే నమ్ముకుని పని చేసిన నాకు టిక్కెట్ ఇవ్వలేదు, అందువల్ల ఈసారి నా సత్తా ఏంటో చూపుతా...' అంటూ ఆయన బీఆర్ఎస్‌కు హెచ్చరికలు పంపారు.

అబ్రహం ఏం చేస్తారో...?

ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంకు చివరి నిమిషంలో ఎదురు దెబ్బ తగలనున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ తొలి జాబితాలో ఆయన పేరున్నప్పటికీ... బీ-ఫామ్ మాత్రం ఇప్పటికీ ఇవ్వలేదు. ఈ విషయమై చర్చించేందుకు గురువారం తెలంగాణ భవన్‌కు వచ్చిన అబ్రహంకు మంత్రి కేటీఆర్ అపాయింట్‌మెంట్ దక్కలేదు. దీంతో ఆయన నిరాశగా వెనుదిరిగారు. అబ్రహం స్థానంలో ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి అనుయాయుడు విజయుడుకు టిక్కెట్ దక్కనున్నట్టు సమాచారం. ఈ ఎపిసోడ్ మొత్తంలో వెంకటరామిరెడ్డి చక్రం తిప్పినట్టు వినికిడి. సీఎం కేసీఆర్ కచ్చితంగా ఆయనకే బీ-ఫామ్ ఇస్తారని తెలిసింది. మరి ఇదే జరిగితే ఇతర నేతల మాదిరిగా అబ్రహం కూడా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా? లేక పార్టీకి విధేయుడిగా ఉంటారా..? అనేది చూడాలి.

రాష్ట్రానికి కేంద్ర బలగాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు వంద కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రానికి శుక్రవారం చేరుకున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం మొత్తం 300 కంపెనీల కేంద్ర బలగాలను కోరగా, తొలి విడతగా వంద కంపెనీల భద్రతా సిబ్బందిని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పంపింది. ఒక్కో కంపెనీలో 60 నుంచి 80 మంది భద్రతా సిబ్బంది ఉంటారు. అస్సాం రైఫిల్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీస్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్, సశస్త్ర సీమాబల్ దళాలకు చెందిన భద్రతా బలగాలు దీనిలో ఉన్నాయి. ఎన్నికల సంఘం రాష్ట్రంలో 46 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యాక మరికొన్ని కేంద్ర భద్రతా బలగాలు రాష్ట్రానికి రానున్నాయి.

వీఎస్ జీవిత కథ ఎ సెంచరీ ఆఫ్ స్ట్రగుల్

తిరువనంతపురం : ప్రముఖ కమ్యూనిస్టు నేత, మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ 100వ జన్మదినం సందర్భంగా తిరువనంతపురంలోని అయ్యంకాళి హాలులో ఆయన జీవిత కథను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆవిష్కరించారు. దర్శకుడు షాజీ ఎన్ కరుణ్ పుస్తకాన్ని అందుకున్నారు. చింతా పబ్లిషర్స్ ప్రచురించిన పుస్తకానికి రచయిత కె.వి.సుధాకరన్. ఈ సందర్భంగా సీఎం పినరయి విజయన్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రతో ముడిపడివున్న విఎస్ జీవితాన్ని ఈ పుస్తకంలో చక్కగా వివరించారని తెలిపారు. గతంలో వచ్చిన పుస్తకాలు అలా లేవని, పార్టీ నుంచి విడదీసి విఎస్‌ను ప్రత్యేకంగా చూపే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. ఎనిమిది దశాబ్దాలుగా విఎస్ ప్రజల పక్షాన చురుగ్గా పనిచేశారని తెలిపారు. 96 ఏండ్ల వయసులో అనుకోకుండా కొన్ని శారీరక సమస్యలు ఎదురయ్యాయని చెప్పారు. అప్పటి నుంచి విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపారు.

విప్లవ నేత అచ్యుతానందన్‌కు విప్లవ జేజేలు

- అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కష్టజీవుల హక్కులు, సామాజిక న్యాయం కోసం అవిశ్రాంత పోరాటాన్ని కొనసాగించిన నేత వీఎస్ అచ్యుతానందన్ 101వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం అభినందనీయమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ అన్నారు. శుక్రవారం ఢిల్లీ కేంద్ర కార్యాలయంలో వీఎస్ అచ్యుతానందన్ నూరేండ్లలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకుల్లో ఆయన ఒకరని కేరళ రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక ఉద్యమాన్ని విస్తరింప చేయడంలో ఆయన కృషి కీలకమైందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాములు పెత్తందారులు అనుసరిస్తున్న అణచివేత, కులవివక్ష, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా అట్టడుగు వర్గాలను సమీకరించి బలమైన పోరాటాలను నిర్వహించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే, సీఎంగా ఆయన పేదల పక్షపాతి గానే నిరంతరం వ్యవహరించారని తెలిపారు. ఆయన కుమారుడైన డాక్టర్ అరుణ్‌కు టెలిఫోన్ ద్వారా మాట్లాడి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ సహాయ కార్యదర్శి, ఎంపీ శివదాసన్ మరో సహాయ కార్యదర్శి విక్రమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనగాచి నక్కల పాల్జేయొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ ఉండేవా..? అని ప్రశ్నించారు. బీసీ జనగణన చేయాలంటూ కోరితే ప్రధాని మోడీ పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి బీఆర్ఎస్ గెలిస్తే... సీఎం కేసీఆర్‌తో తమకు ఇబ్బందులు తప్పవనే భయం కాంగ్రెస్, బీజేపీకి పట్టుకుందని అన్నారు. అందుకే ఎన్నికల్లో తమ పార్టీని ఓడించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలతో పోలిస్తే ముదిరాజ్‌లను అక్కున చేర్చుకున్నది, ఆదుకున్నది బీఆర్ఎస్సేనని చెప్పారు. కాంగ్రెస్‌కు ఐదారుగురు ముఖ్యమంత్రి అభ్యర్థులుంటారు.. కానీ ఆ పార్టీకి ఓట్లేయటానికి ఓటర్లే లేరంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాగా కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత చెరుకు సుధాకర్ కూడా త్వరలోనే గులాబీ గూటికి చేరనున్నారు.

సంక్షేమం..సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

బిల్లులు, ప్రభుత్వ ఉద్యోగుల ఇతర ఆర్థిక పరమైన బిల్లులు కూడా ట్రెజరీ వద్దే పెండింగ్‌లో ఉండిపోయాయి. సంక్షేమ పథకాల లబ్దిదారులతో పాటు ప్రతి చెల్లింపు విషయంలోనూ ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి కావడంతో ఈ ప్రతిష్టంభన కొనసాగుతున్నదని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే 2018 ఎన్నికల సమయంలో పోలింగ్ రోజే రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అయిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. అయితే అప్పుడూ, ఇప్పుడూ పరిస్థితులు ఒకేలా లేవంటూ సీఈఓ కార్యాలయంలో చర్చ జరుగుతుండటం గమనార్హం.

మారో తీన్‌మార్



ప్రపంచకప్‌లో నేడు
నెదర్లాండ్స్ x శ్రీలంక
వేదిక : లక్నో
సమయం : ఉ. 10.30
ఇంగ్లాండ్ x దక్షిణాఫ్రికా
వేదిక : ముంబయి
సమయం : మ. 2.00
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

ఎంసీఏపై ఫ్యాన్స్ ఫైర్



పుణె : భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్‌కు పుణెలోని ఎంసీఏ స్టేడియంలో అభిమానులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మ్యాచ్ మొదలైనా లోపలికి ప్రవేశించేందుకు 2 కిలోమీటర్ల మేర క్యూలైన్, ద్వి చక్ర వాహనాల పార్కింగ్‌కు సైతం రూ.100 వసూలు సహ స్టేడియం లోపల ఆహార పదార్థాలకు ఆకాశన్నంటే ధరలతో అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెచ్‌సీఏ గద్దెపై జగన్

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో సరికొత్త చరిత్ర. దశాబ్దాలుగా కొందరి చేతుల్లోనే మగ్గుతున్న హెచ్‌సీఏకు నయా సారథి వచ్చాడు. అర్శినపల్లి జగన్‌మోహన్ రావు హెచ్‌సీఏ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్ గ్రూప్, వివేక్ వెంకటస్వామి గ్రూప్‌లను ఢీకొట్టి అధ్యక్ష రేసులో జయకేతనం ఎగురవేసిన జగన్ హెచ్‌సీఏ అధ్యక్షుడిగా మూడేండ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు.

- ఒక్క ఓటు తేడాతో అధ్యక్షుడిగా ఎన్నికైన జగన్‌మోహన్ రావు
- కార్యదర్శిగా దేవరాజ్, కోశాధికారిగా శ్రీనివాస రావు ఎన్నిక
- ఉపాధ్యక్షుడిగా దల్జీత్ సింగ్, సంయుక్త కార్యదర్శిగా బసవరాజు
- హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలు వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్

స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్, విద్యావేత్త అర్శినపల్లి జగన్‌మోహన్ రావు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో సమీప ప్రత్యర్థి, శివలాల్ యాదవ్-అర్షద్ అయూబ్ గ్రూప్‌కు చెందిన అమర్‌నాథ్‌పై ఒక్క ఓటు తేడాతో జయకేతనం ఎగురవేశారు. జగన్‌మోహన్ రావుకు 63 ఓట్లు రాగా.. అమర్‌నాథ్‌కు 62 ఓట్లు వచ్చాయి. వివేక్ వెంకటస్వామి గ్రూప్ నుంచి పోటీచేసిన అనిల్‌కుమార్‌కు 34, హెచ్‌హెచ్‌గ్రూప్ అభ్యర్థి పి.ఎల్ శ్రీనివాస్‌కు 10 ఓట్లు వచ్చాయి. ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు ఎన్నికలు జరుగగా 173 మంది ఓటర్లలో 169 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దల్జీత్ సింగ్, కార్యదర్శిగా దేవరాజ్, సంయుక్త కార్యదర్శిగా బసవరాజు, కోశాధికారిగా



సి.జె శ్రీనివాసరావు, కౌన్సిలర్‌గా సునీల్ కుమార్ అగర్వాల్ ఎన్నికయ్యారు. హెచ్‌సీఏ నూతన అపెక్స్ కౌన్సిల్ మూడేండ్ల పాటు పదవిలో ఉండనుంది. అపెక్స్ కౌన్సిల్‌కు ఎన్నికైన అభ్యర్థులకు ఎన్నికల అధికారి, మాజీ సీఈసీ వి.ఎస్ సంపత్ సర్టిఫికెట్లను అందజేశారు.

జగన్ జయకేతనం

బహుళ యజమాన్యంలోని 57 క్లబ్‌లపై వేటు పడటంతో ఈ సారి ఎన్నికల్లో అందరికీ సమాన అవకాశాలు కనిపించాయి. నాలుగు ప్యానల్స్ పోటీలో నిలిచినా అధ్యక్ష రేసులో రెండు ప్యానల్స్ నడుమే విజయం దోబూచులాడింది. హెచ్‌సీఏ దిగ్గజాలు శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్ దశాబ్దాలుగా అసోసియేషన్‌ను తమ కనుసన్నల్లో ఏలుతున్నారు. ఈసారి ఎన్నికల్లో ఆ ఇద్దరు బలపరిచిన అభ్యర్థి కాకుండా.. తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో బరిలో నిలిచిన అర్శినపల్లి జగన్‌మోహన్ రావు విజయం సాధించారు. అధ్యక్ష అభ్యర్థి ఓట్లను ఆఖర్లో లెక్కించగా.. తొలుత జగన్ 8 ఓట్ల వెనుకంజలో నిలిచారు. పలు రౌండ్ల తర్వాత పుంజుకున్న జగన్ 7 ఓట్ల ఆధిక్యం దక్కించుకున్నారు. అమర్‌నాథ్, జగన్‌లు చెరో 55 ఓట్లు దక్కించుకున్న తర్వాత.. ప్రతి రౌండ్‌కు చెరో ఓటును సొంతం చేసుకోవటంతో ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంది. చివరకు జగన్‌మోహన్ రావు ఒక్క ఓటు ఆధిక్యంతో చారిత్రక విజయం సొంతం చేసుకున్నారు.

జగన్‌మోహన్ రావు ప్యానల్ నుంచి కోశాధికారిగా పోటీ చేసిన సి.జె శ్రీనివాస రావు మంచి ఆధిక్యంతో గెలుపొందారు. శ్రీనివాసరావుకు 64 ఓట్లు పోలవగా, సంజీవ్ (శివలాల్ గ్రూప్) 51, మహేంద్ర (వివేక్ గ్రూప్) 42, జెరార్డ్ 12 ఓట్లు దక్కించుకున్నారు. కీలక కార్యదర్శి పదవిని శివలాల్ గ్రూప్ అభ్యర్థి దేవరాజ్ సాధించారు. దేవరాజ్‌కు అత్యధికంగా 77 ఓట్లు రాగా.. హరినారాయణ (49), ఆగమ్ రావు (30), ఆర్ఎం భాస్కర్ (12) ఆశించిన పోటీ ఇవ్వలేదు. ఉపాధ్యక్షుడిగా దల్జీత్ సింగ్ (వివేక్ గ్రూప్) గెలుపొందారు. దల్జీత్ సింగ్‌కు 63 ఓట్లు, టి శ్రీనివాస రావుకు 46, బాబు రావుకు 18, శ్రీధర్‌కు 41 ఓట్లు వచ్చాయి. సంయుక్త కార్యదర్శిగా వివేక్ ప్యానల్ నుంచి బసవరాజు ఎన్నికయ్యారు. చిట్టి శ్రీధర్‌కు 59 ఓట్లు రాగా.. ఒక్క ఓటు తేడాతో బసవరాజు (60) విజయం సాధించారు. నోయెల్ డెవిడ్‌కు 40, సతీశ్‌కు 8 ఓట్లు వచ్చాయి. కౌన్సిలర్‌గా శివలాల్ ప్యానల్ నుంచి సునీల్ కుమార్ అగర్వాల్ ఎన్నికయ్యారు. సునీల్‌కు 59 ఓట్లు రాగా.. అన్సార్‌కు 50, వినోద్‌కు 47, వాల్టర్‌కు 13 ఓట్లు వచ్చాయి.

హెచ్‌సీఏ నూతన అపెక్స్ కౌన్సిల్

అధ్యక్షుడు : అర్శినపల్లి జగన్‌మోహన్ రావు
ఉపాధ్యక్షుడు : దల్జీత్ సింగ్
కార్యదర్శి : దేవరాజ్
సంయుక్త కార్యదర్శి : బసవరాజు
కోశాధికారి : సి.జె శ్రీనివాస రావు
కౌన్సిలర్ : సునీల్ కుమార్ అగర్వాల్



కేసీఆర్‌కు అంకితం

ఈ విజయం సీఎం కేసీఆర్‌కు అంకితం. హెచ్‌సీఏ ఇద్దరు ముగ్గురిది కాదు తెలంగాణ సొత్తు అని నిరూపించాను. అధ్యక్షుడిగా ఎన్నుకున్న హెచ్‌సీఏ సభ్యులకు ధన్యవాదాలు. ప్రతి తెలంగాణ క్రికెటర్ గర్వపడేలా హెచ్‌సీఏను అభివృద్ధి చేస్తాను'

- జగన్‌మోహన్ రావు

సెమీస్‌లో సింధు



- డెన్మార్క్ ఓపెన్ సూపర్ 750

ఒడెన్సె (డెన్మార్క్) : భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి క్రీడాకారిణి, తెలుగు తేజం పి.వి సింధు సుదీర్ఘ విరామం అనంతరం జోరందుకుంది!. ఇటీవల వరుస టోర్నీల్లో నిరాశపరిచిన సింధు.. తాజాగా డెన్మార్క్ ఓపెన్‌లో దుమ్మురేపుతోంది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో థాయ్‌లాండ్ షట్లర్ సుపనిదను చిత్తు చేసిన సింధు 2-0తో విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన క్వార్టర్స్ పోరులో 21-19, 21-12తో సింధు గెలుపొందింది. నేడు జరిగే సెమీఫైనల్లో తైజుయింగ్ లేదా కరోలినా మారిన్‌లలో ఒకరితో ఢీకొట్టనుంది. 47 నిమిషాల్లోనే ముగిసిన క్వార్టర్స్‌లో సింధు ఆకట్టుకుంది. తొలి గేమ్‌లో విరామ సమయానికి 11-8తో ముందంజ వేసిన సింధు.. విరామం అనంతరం సైతం అదే జోరు కొనసాగించింది. సుపనిద ఏ దశలోనూ సింధుకు పోటీ ఇవ్వలేదు. ఇక రెండో గేమ్‌లో సింధుకు ఎదురులేదు. 11-9తో ప్రథమార్థంలో ముందంజ వేసిన సింధు విరామం తర్వాత రెచ్చిపోయింది. వరుస పాయింట్లతో సుపనిదను చిత్తు చేసింది.

ఆసీస్ అదుర్స్



- పాక్‌పై 62 పరుగులతో గెలుపు
- ఐసీసీ 2023 ప్రపంచకప్

చెన్నై : ప్రపంచకప్‌లో అగ్రజట్టు ఆస్ట్రేలియా ఊపందుకుంది. ఆరంభంలో వరుస పరాజయాలు చవిచూసిన ఆస్ట్రేలియా వరుసగా రెండు విజయాలతో గెలుపు ట్రాక్ ఎక్కింది. శుక్రవారం చెపాక్‌లో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై ఆస్ట్రేలియా 62 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్లకు 367 పరుగులు సాధించింది. ఓపెనర్లు డెవిడ్ వార్నర్ (163, 124 బంతుల్లో 14 ఫోర్లు, 9 సిక్సర్లు), మిచెల్ మార్ష్ (121, 108 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్సర్లు) ధనాధన్ సెంచరీలతో చెలరేగారు. తొలి వికెట్‌కు వార్నర్, మార్ష్ 259 పరుగుల భారీ స్కోరు నమోదు చేశారు. దీంతో ఆస్ట్రేలియా 367 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో పాకిస్థాన్ 45.3 ఓవర్లలో 305 పరుగులకు కుప్పకూలింది. షఫీక్ (64), ఇమామ్ ఉఉల్ హాక్ (70), రిజ్వాన్ (46), షకీల్(30) మెరిసినా ఆ జట్టు గెలుపు గీతకు చేరువ కాలేదు. ఆసీస్ బౌలర్లలో ఆడం జంపా (4/53), స్టోయినిస్ (2/40), పాట్ కమిన్స్ (2/62) రాణించారు. పాక్ పేసర్ షహీన్ అఫ్రిది (5/54) ఐదు వికెట్ల ప్రదర్శనతో మెరిశాడు. డెవిడ్ వార్నర్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

పాండ్య లోటు పూడ్చేదెలా?!

- చీలమండ గాయంతో కివీస్ మ్యాచ్‌కు దూరం
- తుది జట్టు సమతూకంపై ప్రభావం

నవతెలంగాణ-ధర్మశాల

ఐసీసీ 2023 ప్రపంచకప్ గ్రూప్ దశలో వరుసగా నాలుగు విజయాలు నమోదు చేసిన టీమ్ ఇండియా.. పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్‌తో పాటు అగ్రపథాన దూసుకెళ్తోంది. సొంతగడ్డపై తొలి నాలుగు మ్యాచుల్లో అలవోక విజయాలు సాధించిన రోహిత్‌సేనకు ఐదో మ్యాచ్‌లో ఊహించని తలనొప్పి మొదలైంది. టీమ్ ఇండియా స్టార్ ఆటగాడు, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య చీలమండ గాయంతో న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో తుది జట్టులో హార్దిక్ పాండ్య స్థానాన్ని భర్తీ చేయటం జట్టు మేనేజ్‌మెంట్‌కు పెద్ద సవాల్‌గా మారింది. భారత్, న్యూజిలాండ్ ఆదివారం ధర్మశాల వేదికగా గ్రూప్ దశ మ్యాచ్‌లో తలపడనున్నాయి.

పాండ్య స్థానంలో ఎవరు? : ప్రపంచకప్ గ్రూప్ దశ తొలి నాలుగు మ్యాచుల్లో టీమ్ ఇండియా తుది జట్టు కూర్పు



అదిరింది. గిల్, రోహిత్, విరాట్, శ్రేయస్, రాహుల్ రూపంలో ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు.. బుమ్రా, సిరాజ్, కుల్దీప్ స్పెషలిస్ట్ బౌలర్లుగా ఉన్నారు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా జడేజా, పేస్ ఆల్‌రౌండర్ హార్దిక పాండ్య కొనసాగగా.. పార్ట్ టైమ్ పేస్‌తో పాటు ఎనిమిదో స్థానంలో విలువైన బ్యాటర్‌గా శార్దుల్ ఠాకూర్ తుది జట్టులో నిలుస్తున్నారు. హార్దిక్ పాండ్యకు గాయంతో జట్టులో అతడికి ప్రత్యామ్నాయం మరో పేస్ ఆల్‌రౌండర్ లేదు. ఐదుగురు బౌలర్లతో కూడిన తుది జట్టు కూర్పుతో సమస్యలు ఉన్నాయి. శార్దుల్ ఠాకూర్ పూర్తి కోటా ఓవర్లు ఏ మ్యాచ్‌లోనూ వేయలేదు. బ్యాట్‌తో, బంతితో హార్దిక్‌ను భర్తీ చేయగల ఆటగాడు ఎవరూ లేరు. దీంతో అదనపు బ్యాటర్ లేదా అదనపు బౌలర్‌ను తీసుకోవాల్సిన పరిస్థితి. ఈ నిర్ణయంతో తుది జట్టు కూర్పు సమతూకం తప్పనుంది. అయినా, జట్టు మేనేజ్‌మెంట్‌కు మరో మార్గం



లేదు. బ్యాటర్‌ను తీసుకోవాలని భావిస్తే సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్‌లలో ఒకరు పాండ్య స్థానంలో ఆడేందుకు అవకాశం ఉంది. ఇషాన్ కిషన్ బ్యాటింగ్ లైనప్‌కు కుడి ఎడమ కాంబినేషన్ తీసుకురానుండగా.. సూర్యకుమార్ యాదవ్ జట్టుకు 'ఎక్స్ ఫ్యాక్టర్' కాగలడు. బౌలర్‌ను ఎంచుకోవాలని అనుకుంటే రవిచంద్రన్ అశ్విన్ అందుబాటులో ఉన్నాడు. అప్పుడు తుది జట్టులో ఇద్దరే పేసర్లు ఉంటారు. ధర్మశాల పిచ్ పేస్, స్వింగ్‌కు స్వర్గధామం. ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచుల్లో మంచి స్వింగ్ లభించిన వేదికల్లో ధర్మశాల ముందుంది. దీంతో ఈ పిచ్‌పై అశ్విన్, జడేజా, కుల్దీప్ స్పిన్ త్రయంతో బరిలోకి దిగటం తెలివైన నిర్ణయం కాబోదు. దీంతో శార్దుల్ ఠాకూర్ నుంచి మరింత మెరుగైన బౌలింగ్ ప్రదర్శన ఆశిస్తూ.. తుది జట్టులో స్పెషలిస్ట్ బ్యాటర్‌కే అవకాశం కల్పించే వీలుంది. రాహుల్ ద్రవిడ్, రోహిత్ శర్మ ద్వయం ఈ అంశంలో ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి.



పాండ్యకు విశ్రాంతి

బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో సొంత బౌలింగ్‌లో బంతిని ఆపబోయి చీలమండ గాయానికి గురైన భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు వైద్యులు విశ్రాంతి అవసరమని సూచించారు. దీంతో ఆదివారం న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు పాండ్య దూరమయ్యాడు. అక్టోబర్ 29న లక్నోలో ఇంగ్లాండ్‌తో మ్యాచ్ సమయానికి జట్టుతో చేరతాడని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. 'హార్దిక్ పాండ్య జట్టుతో పాటు ధర్మశాలకు వెళ్లటం లేదు. వైద్య పరీక్షల అనంతరం పాండ్యకు విశ్రాంతి అవసరమని చెప్పారు. అక్టోబర్ 29న ఇంగ్లాండ్‌తో మ్యాచ్ కోసం హార్దిక్ నేరుగా లక్నో చేరుకుంటాడు' అని బీసీసీఐ తెలిపింది.

కళ్యాణ్ రామ్ నయా సినిమా షురూ..



కళ్యాణ్ రామ్ కథానాయకుడిగా అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై ఓ భారీ బడ్జెట్ చిత్రం శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో విజయశాంతి ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుకలో చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు సెలబ్రిటీలు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి విజయశాంతి క్లాప్ కొట్టగా, మురళీ మోహన్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ముప్పా వెంకయ్య చౌదరి స్క్రిప్ట్ అందించారు. భారీ బడ్జెట్, హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రదీప్ చిలుకూరి పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేయటంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. ముప్పా వెంకయ్య సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కళ్యాణ్ రామ్ కెరీర్‌లో ఈ సినిమా ఓ మైల్ స్టోన్ మూవీగా నిలిచిపోయేలా, ఆయన పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని మేకర్స్ తెలిపారు. 'కథానాయకుడు కళ్యాణ్‌రామ్ ఎప్పటికప్పుడు వైవిధ్యమైన పాత్రలు, సినిమాలతో ప్రేక్షకులను, ఆయన అభిమానులను అలరిస్తున్నారు. అలాగే ప్రయోగాత్మక చిత్రాలను చేయటానికి కూడా ఆయన వెనుకాడరు. తాజాగా నటిస్తున్న సినిమా కాన్సెప్ట్ చాలా భిన్నంగా ఉంటూ అన్ని వర్గాల ప్రేక్షకుల్ని కచ్చితంగా అలరించేలా ఉంటుంది' అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సి.రామ్ ప్రసాద్, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, ప్రొడక్షన్ డిజైనర్: బ్రహ్మ కడలి, స్క్రీన్ ప్లే: హరికృష్ణ భండారి.

నవచిత్రం

ఘన విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్

బాలకృష్ణ నటించిన తాజా చిత్రం 'భగవంత్ కేసరి' విశేష ప్రేక్షకా దరణతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా, శ్రీలీల కీలక పాత్ర పోషించిన ఈ చిత్రం షైన్ స్క్రీన్స్ బ్యానర్ ద్వారా దసరా కానుకగా ఈనెల19న విడుదలై, అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి, అభిమానులు, ప్రేక్షకులు, విమర్శకులందరి ప్రశంశలు అందుకుని అఖండ విజయం సాధించింది. అంతేకాదు రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ బ్లాక్ బస్టర్ ప్రెస్ మీట్‌ని నిర్వహించింది.



అనిల్ రావిపూడి, శ్రీలీల, సాహు గారపాటి

నాయిక శ్రీలీల మాట్లాడుతూ, 'ఈ సినిమా విజయం గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమాతో నన్ను చూసే విధానం మారింది. ఇంత చక్కని పాత్ర ఇచ్చిన దర్శకుడు అనిల్ రావిపూడికి ధన్యవాదాలు. బాలకృష్ణ సినిమాలో ఒక అమ్మాయికి ఫైట్ చేసే అవకాశం రావడం మామూలు విషయం కాదు. ఆయన దగ్గర వుండి ఎంతో గొప్పగా ప్రోత్సహిం చారు. ఎమోషనల్ సీన్స్‌కి అందరూ గొప్పగా కనెక్ట్ అవుతున్నారు. విజ్జి పాపకు చిచ్చా ఉన్నట్లు మా సినిమాకి ప్రేక్షకులు ఉన్నారు. ఫ్యామిలీ అంతా కలసి సినిమాని ఎంజాయ్ చేస్తున్నారు. ఇంత ఘన విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులు ధన్యవాదాలు' అని తెలిపారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ,'ఇంత అద్భుతమైన పాత్ర చేసి, మాకు ఇంత గొప్ప సినిమా ఇచ్చిన బాలకృష్ణకి హృదయపూర్వక కృతజ్ఞతలు' అని తెలిపారు.

ఈ సినిమా ప్రమోషన్స్ మొదలు పెట్టినప్పటి నుంచి ఒకే మాట చెప్పాం. 'ఈ సినిమా శానా యేండ్లు యాదుంటాది'అని. అది ఈ రోజు ప్రేక్షకులు నిజం చేశారు. ఒక దర్శకుడిగా ఈ సినిమా సంపూర్ణమైన తృప్తిని ఇచ్చింది. సినిమాలో చూపించిన హ్యూమన్ ఎమోషన్స్, తండ్రీ బిడ్డ మధ్య అనుబంధానికి ప్రేక్షకులు చాలా బాగా కనెక్ట్ అయ్యారు. ఆడపిల్లని సింహంలా పెంచాలనే ఒక మంచి కంటెంట్ జనాల్లోకి వెళ్ళింది. బాలకృష్ణ తన కంఫర్ట్ జోన్‌ని దాటి స్త్రీ సాధికారత గురించి ఉన్న ఈ కథని చేశారు. ఈ సినిమాతో హీరోగా ఆయన మరింత ఎత్తుకు ఎదిగారు. శ్రీలీల విజ్జి పాపగా అద్భుతంగా నటించింది. సినిమాని చాలా గొప్పగా ఆదరించారు. ఇది ఆరంభం మాత్రమే. దసరా మరో పది రోజులు ఉంది. బాలకృష్ణతో కలిసి మరో పెద్ద ఈవెంట్‌ని నిర్వహించబోతున్నాం. ఈ సినిమా సక్సెస్ వేడుకలు జరుగుతూనే ఉంటాయి

-దర్శకుడు అనిల్ రావిపూడి

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.